

ప్రజాశక్తి

సిటీ

ప్రతి అక్షరం ప్రజల పక్షం



fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 241 | విజయవాడ, గురువారం 31 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

నోట్ల రద్దు ఫ్లాప్ షో!

ప్రధానమంత్రి నరేంద్రమోడీ అట్టహాసంగా ప్రకటించిన పెద్దనోట్ల రద్దు ఫ్లాప్ షోగా తేలింది. గత ఏడాది నవంబర్ 8వ తేది రాత్రి అనూహ్యంగా చేసిన ప్రకటనలో నిర్ధేశించిన ఒక్క లక్ష్యాన్ని కూడా ఈ ప్రక్రియ చేరుకోలేదు. రద్దు చేసిన నోట్లన్ని దాదాపుగా వెనక్కి వచ్చేసినట్లు తాజాగా రిజర్వ్‌బ్యాంకు చేసిన ప్రకటనతో స్పష్టమైంది. వెయ్యి రూపాయల నోట్లు 99శాతం వెనక్కి వచ్చాయని రిజర్వ్‌బ్యాంకు తెలిపింది. 500 రూపాయల నోట్ల సంఖ్య విషయమై ఆర్‌బిఐ అధికారికంగా ప్రకటన చేయకపోయినప్పటికీ ఆ నోట్లు కూడా దాదాపుగా మొత్తం బ్యాంకులకు చేరాయని చెబుతున్నారు. దీంతో నల్లధనం రద్దు ప్రహసనమేనని స్పష్టమైంది. మొత్తం మీద హడావిడిగా, ఆర్భాటపు ప్రకటనలతో తీసుకున్న ఈ చర్య ప్రజలకు కష్టనష్టాలను, దేశానికి ఆర్థిక భారాన్ని మాత్రమే మిగిల్చింది.

దాదాపు నోట్లన్నీ వెనక్కి : ఆర్‌బిఐ



పూర్తి వివరాలు 2లో

నోట్ల రద్దు లెక్కలు

మోడీ ప్రకటన చేసిన తేది	: నవంబర్ 8. 2016
నోట్ల రద్దు అమలు	: అర్ధరాత్రి నుండే
రద్దయిన మొత్తం కరెన్సీ విలువ	: 15.44 లక్షల కోట్లు
వెయ్యిరూపాయలు	:44 శాతం
500 రూపాయలు	:56 శాతం
వెనక్కి చేరిన నోట్లు	
వెయ్యిరూపాయలు	: 99 శాతం

(500 రూపాయలను మళ్లీ ప్రింట్ చేసి, చలామణిలోకి తేవడంతో వాటి సంఖ్యను ఆర్‌బిఐ ప్రకటించలేదు. అయితే, 99శాతం 500 నోట్లుబ్యాంకులకు చేరినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

బ్యాంకులకు చేరని నగదు

2017 మార్చి 31వ తేదికి 8,925 కోట్ల రూపాయల విలువైన 1,000 రూపాయల నోట్లు బ్యాంకులకు చేరలేదు. అంటే చలామణీలో ఉన్న వెయ్యిరూపాయల నోట్లలో 1.3శాతం మాత్రమే బ్యాంకుల్లో డిపాజిట్ కాలేదు.



మోడీ ఏం చెప్పారు?	ఏం జరిగింది?
నల్లధనంపై	
లక్షల కోట్ల నల్లధనం దేశంలో మూలుగుతోంది. కరెన్సీనోట్లను పరుపుల కింద, గన్నీ సంచుల్లోనూ కూరుతున్నారు. నిజాయితీ పరులైన పౌరులు దీనిని ఎంత కాలం భరించాలి? అందుకే పెద్ద నోట్లు రద్దు చేస్తున్నాం.	రద్దయిన పెద్దనోట్లన్నీ బ్యాంకులకు చేరాయని ఆర్‌బిఐ వార్షిక నివేదికతో స్పష్టమైంది. అంటే నల్లధనం నిర్మూలన కాకపోగా, తెల్లధనంగా మారింది.
దొంగడబ్బుపై	
దేశానికి పెను సవాల్‌గా మారిన ఉగ్రవాదులకు నిధులు ఎక్కడ నుండి అందుతున్నాయో తెలుసా? సరిహద్దుల అవతల శత్రువులు దొంగనోట్లను ముద్రించి తెస్తున్నారు.	పెద్దనోట్లన్నీ ఖజానాకు తిరిగిరావడంతో దొంగ డబ్బు లేకుండా అయినా ఉండాలి. లేకుంటే, మొత్తం దొంగసొమ్ము బ్యాంకులకు చేరి ఉండాలి.
దొంగనోట్ల చలామణి	
నోట్ల రద్దుతో దొంగనోట్లు చలామణిలో నుండి పోతాయి. ప్రజలకు ఆ కష్టాలు ఉండవు	నోట్ల రద్దు జరిగిన కొద్ది రోజుల్లోనే 2000 రూపాయల నకిలీనోట్లు చలామణిలోకి వచ్చాయి.



మహారాష్ట్రను వణికిస్తున్న భారీ వర్షాలు

- 15 మంది మృతి

8

పళనిస్వామిపై విశ్వాస ఓటింగ్‌కు ప్రతిపక్షాల డిమాండ్ తిరస్కరించిన గవర్నర్

8

చౌకగా వాటాల విక్రయం

- పిఎస్‌యుల్లో డిజిన్వెస్ట్‌మెంట్ వేగవంతం
- 5నెలల్లో రూ. 9,300 కోట్లు

6

'కాకినాడ'పై ఎవరి ధీమా వారిదే

2





బిఆర్‌డిలో మరణ మృదంగం

- ఈ ఏడాది 1280 మంది చిన్నారుల మృతి
- ఆగస్టులో 320 మంది మరణం
- మూడు రోజుల్లో 61 మంది మృతి
- నిర్లక్ష్యం సహా కారణాలు అనేకం



గోరఖ్‌పూర్: నగరంలోని బిఆర్‌డి ఆసుపత్రిలో మరణ మృదంగం కొనసాగుతోంది. 2017లో ఇప్పటివరకూ 1280 మంది చిన్నారులు మరణించగా, ఒక్క ఆగస్టులోనే 320 మంది చిన్నారులు ఆక్సిజన్ కొరత సహా పలు కారణాలతో మృత్యువాత పడ్డారు. వీరిలో ఐసియు వార్డులో మరణించిన నవజాత శిశువుల సంఖ్య 225 అని బిఆర్‌డి వైద్య కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ పికె సింగ్ బుధవారం తెలిపారు. 88 మంది మెదడువాపు వ్యాధితోనూ, మిగిలిన 17గురు ఇతర అనారోగ్య కారణాలతో మరణించినట్లు ఆయన వివరించారు. మెదడువాపు వ్యాధితో ఇటీవల ఆక్సిజన్ సరఫరాలో అవాంతరం ఏర్పడి 48 గంటల వ్యవధిలో 33 మంది చిన్నారుల మృత్యువాత పడిన ఘటన మరుగున పడకముందే మూడు రోజుల వ్యవధిలో 61 మంది చిన్నారులు మృత్యువాత పడిన ఘటన వెలుగు చూసింది. బుధవారం ఈ ఘటన వెలుగులోకి రావటంతో ఆస్పత్రి మొత్తం భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజా మరణాలకు అనేక కారణాలున్నాయని అధికారులు చెబుతున్నారు. మెదడు వాపు వ్యాధితోపాటు, నవజాత శిశువుల్లో ఏర్పడే ఆరోగ్య సమస్యలు, న్యుమోనియా, సెప్సిస్ వంటి కారణాలతో చిన్నారులు మరణించారని అధికారులు వివరించారు. తాజాగా ఈ ఆరోగ్య సమస్యలతో పేషెంట్లు వెల్లువెత్తుతుండటంతో ఆస్పత్రి కిక్కిరిసిపోతోంది. ఈ నెల 27,28,29 తేదీల్లో ఆస్పత్రిలో 61 మంది చిన్నారుల మరణాలు నమోదు కాగా అందులో 11 మెదడు వాపు వ్యాధి వార్డు నుండి, 25 నవజాత శిశువుల మిగతా 9లో

జోన్ల వారీగా రాజధాని అభివృద్ధి

- హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో పనులు
- మూడు జోన్లకు రూ.6,900 కోట్లు
- అక్షరధామ్‌కు నదీ ముఖంగా 30 ఎకరాలు
- సిఆర్‌డిఎ సమావేశంలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని నగరంలో ప్రతిపాదిత జోన్లలో మూడు జోన్లను 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఎఎం)లో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ (సిఆర్‌డిఏ) సమావేశంలో నిర్ణయించారు. 4, 5, 6 జోన్లలో మొత్తం రూ.6,900 కోట్లతో రహదారులు, వంతెనలు, తాగునీరు, మురుగునీటి పారుదల, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను హెచ్‌ఎఎం పద్ధతిలో ఏర్పాటు చేయనున్నారు. జోన్ 4లో రూ.817 కోట్లు, జోన్ 5లో రూ.2,383 కోట్లు, జోన్ 6లో రూ.3,714 కోట్లు వ్యయం అవుతుందని సిఎంకు అధికారులు వివరించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సిఆర్‌డిఏ అధికారులతో బుధ వారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మిగతా 9లో

సెప్టెంబర్ 27న నిర్మాణ కార్మికుల 'డిమాండ్స్ డే'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిడబ్ల్యుఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి

- సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికే వెచ్చించాలి
- సిడబ్ల్యూఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 27న దేశవ్యాప్తంగా దేశ వ్యాప్తంగా 'డిమాండ్స్ డే' పేరిట ఆందోళనలు చేపడతామని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిడబ్ల్యూఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి ప్రకటించారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో మంగళ, బుధవారాలు రెండు రోజుల పాటు జరిగిన ఫెడరేషన్ 60వ కార్యవర్గ సమావేశం వివరాలను ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దేశవ్యాప్తం గా దాదాపు ఆరు కోట్ల మంది నిర్మాణ రంగ కార్మికులుంటే వారిలో రెండు కోట్ల మంది మాత్రమే కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదయ్యారని ఆయన తెలిపారు. కేవలం మూడింట ఒక వంతు మంది కార్మికులే ఈ బోర్డులో రిజిస్టర్ అయ్యారని, మిగిలిన వారినీ నమోదు చేయించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. 1996లో పార్లమెంట్ సాక్షిగా తీసుకొచ్చిన ఈ బోర్డు ద్వారా పూర్తి స్థాయిలో ఆ రంగంలోని కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులను వెచ్చించడంలేదని ఆయన విమర్శిం చారు. ఇంతవరకు రూ. 35 వేల కోట్లు సెస్ రూపంలో వసూలు చేస్తే, ఆ నిధుల్లో బోర్డు కేవలం రూ. 7 కోట్లు మాత్రమే ఈ కార్మికుల సంక్షేమానికి వ్యయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో సెస్ వసూలు చేయడంలేదని, వసూలు చేసిన దాంట్లోనూ పూర్తిగా నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి వెచ్చించడంలేదని విమర్శించారు. ప్రభుత్వం సెస్ ద్వారా విస్తృత స్థాయిలో సెస్ వసూలు చేయాలని, మిగతా 9లో

నేడు పిఎస్‌ఎల్‌వి-సి39 ప్రయోగం



ప్రయోగానికి సిద్ధంగా ఉన్న పిఎస్‌ఎల్‌వి-సి39 రాకెట్

సమయంలో స్వల్ప మార్పు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట(నెల్లూరు)

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి గురువారం సాయంత్రం 7 గంటలకు నింగిలోకి పిఎస్‌ఎల్‌వి-సి39 రాకెట్ మిగతా 9లో

పెద్దనోట్లన్నీ తిరిగొచ్చాయ్

న్యూఢిల్లీ : నోట్ల రద్దుతో నల్లధనానికి నూకలు చెల్లినట్లేనని గతేడాది మోదీ ప్రభుత్వం ప్రకటించిన ఎనిమిది మాసాల అనంతరం ఆర్‌బిఐ వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. రద్దయిన పాత రూ.500, రూ.1000 నోట్లలో 99 శాతం తిరిగి బ్యాంకులకు చేరి చట్టబద్ధమయ్యాయని ఆర్‌బిఐ నివేదిక స్పష్టంచేసింది. ఈ వార్షిక నివేదిక ప్రకారం మొత్తం రూ.15.44 లక్షల కోట్ల విలువైన పెద్దనోట్లు రద్దుకాగా వీటిలో రూ.15.28 లక్షల కోట్ల విలువైన నోట్లు తిరిగి బ్యాంకుల ద్వారా చలామణిలోకి వచ్చాయి.

ఇంకా చలామణిలోకి రాకుండా మిగిలిన వెయ్యినోట్ల సంఖ్య కేవలం 8.9 కోట్లు మాత్రమే అని నివేదిక పేర్కొంది. అంటే రూ.8,900 కోట్ల విలువైన వెయ్యినోట్లు చలామణిలోకి రాలేదు. అయితే ఈ ఏడాది కొత్త నోట్ల కోసం రూ.8000 కోట్లు వెచ్చించినట్లు అదే నివేదిక స్పష్టం చేసింది. ఇంచు మించు నోట్ల ముద్రణకు అయిన ఖర్చుకు సరిపడా రూ. వెయ్యినోట్లు మాత్రమే తిరిగి బ్యాంకులకు చేరలేదు. 2016 ఆర్థిక సంవత్సరంలో నోట్ల ముద్రణకు అయిన ఖర్చు రూ.3,420 కోట్లుగానే ఉంది. 2016 నవంబరు 9 నుంచి డిసెంబరు 31 వరకు మొత్తం 5.54 లక్షల కోట్ల విలువైన కొత్తనోట్లను చలామణిలోకి తీసుకురావడంతో ఆ మేరకు ముద్రణ వ్యయం పెరిగింది.




నకిలీ నోట్ల పెరుగుదల 20.4 శాతం మాత్రమే

2017 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 7,62,072 నకిలీ నోట్లు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. అయితే 2016తో పోల్చుకుంటే కేవలం 20.4 శాతం మాత్రమే పెరిగాయి. అంటే నోట్ల రద్దు కారణంగా నకిలీ నోట్లు పెద్ద ఎత్తున బయటపడిందేమీ లేదని స్పష్టమౌతోంది. 2016 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 6.32 లక్షల నకిలీ నోట్లు గుర్తించారు. ఇక నోట్ల రద్దు తర్వాత కొత్తగా నకిలీ రూ.100 నోట్లు పెరగడం గమనార్హం. జూన్ 30 నాటికి 15.44 లక్షల కోట్లలో కేవలం 1 శాతం అంటే ఇంచుమించు ఆ మొత్తం రూ.16,000 కోట్ల విలువైన పాతనోట్లు మాత్రమే తిరిగి చలామణిలోకి రాలేదు.

ఆర్‌బిఐ నివేదిక బహిర్గత పరిచిన అంశాలు ఇవే

- 2015-16లో రిజర్వ్‌బ్యాంకు నిర్వహణ ఖర్చు రూ.14,990 కోట్లు ఉండగా, 2016-17లో ఆ మొత్తం రూ.31,155 కోట్లకు పెరిగింది.
- నోట్ల ముద్రణ ఖర్చు 2016లో 3,420 కోట్లు ఉండగా, 2016-17 నాటికి రూ.7,965 కోట్లకు చేరింది. కొత్తగా నోట్లను ఎక్కువ సంఖ్యలో ముంద్రించాల్సిరావడంతో ఆ వ్యయం ఆ మేరకు పెరిగింది.
- 2016-17 ఆర్థిక సంవత్సరంలో అనుమానిత (సస్పెక్టెడ్) నగదు లావాదేవీలు అనూహ్యంగా పెరిగాయి. 2015-16లో 61,361 లావాదేవీలు ఉండగా 2016-17లో అనూహ్య రీతిలో 3,61,214 అనుమానిత లావాదేవీలు జరిగాయని ఆర్‌బిఐ పేర్కొంది.
- నోట్ల రద్దు తర్వాత చలామణిలో ఉన్న పెద్ద నోట్ల శాతం 11.1 శాతం పెరగడం గమనార్హం. దీంతో చలామణిలో ఉన్న పెద్ద చిన్న నోట్ల మధ్య వ్యత్యాసం భారీగా పెరిగింది. మొత్తం చలామణిలో ఉన్న నోట్లలో రూ.2,000 నోట్లు 50.2 శాతం ఉన్నాయి.
- జూన్ 30 , 2017 నాటికి మొత్తం రూ.15.06 లక్షల కోట్ల విలువైన నోట్లు చలామణిలో ఉండగా,అది నవంబరు 4, 2016 నాటికి చలామణిలో ఉన్న నోట్లలో విలువలో 85 శాతంగా ఉంది

పెద్ద నోట్ల రద్దు లక్ష్యం నగదు స్వాధీనం కాదు : అరుణ్ జైట్లీ



పెద్ద నోట్ల రద్దు లక్ష్యం నగదును స్వాధీనం చేసుకోవడం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పెద్ద నోట్ల రద్దు వెనుక ఉన్న వాస్తవ లక్ష్యాన్ని అర్థం చేసుకోలేని కొంతమంది దానిని నగదు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంగా పేర్కొంటూ గందరగోళ పరిచారని అన్నారు.భారత్ ప్రధానంగా నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశమని, నల్లధనం పోగు పడేందుకు అవకాశం వున్న ఈ వ్యవస్థను మార్చడమే పెద్ద నోట్ల రద్దు వాస్తవ లక్ష్యమని, ఈ ప్రయత్నం విజయవంతమైందని ఆయన తెలిపారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ప్రాతిపదికలను విస్తరింప చేయడంలో ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. మరో లక్ష్యం నకిలీ కరెన్సీని గుర్తించడమన్నారు. వాస్తవ కరెన్సీ నుంచి నకిలీ కరెన్సీని వేరు చేసేందుకు రిజర్వు బ్యాంకు ఈ చర్య తీసుకుందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థను డిజిటిలైజేషన్ చేయాల్సిన అవసరముందని, దానిని విస్తరింప చేసే ప్రక్రియను బలోపేతం చేసే దిశగా పనిచేస్తున్నామని జైట్లీ చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో నగదు కార్యకలాపాలను తగ్గించాలని ఆయన అన్నారు. పెద్దనోట్ల రద్దు కార్యక్రమాన్ని చేపట్టిన తరువాత అసాంఘిక శక్తుల వద్ద నగదు నిల్వలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. తదుపరి చర్యలో భాగంగా ప్రభుత్వం ఎన్నికల్లో నల్లధనానికి కళ్ళెం వేయబోతున్నదన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తుది దశలో ఉన్నాయన్నారు.

నోట్ల రద్దుకు ఆర్‌బిఐ సిఫార్సు సిగ్గుచేటు : చిదరంబరం



పెద్ద నోట్ల రద్దుకు రిజర్వ్ బ్యాంక్ సిఫార్సు చేయటం సిగ్గుచేటైన విషయమని మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం విమర్శించారు. రద్దయిన నోట్లలో ఒక శాతం తిరిగి జమ కాలేదంటూ ఆర్‌బిఐ వెల్లడించిన లెక్కలపై ఆయన స్పందిస్తూ మొత్తం రద్దయిన రు.16వేల కోట్ల నోట్లల్లో రు.1,544 కోట్ల విలువైన నోట్లు తిరిగి రిజర్వ్ బ్యాంక్‌కు చేరలేదని చెప్పటం సిగ్గుచేటైన విషయమని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నోట్ల రద్దు ద్వారా రిజర్వ్ బ్యాంక్ లబ్ది పొందింది కేవలం రు.16వేల కోట్లు మాత్రమేనని, కొత్త నోట్ల ముద్రణ ద్వారా మూటకట్టుకున్న నష్టం రు.21 వేల కోట్లు అని లెక్కలుచెబుతున్నాయని ఆయన వివరించారు. ఇంత 'మహత్తర' పథకానికి రూపకల్పన చేసిన ఆర్థిక వేత్తలకు నోబుల్ ప్రైజ్ అందచేయవచ్చని ఆయన వ్యంగ్యోక్తి విసిరారు. నోట్ల రద్దు అన్నది ప్రణాళికా బద్ధంగా చేసిన లూటీ, చట్టబద్ధమైన తప్పిదం అని ఆయన వ్యాఖ్యానించారు. నల్లధనాన్ని వెలికి తెచ్చేందుకు నోట్ల రద్దు చేపట్టామని కేంద్రం చెబుతున్న సాకులపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. నోట్ల రద్దు చర్య ద్వారా 99 శాతం నల్ల డబ్బు తెలుపుగా మారినట్లు కేంద్రం చెబుతున్న మాటల ద్వారా అర్థమవుతోందన్నారు.



మోడి బూటకాలు బద్దలయ్యాయి

న్యూఢిల్లీ : రద్దుచేసిన పెద్దనోట్లన్నీ తిరిగి వెనక్కువచ్చాయన్న ఆర్‌బిఐ చేసిన ప్రకటనతో నల్లడబ్బు నిర్మూలనపై మోడి చెప్పిన పెద్దపెద్ద మాటలన్నీ ఉత్త బూటకాలని తేల్చేసింది. గత సంవత్సరం నవంబరు 8న పెద్దనోట్లను రద్దుచేస్తూ 'నల్లధనాన్ని వెలికితీయటం, ఉగ్రవాదులకు నిధులు అందకుండా చేయటం, నకిలీ నోట్ల ఛలామణిని అరికట్టటం లక్ష్యంగా ప్రకటించింది. నిన్న ఆర్‌బిఐ ప్రకటించిన లెక్కల ప్రకారం నోట్లరద్దును ప్రకటించిన రోజు ఛలామణిలో ఉన్న నోట్లలో 98.96 శాతం తిరిగి ఆర్‌బిఐ వద్దకు చేరాయి. దీని అర్థం ఏమిటి? దేశంలో నల్లధనం అనేది 1,000-500 రూపాయల నోట్లరూపంలో లేకుండా అయినా ఉండాలి. లేదా ఉన్న నల్లధనవంతులంతా నల్లధనాన్ని తెల్లధనంగా చేసుకుని అయినా ఉండాలి. ఈ రెంటిలో ఏది జరిగినా ప్రభుత్వం ప్రకటించిన నోట్లరద్దు ఘోరంగా విఫలమైందని ఆర్‌బిఐ ప్రకటన స్పష్టం చేస్తున్నది.

మోడి ఆదేశాలతో నవంబరు 8న ఆర్‌బిఐ పెద్దనోట్లను రద్దుచేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత చట్టవిరుద్ధంగా దాచుకున్న సంపదకు వెలికితీయటానికి తీసుకున్న చారిత్రాత్మకమైన చర్యగా మోడి అభివర్ణించాడు. ఆ తర్వాత కొద్దిరోజులకు నోట్లరద్దు విఫలమైతే ఎటువంటి శిక్షకైనా తాను సిద్ధమేనని మోడి ప్రకటించాడు. ఇపుడు చూస్తే ఇది ఘోరంగా విఫలమైందని ఇపుడు స్పష్టమౌతున్నది. రద్దయిన నోట్లను బ్యాంకులలో జమచేయటానికి ఇచ్చిన గడువు గత సంవత్సరం డిసెంబరు 31తో పూర్తయి ఇప్పటికి ఎనిమిది మాసాలు గడిచిపోయింది. ఆర్‌బిఐ వద్ద ఎన్నినోట్లు జమ అయ్యాయని పార్లమెంటు, సుప్రీంకోర్టులలో ప్రశ్నించినా, సమాచారహక్కు చట్టం ద్వారా ప్రశ్నించినా ప్రభుత్వం, ఆర్‌బిఐలు నోట్లను ఇంకా లెక్కపెడుతున్నామనే చెప్పాయి. ప్రతినోటూ నకిలీనా, నిజమైనదా అని పరిశీలిస్తున్నామని, ఈ క్రమం పూర్తికావటానికి దీర్ఘకాలం పడుతుందని జూన్‌లో అరుణ్‌జైట్లీ ప్రకటించాడు.

ఈ అబద్ధాలను విని దేశం అంతా విసిగిపోయింది. దేశంలో నగదు ఛలామణిని గురించి వెల్లడించాల్సిన చట్టబద్ధమైన బాధ్యత ఉన్నప్పటికీ ఈ కాలమంతా ఆర్‌బిఐ మౌనం వహించింది. వాస్తవాలు చెప్పకుండా ప్రజలను మభ్యపెట్టాలన్న ఆదేశాలకు అనుగుణంగానే ఆర్‌బిఐ వ్యవహరించింది.

ఇపుడు వాస్తవాలు వెలికివస్తున్నాయి. ఈ మధ్య ఆర్‌బిఐ విడుదల చేసిన లెక్కల ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే మార్చి 31 నాటికి8925 కోట్ల రూపాయల విలువకల 1000 రూపాయల నోట్లు ఛలామణిలో ఉన్నాయని చెప్పింది. అంటే ఆ నోట్లు బ్యాంకుల వద్ద జమకాలేదు. నవంబరు 8న ఎంత విలువ కల 1000రూపాయల నోట్లు ఛలామణిలో ఉన్నాయి? 6.68 లక్షల కోట్ల రూపాయల విలువైన నోట్లు ఆరోజుకు ఛలామణిలో ఉన్నాయి. ఇందులో కేవలం 8925 కోట్ల రూపాయల నోట్లు మాత్రమే జమకాలేదు. మొత్తంలో ఇది 1.3 శాతం మాత్రమే.

నవంబరులో రద్దుచేసిన 500-1,000 రూపాయల మొత్తం నోట్ల విలువ 15.44 లక్షల కోట్ల రూపాయలు. 500 రూపాయల నోట్ల వివరాలు అధికారికంగా వెల్లడించనప్పటికీ ఆ నోట్లు కూడా అదే నిష్పత్తిలో జమ అవుతాయి. కాబట్టి ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారమే మోడి తీసుకున్న తుగ్లక్ చర్యతో నల్లధనం వెలికిరాలేదు. ఉగ్రవాద కార్యకలాపాలు వెనుకపట్లు పట్టలేదు. నకిలీ నోట్ల ఛలామణి తగ్గలేదు. కాబట్టి మోడి ప్రకటించిన లక్ష్యాలలో ఒక్కటి కూకడా నెరవేరలేదని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

దీనివలన కోట్లాడిమంది సామాన్యప్రజలు తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొన్నారు. లక్షలాదిమంది తమ జీవనాధారాలను కోల్పోయారు.తమ ఉత్పత్తుల ధరలు పడిపోవటంతో రైతులు దివాళా తీశారు. దేశ ఆర్థిక జీవనం అస్తవ్యస్తంగా మారింది. లబ్దిపొందినవారు పేటిమ్, మోబిక్విక్‌లాంటి డిజిటల్ లావాదేవీలునిర్వహించే సంస్థలు మాత్రమే లాభపడ్డాయి.

జిఎస్‌టి, రుణాల రద్దు, వేతన సవరణలతో
గాడి తప్పనున్న ఆర్థిక వ్యవస్థ

వార్షిక నివేదికలో ఆర్‌బిఐ హెచ్చరిక



కోల్‌కతా : వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి), రుణాల రద్దు, వేతన సవరణలు వంటి చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పనుందని ఆర్‌బిఐ హెచ్చరించింది. ఈ చర్యల వల్ల కలిగే తక్షణ ప్రభావాలతో కేంద్ర, రాష్ట్రాల స్థాయిలో ఆర్థిక స్థితిగతులు ప్రమాదంలో పడవచ్చని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) తన వార్షిక నివేదికలో పేర్కొంది. మొత్తంగా అభివృద్ధిపై ఇది ఒత్తిడి కలిగిస్తోందని తెలిపింది. సాధారణంగా వున్న వర్షపాతం, తగ్గిన బ్యాంక్ రుణాల రేట్లు, పెట్టుబడుల డిమాండ్‌కు మద్దతుగా నిలిచినప్పటికీ మూల ధన వ్యయానికి రాష్ట్ర ప్రభుత్వాలు గనక కళ్ళెం వేయకపోతే మొత్తంగా పెట్టుబడుల డిమాండ్‌పై ప్రభావం చూపే అవకాశం వుందని ఆర్‌బిఐ హెచ్చరించింది. ఈ ఏడాది జులై 1వ తేది నుండి దేశవ్యాప్తంగా జిఎస్‌టి అమల్లోకి వచ్చింది. జిడిపిలో మూడు శాతానికి ఆర్థిక లోటును కుదించాలన్న లక్ష్యాన్ని సాధించడానికి వున్న గడువును కేంద్రం 2018 ఆర్థిక సంవత్సరం నుండి 2019 ఆర్థిక సంవత్సరానికి పొడిగించింది. రెవిన్యూ సేకరణకు సంబంధించిన అనిశ్చిత పరిస్థితులు, ఏకపన్ను వ్యవస్థ అమలు, దానితో పాటు పెరుగుతున్న రాష్ట్రాల అప్పులు ఇవన్నీ కలిసి ఆర్థిక లోటు కుదింపు లక్ష్యాలను సాధించడంలో విఫలమవడానికి దారి తీయవచ్చని ఆర్‌బిఐ బుధవారం విడుదల చేసిన తన నివేదికలో పేర్కొంది. రైతాంగ రుణాలు రద్దు చేయడం కారణంగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, కర్నాటక రాష్ట్రాలు 2018లో అనేక సవాళ్ళను ఎదుర్కొనే అవకాశం వుందని పేర్కొంది. దీనివల్ల ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పే అవకాశం వుందని హెచ్చరించింది. వేతన కమిషన్ల సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలని నిర్ణయిస్తే రాష్ట్రాల అప్పులు కూడా పెరిగే అవకాశం వుంది. ఇప్పటికే అధిక స్థాయిలో వున్న హామీలన్నీ కలిసి ఆర్థిక వ్యవస్థకు పెను ముప్పు కలిగించే పరిస్థితి వుందని పేర్కొంది.



ప్రజ్ఞ

1. జులై నెలలో ఎంత జిఎస్టీ వసూలైనట్లు కేంద్రం ప్రకటించింది?
2. ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌లో భారత్‌కు పతకం ఖాయం చేసిన క్రీడాకారుడెవరు?
3. 9వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఎక్కడ జరగనుంది?
4. గో వధను నిషేధించిన తొలి ఈశాన్య రాష్ట్రం?
5. విలువిద్యలో 'అర్జున అవార్డు' గెలుచుకున్న తెలుగు తేజం ఎవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ద్రాక్షారామం కాపు భవన్ నిర్మాణానికి రూ. 3 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం మండలం ద్రాక్షారామంలో కాపు భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనం నిర్మాణం కోసం రూ. 3 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బి ఉదయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాపు భవన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి సేకరించేందుకు అవసరమైన చర్యల్ని కాపు కార్పొరేషన్ తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'కాకినాడ'పై ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ కార్పొరేషన్‌లో గెలుపు తమదే అని రెండు ప్రధాన పార్టీలూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మేయర్ పీఠం మాదే, మెజారిటీ డివిజన్లూ మావే అంటూ టిడిపి, వైసిపి నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో విజేతలెవరో సెప్టెంబర్ 1న తేలుతుంది. కాకినాడ కార్పొరేషన్‌లోని 48 డివిజన్లకుగాను పొత్తులో భాగంగా 39 చోట్ల టిడిపి, 9 చోట్ల బిజెపి పోటీ చేశాయి. ప్రతిపక్ష వైసిపి 48 డివిజన్లలోనూ బరిలోకి దిగింది. మేయర్ పీఠం కైవసం చేసుకోవాలంటే ఏ పార్టీకైనా 25 డివిజన్లు రావాల్సి ఉంది. అధికార పార్టీకి కో ఆప్షన్ సభ్యులు ముగ్గురు ఉండడంతో 22 డివిజన్లు వస్తే మేయర్ పీఠం దక్కించుకునే అవకాశం ఉంది. ప్రతిపక్ష వైసిపి 28 డివిజన్లలో గెలుపొందాల్సిన అవసరం ఉంది. తెలుగుదేశం నాయకులు 30కు పైగా డివిజన్లు కైవసం చేసుకుంటామని ధీమా వ్యకం చేస్తున్నారు.

బిజెపి అభ్యర్థులు కనీసం 3 డివిజన్లలో విజయం సాధిస్తారనే సంకేతాలు ఇస్తున్నారు. వైసిపి నాయకులు కనీసం 28 డివిజన్లు కైవసం చేసుకుంటామని చెబుతున్నారు. నంద్యాల ఎన్నికల ప్రభావం వల్ల విజయావకాశాలు తమకే ఎక్కువగా ఉన్నాయని టిడిపి నేతలు విశ్లేషిస్తున్నారు. టిడిపి రెబల్స్‌ను కొన్నిచోట్ల దారికి తెచ్చుకున్నా మరికొన్నిచోట్ల వారికే తెరచాటున మద్దతు ఇచ్చింది. రెబల్స్‌ను తప్పించిన చోట్ల బిజెపి విజయావకాశాల కోసం టిడిపి నేతలే వెంపర్లాడాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక్కో డివిజన్‌లోనూ సుమారు రూ.40 లక్షల వరకూ ఖర్చు చేసి ఆ పార్టీ అభ్యర్థుల విజయం కోసం విశ్వప్రయత్నాలు చేశారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రెండు వేల వరకూ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఉన్న డివిజన్లలోనూ నోటుకు వెయ్యి రూపాయల చొప్పున ముందుగానే ఇచ్చేశారు. మేయర్ అభ్యర్థితోపాటు గట్టి పోటీ ఉన్న కొన్ని డివిజన్లలో ఓటుకు రూ.2 వేలు వరకూ పంపిణీ చేశారు. పింఛన్లు, రుణాలు రావాలంటే టిడిపికే ఓటు వేయాలని అధికార పార్టీ నేతలు బెదిరింపులకు గురి చేసినట్లు ఆరోపణలున్నాయి. స్థానిక ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు సోదరుని ఇద్దరు కుమారులు పోటీ చేసిన రెండు డివిజన్లలోనూ గట్టి పోటీ ఎదుర్కొన్నారు. 14వ డివిజన్‌లో హోరాహోరీ పోరు సాగింది. ఎంఎల్‌ఎ వనమాడి ప్రతిష్టాత్మకంగా తీసుకుని పోలింగ్ తీరును సమీక్షించాల్సి వచ్చింది. అధికార పార్టీ అభ్యర్థుల కోసం మంత్రులు, ఎంఎల్‌ఎలు, ద్వితీయశ్రేణి నేతలు తీవ్రస్థాయిలో శ్రమించాల్సివచ్చింది.

మెజార్టీ స్థానాలు సాధిస్తామని ఎంఎల్‌సి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌తోపాటు వైసిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రూపులుగా విడిపోయి అనుచరులకు సీట్లు ఇచ్చుకోవడంతో పార్టీ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకతను చవి చూడాల్సివచ్చింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తా శశిధర్ 12 డివిజన్లు తీసుకుని అనామకులకు సైతం సీట్లు ఇచ్చేశారని, వాటిలో ఒకటి మాత్రమే నెగ్గుతుందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. మరో డివిజన్ ఇన్‌ఛార్జి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇచ్చిన డివిజన్లలో ఎక్కువ మంది విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

నువ్వా నేనా అనే రీతిలో కనీసం 20 డివిజన్లలో టిడిపి, వైసిపి అభ్యర్థుల మధ్య పోటీ సాగింది. కొన్నిచోట్ల వైసిపి అభ్యర్థులు ప్రభావం కూడా చూపలేకపోయినట్లు ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. అధికార పార్టీతో సమానంగా కొన్ని డివిజన్లలో వైసిపి ఓటుకు వెయ్యి చొప్పున పంపిణీ చేయగా ఎక్కువ డివిజన్లలో కేవలం రూ.500 పంచింది. వైసిపి 20 డివిజన్ల వరకూ కైవసం చేసుకుంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతుండగా, వైసిపి నేతలు మేయర్ పీఠం దక్కించుకుంటామని అంటున్నారు. ఫలితాలు రావాలంటే మరో 24 గంటలు వేచి చూడాల్సిందే.

కాపు రిజర్వేషన్లపై ముద్రగడ అల్టిమేటం

- డిసెంబరు 6లోపు తీర్మానం కేంద్రానికి పంపాలి
- లేకపోతే ఉద్యమమే

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)

కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తానన్న చంద్రబాబు డిసెంబర్ 6వ తేదీలోగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, లేనిపక్షంలో 13 జిల్లాల్లో పర్యటించి కార్యాచరణ రూపొందిస్తానని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసంలో 13 జిల్లాల కాపు జెఎసి నాయకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో చంద్రబాబును అనుభవం ఉన్న నాయకుడిగా గుర్తించి తాను ఓటు వేశానన్నారు. ఆయన కాపులకు ఇచ్చిన హామీని విస్మరించారని తెలిపారు. అంతేగాక ఉద్యమిస్తుంటే అణగదొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అమలుకు చంద్రబాబు రెండు నెలల సమయం అడిగారని, దానికి అదనంగా మరో నెల గడువు ఇస్తున్నామని ముద్రగడ ప్రకటించారు. డిసెంబర్ 6లోగా అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపాలన్నారు. ఇప్పటివరకు తాను గేటులోపలే ఉద్యమం చేశామని, గేటుబయట చేస్తే ఉద్యమం ఎంత తీవ్రస్థాయిలో ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు. గతంలో ఎన్టీఆర్, ఇప్పుడు చంద్రబాబు తనను ఉద్యమకారుడిగా తయారు చేశారన్నారు. ఈ మూడు నెలల్లో 13 జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పర్యటిస్తానన్నారు. వివిధ జిల్లాల కాపు జెఎసి నాయకులు భవిష్యత్ కార్యాచరణపై పలు సూచనలు చేశారని, వాటిని పరిగణలోకి తీసుకుని నిరవధిక పాదయాత్రను వాయిదావేశానని ముద్రగడ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు జెఎసి నేతలు తోట రాజీవ్, కడపజిల్లా నుంచి సమతా రాము, కృష్ణాజిల్లా నుంచి నరహరశెట్టి నరసింహారావు, అనంతపురం నుంచి అమరనాథ్, శ్రీకాకుళం నుంచి రొక్కం సూర్యప్రకాష్, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్, కలవకుండ తాతాజి, గౌతు స్వామి, తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్న్ బోర్డుకు కోస్టు గార్డు డైరెక్టర్ జనరల్ రాజేంద్రసింగ్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

తూర్పు తీరం ఈస్టర్న్ బోర్డుకు బుధవారం కోస్టు గార్డు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ చేరుకున్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన నేవీ బృందం తూర్పు నౌకాదళంలో మూడు రోజుల పర్యటనకు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తీర ప్రాంత భద్రత, మౌలిక వసతులు, తీరంపై సమస్యలు తదితర అంశాలపైన ఆయనకు కోస్టు గార్డు అడిషనల్ డైరెక్టర్ జనరల్ కెకె.పాండే వివరించారు. కాకినాడ, విశాఖ, భువనేశ్వర్‌లో రాజేంద్రసింగ్ శుక్రవారం వరకు పర్యటిస్తారని తెలుస్తోంది. భువనేశ్వర్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేషన్స్ ఫెసిలిటిని గురువారం ప్రారంభించనున్నారని తెలుస్తోంది. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఆయన సతీమణి ఊర్మిళసింగ్ కూడా ఉన్నారు.

కాకినాడలో వైసిపికి సింగిల్ డిజిట్

మంత్రి ప్రత్తిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి సింగిల్ డిజిట్‌కు పరిమితమవుతుందని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సచివాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, కాకినాడలోనూ ఓటమి తప్పదని ఊహించిన ప్రతిపక్ష నాయకులు అందుకు కారణాలు వెతుక్కునే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు. రెండు దశాబ్దాల తరువాత కాకినాడలో టిడిపి-బిజెపి కూటమి విజయం సాధించబోతోందన్నారు. నంద్యాల ఫలితంతో ఇప్పటికే తలబొప్పి కట్టినా, వైసిపి నేతల తీరులో ఇంకా మార్పు రాలేదన్నారు. అధికార పార్టీ డబ్బులు పంచిందని, పోలీసులు పక్షపాతంగా వ్యవహరించారని లేని పోని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. నంద్యాలలో వైసిపిని నమ్ముకుని బెట్టింగ్‌లు కట్టిన వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తలెత్తిందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు నిరంతర అభివృద్ధిని గుర్తించిన నంద్యాల ప్రజలు ఆయనకు వెన్నుదన్నుగా నిలిచారని పేర్కొన్నారు. తీరు మార్చుకోని జగన్ కాకినాడలోనూ అధికార పార్టీ నేతలను సముద్రంలో కలిపేయాలని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని చెప్పారు. కాకినాడ ప్రజలు తమ ఓటుతో జగన్‌ను సముద్రంలో కలిపేయబోతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో జగన్మోహన్‌రెడ్డి వంటి నాయకుడు ఉండకూడదని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. నంద్యాల తీర్పుతో వైసిపిలో ఉండాలా వద్దా అని ఆ పార్టీ నేతలు తర్జన భర్జనలు పడుతున్నారన్నారు. కాకినాడ తీర్పుతో ప్రస్తుతం ఉన్నవారు కూడా వైసిపిని వీడే పరిస్థితులు తలెత్తుతాయని మంత్రి ప్రత్తిపాటి పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతంగా పోలవరం

పర్యాటక కార్యదర్శి ఎమ్కే మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. పోలవరం, గండికోట ప్రాంతాల అభివృద్ధిపై సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వివిధ సంస్థలు సమర్పించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లాతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టుల ఫైనాన్షియల్ బిడ్‌లలో ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వాటిని పరిశీలించాలని అధికారుల్ని ఆదేశించారు. మరే ఇతర సాగునీటి ప్రాజెక్టుకూ లేని విధంగా పోలవరాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకెళ్తున్నామన్నారు. సమావేశంలో ఎపిటిడిసి ఇడి బాలసుబ్రమణ్య రెడ్డి, ఇడిజి డైరెక్టర్ పాండురంగారావు, బిఐటిసి ఇడి ఉమామహేశ్వరరావు, ఆర్‌డిలు గోపాల్, భీమ శంకర్ పాల్గొన్నారు.

కోటప్ప కొండ అభివృద్ధికి చర్యలు

గుంటూరు జిల్లాలోని కోటప్ప కొండ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్కే మీనా, హిమాన్షు శుక్లా తెలిపారు. స్పీకర్ కోడెల శివప్రసాదరావుతో వారు బుధవారం భేటీ అయ్యారు. స్పీకర్ ఆకాంక్ష మేరకు కోటప్ప కొండ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికల్ని రూపొందిస్తామన్నారు.

ఫాతిమా మెడికల్ విద్యార్థులకు ఇతర కళాశాలల్లో చేరుస్తాం

కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు : మంత్రి కామినేని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థులకు ఇతర కళాశాలల్లో చేర్పించి న్యాయం చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఫాతిమా కళాశాల విద్యార్థుల విషయంలో రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఎమ్‌సిఐకి బుధవారం సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో కామినేని విలేకరులతో మాట్లాడారు. ఫాతిమా కాలేజీ విద్యార్థుల సమస్యను సిఎం చంద్రబాబు, ఉపరాష్ట్రపతి వెంకయ్య దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లానన్నారు. విద్యార్థుల వివరాల్ని వారంలోగా సుప్రీం కోర్టుకు అందజేస్తామన్నారు. విద్యార్థుల్ని 2017 బ్యాచ్‌గా పరిగణించాలని కోర్టు చెప్పిందని, ఆ ప్రకారం వారికి ఎటువంటి నష్టం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. సంబంధిత విద్యార్థుల ఫీజుల్ని ఫాతిమా కళాశాల యాజమాన్యం నుంచే వసూలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆ కళాశాలలో చదువుతున్న 750 మంది వైద్య విద్యార్థుల భవిష్యత్ కోసమే ఇప్పటి వరకు ఆ యాజమాన్యంపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు.

మైనార్టీల కోసం ప్రణాళిక

ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు జిల్లాల్లో అధికంగా ఉన్న మైనారిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో బహుళ రంగాల అభివృద్ధి ప్రణాళిక (ఎంఎస్డీపి)ను ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అన్నారు. ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమంలో భాగంగా మైనారిటీల సంక్షేమంపై ఏర్పాటైన రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశాన్ని సచివాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 12వ పంచవర్ష ప్రణాళికలో మైనారిటీల ఆర్థిక, సామాజికాభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో 2008లో ఎంఎస్డీపిను ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో మైనారిటీలు అధికంగా ఉన్న జిల్లాల్లో 25 శాతంపైగా వెనుకబడిన మైనారిటీ జనాభా నివాసముంటున్న 11 ప్రాంతాలను ఈ ప్రాజెక్టు కింద గుర్తించి పలు కార్యక్రమాల్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది రూ.50 కోట్ల వ్యయంతో 500 అంగన్వాడీ భవనాల నిర్మాణం, రూ.12 కోట్ల వ్యయంతో 100 ఆరోగ్య ఉప కేంద్రాల ఏర్పాటు, కడప జిల్లా ప్రొద్దుటూరులో రూ.23 కోట్ల వ్యయంతో బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, 4.57 కోట్ల వ్యయంతో మైనారిటీ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

విశాఖ షిప్‌యార్డుకు రిలయన్స్ 'టెండర్' !

- డిఫెన్స్ ఉత్పత్తులు ప్రయివేటుపరం
- రూ.5 వేల కోట్లతో న్యూక్లియర్ సబ్‌మెరైన్ల తయారీ
- నేవీ ఆర్డర్లు రూ.20 వేల కోట్ల నిలిపివేత ?
- రోడ్డున పడనున్న 4 వేల మంది కార్మికులు



ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

డిఫెన్స్ ఉత్పత్తుల తయారీ అంబానీ, ఆదానీ వంటి దేశీయ బహుళజాతి కార్పొరేట్ల గుప్పెట్లోకి వెళ్లనున్నాయి. విశాఖలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ తయారీ కేంద్రం, నౌకా నిర్మాణ సంస్థ హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)ను ముక్కలు చేసేందుకు పాలకులు ప్రణాళిక రచించారు. రక్షణ రంగానికి ఆయువుపట్టుగా ఉండే షిప్‌యార్డుపై వేటు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. డిఫెన్స్ ఉత్పత్తుల తయారీ, సరఫరా ప్రభుత్వరంగంలో ఉండాలన్న నిబంధనకు తూట్లు పొడుస్తోంది. షిప్‌లు, టగ్స్, సాధారణ నౌకల ఉత్పత్తిని ఇకపై రిలయన్స్ చేపట్టబోతుందన్నది ప్రధాని మోడీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. సబ్‌మెరైన్ తయారీ ప్రాజెక్టులు హెచ్‌ఎస్‌ఎల్‌కు దక్కకుండా తీవ్రమైన కుట్రలు కేంద్ర స్థాయిలో జరుగుతున్నట్లు సమాచారం.

ఆర్డర్లు లేక విలవిల

1974లోనే షిప్‌యార్డు, బిహెచ్‌పివి, నేవల్‌డాక్‌యార్డు ఈ మూడింటినీ కలిపి 'కన్సోర్టియం' చేస్తూ ప్రాజెక్టు రిపోర్టు కూడా సబ్‌మెరైన్ల ఉత్పత్తి విశాఖలో జరగాలని నిర్ణయం జరిగింది. అయితే ముంబయి మజగాన్ డాక్స్ ఒత్తిడి వల్ల ఈ ప్రాజెక్టు విశాఖకు దక్కలేదన్నది తెలిసిన విషయమే. ప్రస్తుతం రూ.20 వేల కోట్ల విలువైన వర్క్ ఆర్డర్లను హెచ్‌ఎస్‌ఎల్‌కు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మూడేళ్లుగా అడ్డుపడుతుండడంతో ప్రస్తుతం షిప్‌యార్డు వద్ద రూ.500 కోట్ల విలువైన పనులే జరుగుతున్నాయి. ఇవి కూడా చివరిదశకు రావడంతో షిప్‌యార్డుకు చివరి దశే అన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. ఈ అంశాన్ని ఇటీవలే పార్లమెంట్‌లో విశాఖ నుంచి ఎంపికైన కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి కూడా లేవనెత్తారు. షిప్‌యార్డుకు రూ.757 కోట్లు కేంద్రం తక్షణం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ఐఎస్‌ఒ క్వాలిటీ అక్రిడిటేటెడ్ అవార్డు పొందిన తొలి సంస్థ విశాఖ హెచ్‌ఎస్‌ఎల్ నేడు వర్క్ ఆర్డర్లు లేక నానా అవస్థలు పడుతోంది. నౌకల నిర్మాణం, మరమ్మతులు, హై టెక్నాలజీతో సబ్‌మెరైన్‌ల రీ ఫిట్టింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ వంటి పనులను అత్యంత సమర్ధవంతంగా నిర్వహించగల సంస్థ పాలనాపరంగా రక్షణ శాఖ నియంత్రణలో ఉండాలి. తక్షణం రూ.5 వేల కోట్ల వర్క్ ఆర్డర్లను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నా దీనస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

విదేశీ టెక్నిషియన్ల అన్వేషణలో రిలయన్స్ సంస్థ

దేశంలో ప్రస్తుతం డిఫెన్స్ ఉత్పత్తుల్లోకి అంబానీ, ఆదానీ, ఎల్ అండ్ టి వంటి సంస్థలు ముందుకొస్తున్నాయి. విశాఖలో షిప్‌యార్డులోకి చొరబడేందుకుగానూ కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థలకు ఇప్పటికే లోపాయికారిగా అనుమతులను మంజూరు చేసినట్లు సమాచారం. దేశంలోని ఈ వ్యవస్థలోకి విదేశీ టెక్నిషియన్ల కోసం ఈ సంస్థలు ముఖ్యంగా రిలయన్స్ వెతుకులాట ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీంతో మన దేశ రహస్యాలను విదేశీ టెక్నిషియన్లు గ్రహిస్తారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కేంద్ర ప్రభుత్వం మరో తాజా ప్రతిపాదన కూడా దేశీయ బడా కంపెనీలకు లాభం చేకూర్చేలా ఉంది. విశాఖ కేంద్రంగా ఉండే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)ని సైతం ముంబయికి తరలించే ఏర్పాట్లు కూడా జరుగుతున్నట్లు స్పష్టమైన సంకేతాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో డిసిఐ సొంత స్థలం విశాఖ నగరంలోగల సీతమ్మధారలో డిసిఐ కార్యాలయానికి ఫౌండేషన్ రాయి కూడా వేయకుండా వెనక్కి నెడుతున్నారు.

ఉద్యోగుల్లోనూ ఆందోళన

షిప్‌యార్డులో 1980లో 8 వేలమంది వరకూ ఉండే పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య నేడు 1500కు పడిపోయింది. 1990వ దశకంలో 1200 మంది ఉండే కాంట్రాక్టు కార్మికులు నేడు 6 వేల మందికి షిప్‌యార్డులో పెరిగారు. 1941లో సింధియా స్టీమ్ నేవిగేషన్ కంపెనీగా ఏర్పడిన షిప్‌యార్డు కొనసాగలేని పరిస్థితుల్లో 1961లో భారత ప్రభుత్వానికి నడపలేమంటూ లేఖ రాసుకోగా ప్రభుత్వం దీన్ని జాతీయం చేసింది. దేశాభివృద్ధిలో కీలకమైన రక్షణ వ్యవస్థకు చెందిన ఉత్పత్తులు, సరఫరాలో హెచ్‌ఎస్‌ఎల్‌దే కీలకపాత్ర. రూ.లక్షల కోట్లు ఆస్తులు కలిగిన దీన్ని ప్రయివేటు చేతుల్లోకి నెట్టేందుకు మోడీ సర్కారు కుట్ర పన్నుతోంది.

నౌకా నిర్మాణరంగ రక్షణలో ప్రపంచ దేశాలు

ప్రపంచ దేశాలు వారి నౌకా నిర్మాణ రంగాన్ని కాపాడుకోవడానికి షిప్‌బిల్డింగ్‌ను బలోపేతం చేస్తుంటే భారతదేశంలో నిర్వీర్యం చేస్తున్నారనడానికి ఇదే తార్కాణం. జపాన్, అమెరికా వంటి ప్రభుత్వాలు 40 శాతం సబ్సిడీ ఇచ్చి రక్షణ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. చైనాలో పూర్తిగా ప్రభుత్వ రంగం నిర్వహణలో ఉండి అత్యంత శక్తివంతమైన నౌకానిర్మాణ సంస్థగా ప్రపంచంలోనే వర్ధిల్లుతోంది. భారతదేశంలో మాత్రం షిప్ యార్డును బడా పారిశ్రామిక వేత్తల చేతుల్లోకి పాలకులు నెడుతున్నారు.



నేలటూరు వెళ్లిపోతోంది..

- పొమ్మనకుండా పొగబెట్టారు
- ఇక్కడ మేము బతకలేం!
- తినడానికి తిండి లేదు.. ఉండటానికి గూడు లేదు..
- పొలాలు లాక్కున్నారు.. ఉపాధి చూపలేదు..
- పునరావాసంలో అధికారపార్టీ రాబందులు
- దళితుల పట్ల అధికారుల చిన్నచూపు



ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

'మేం ఇక్కడ బతకలేం.. ఎక్కడికైనా వెళ్లిపోతాం.. చేయడానికి పని, తినడానికి తిండి, ఉండడానికి గూడు లేవు. అసలు జీవించడానికే అవకాశం లేదు. వ్యవసాయం చేసే పొలాలు లాక్కున్నారు. చదువుకున్న వారికి ఉద్యోగం, ఉపాధీ చూపలేదు. మాలాంటి దుర్భర పరిస్థితి ఏ గ్రామానికీ రాకూడదు. పునరావాస కల్పనలోనూ అధికారపార్టీ రాబందులు మమ్మల్ని పీక్కుతింటున్నాయి' అంటూ బాధితులు అధికారులను వేడుకుంటున్నారు. వీరంతా ఏ బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని వారు కాదు.. ఆంధ్రప్రదేశ్‌లో అన్నపూర్ణగా పేరుగాంచిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నేలటూరు గ్రామ ప్రజలు.. పొమ్మనలేక పొగబెట్టినట్లు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు ఆ గ్రామాన్ని నాశనం చేశాయి.

ఒకప్పుడు పచ్చని పొలాలు, పాడి, పంటలతో ఉత్సాహం, ఉల్లాసంగా కనిపించిన నెల్లూరు జిల్లా నేలటూరులో ఇప్పుడు ఎటు చూసినా నిరాశే కన్పిస్తోంది. పదేళ్ల నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు ప్రాంతంలో 33 వేల మెగావాట్ల విద్యుత్ కేంద్రాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సుమారు 30 వేల ఎకరాలు ఇందుకోసం పేద రైతుల నుంచి తీసుకుని వాటికిచ్చారు. ఏపి జెన్‌కో, ఎన్‌సిసి, గాయత్రి పవర్ ప్రాజెక్టులు ఒకేచోట వచ్చాయి. నేలటూరు మొత్తం జనాభా 2,500 ఉంటుంది. దళితవాడలో 270 కుటుంబాలు, మత్స్యకారులపాళెంలో 500, నేలటూరులో 350 కుటుంబాల వరకు ఉన్నాయి. మొత్తం గ్రామంలో 1400 ఎకరాల వ్యవసాయ భూమి ఉండేది. ఇందులో 700 ఎకరాల వరకు దళితులకు చెందినవి. మొత్తం భూమిని ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం తీసుకుంది. అప్పటి అధికారులు ఇక్కడ ప్రాజెక్టులు ఏర్పాటుచేసే క్రమంలో ఈ ప్రాంత ప్రజలకు అనేక హామీలిచ్చారు. చదువుకున్నవారికి ఉద్యోగం, పనిచేసేవారికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. గ్రామానికి చుట్టుపక్కలే పవర్ ప్రాజెక్టులుండడంతో ప్రమాదాన్ని ఆరోజు ప్రజలు గ్రహించలేకపోయారు. కాలక్రమంలో థర్మల్ కాలుష్యం ఎంతటి ప్రమాదమో అక్కడ ప్రజలకు అర్థమైంది.

సర్వం కోల్పోయిన గ్రామంలో ఇప్పుడు జీవించడానికే అవకాశం లేకుండా పోయింది. భారీగా బూడిద వచ్చి పడుతుండడంతో ఇక్కడ కాపురాలు ఉండలేని పరిస్థితి నెలకొంది. ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం గ్రామానికి చెందిన 250 మందికే పని కల్పించారు. అయితే అక్కడ పారిశుధ్య కార్మికులు, వాచ్‌మెన్, ఆఫీసు బాయ్ వంటి చిన్న చిన్న పనులు తప్ప ఉన్నత చదువులు చదివిన వారికి అర్హతను బట్టి మంచి ఉద్యోగం ఒక్కటీ లేకపోవడం గమనార్హం. అనేక రకాల వ్యాధులు పీడిస్తున్నాయి. కనీసం వండుకున్న అన్నం తినే పరిస్థితి కనిపించడం లేదు.

పునరావాసంలో అధికార రాబందులు

నేలటూరులో జీవించడానికి అనువైన పరిస్థితులు లేకపోవడంతో ఆ గ్రామస్తులు ఇప్పుడు అక్కడ నుంచి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు. భూములు కోల్పోయారు. భూగర్భ జలాలు పాడైపోయాయి. చేయడానికి పనిలేదు. ఈ క్రమంలో మేం ఇక్కడ బతకలేం. మరోచోట పునరావాసం కల్పిస్తే వెళ్లిపోతామంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నేలటూరు దళితులకు గుండ్లపాళెం పంచాయతీ పరిధిలో వడ్డిపాళెం పక్కన సర్వే నెంబర్ 141, 142, 143, 144, 145, 146లో ప్రభుత్వం డికెటి పొలం ఉంది. సుమారు 25 ఎకరాల ఈ స్థలం ఇస్తే 270 కుటుం బాలకు నివాసయోగ్యంగా ఉంటుందని కలెక్టర్, ఆర్‌డిఒ చుట్టూ ఏళ్ల తరబడి నుంచి తిరుగుతున్నారు. ఇందులో ఒక సర్వే నెంబర్‌లో చెరువు ఉండడంతో మొత్తం చెరువు పోరంబోకుగా అధికారులు చిత్రీకరిస్తున్నారు. నెల్లూరుకు దగ్గర భూమి ఇవ్వడానికి ఇష్టపడని అధికారులు, అధికారపార్టీ నేతకు లాభం చేకూర్చే పని చేస్తున్నారు.

మాదరాజు గూడూరు ప్రాంతంలో వరిగొండ కోడూరు చిన్న బాబిరెడ్డికి చెందిన 20 ఎకరాలు భూమి ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో కూడా థర్మల్ కాలుష్య సెగలు ఉండడంతో ఇక్కడ అధికారపార్టీ నేతలు తమ భూములు అమ్ముకోడానికి చూస్తున్నారు. తమకు జీవించడానికి అనువైన ప్రాంతంలో భూములు ఇవ్వాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. థర్మల్ ప్రాజెక్టుల వల్ల సర్వం కోల్పోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, పాలకులు ఇలా అడ్డగోలు వ్యవహారం చేయడం పట్ల నిరసన వ్యక్తమౌతోంది.

ఇక్కడ బతుకు భారంగా ఉంది

దుమ్మూ ధూళీ, కలుషిత నీరు, ఎలాంటి పనిలేని చోట మేం, మా పిల్లలం బతకలేం. మా బతుకులు భారంగా ఉన్నాయి. మాకు ప్రత్యామ్నంగా మరోచోట స్థలం చూపిస్తే వెళ్లిపోతాం. అధికారులకు ఇంటి స్థలం కోసం ఒక చోటు చూపిస్తే దానిని ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. మాకు 44 ఎకరాలు పొలం ఉంటే అది కూడా థర్మల్ ప్రాజెక్టులకు ఇచ్చేశాం. మంచి పొలం ఇచ్చాక ఇప్పుడు ఏ పనిలేకుండా ఖాళీగా ఉన్నాం. పనిలేనప్పుడు ఒక బస్తా బియ్యం, నెలకు రూ.2 వేల నగదు ఇస్తామని చెప్పారు. అయినా ఇవ్వడం లేదు. మాకు గుండ్లపాళెం వద్ద స్థలమిస్తే ఇళ్లు కట్టుకుని ఈ ఊరు వదిలి వెళ్లిపోతాం. మా తాతలు, ముత్తాతల నుంచి ఈ గ్రామంలో ఉన్నాం. ఇప్పుడు థర్మల్ ప్రాజెక్టుల పుణ్యమా అని ఇక్కడ నుంచి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యాం.

– పి.శ్రీనివాసులు, నేలటూరు

1, 2 న తిరుమలకు రాష్ట్రపతి

ప్రజాశక్తి–తిరుపతిటౌన్

భారత రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ తిరుపతి, తిరుమలలో సెప్టెంబర్ 1, 2 వ తేదీల్లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ బుధవారం సమీక్షించి మాట్లాడారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, సిఎం చంద్రబాబు రానున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, తుడా ఆధ్వర్యంలో రేణిగుంట విమానాశ్రయం సుందరీకరణ చేయాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ జారీచేసిన పాస్‌లను మాత్రమే అనుమతిస్తున్నట్లు చెప్పారు. పార్కింగ్ విషయంలో పోలీసులు మరింత శ్రద్ధ చూపాలని కోరారు. రాష్ట్రపతి పర్యటన ప్రశాంతంగా జరిగేలా అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ అధికార దుర్వినియోగం

ప్రజాశక్తి–గుంటూరు

గుంటూరు జెడ్‌పి ఛైర్‌పర్సన్ షేక్ జానీమూన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. జాబితాలో తమ బాబాయి పేరు లేకుండా పదోన్నతుల కౌన్సెలింగ్ జరగనిచ్చేది లేదని చెప్పటంతో కౌన్సెలింగ్ వాయిదా పడింది. విద్యాశాఖాధికారులు సైతం రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గిన ఘటన గుంటూరులో బుధవారం హెచ్‌ఎంల ఖాళీలకు పదోన్నతి కౌన్సెలింగ్‌లో చోటు చేసుకుంది. జిల్లాలోని 31 జెడ్‌పి హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయుల ఖాళీలకు కౌన్సెలింగ్ ఉంటుందని అధికారులు ప్రకటించారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ జానీమూన్ తన బంధువైన ఒక స్కూల్ అసిస్టెంట్‌కూ జాబితాలో చోటు కల్పించి పదోన్నతి ఇవ్వాలని ఆదేశించారు. కానీ ముందుగా ప్యానల్ నిర్ణయించిన జాబితాలో మార్పులు చేయటం సాధ్యం కాదని అధికారులు సూచించినట్లు సమాచారం. 'మా బాబాయి పేరు లేకుండా కౌన్సెలింగ్ ఎలా నిర్వహిస్తారో చూస్తానని' చెప్పారని నాయకులకు సైతం తేల్చి చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆగ్రహించిన సంఘాల నాయకులు కౌన్సెలింగ్ కేంద్రంలో ఆందోళనకు దిగారు. రాత్రి 9 గంటల వరకూ ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్చలు నిర్వహించినా కౌన్సెలింగ్‌పై ఎలాంటి ప్రకటనా రాలేదు.

ముంబాయి వెళ్లే పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి – తిరుపతి టౌన్

ముంబాయిలో కుండపోత వర్షం కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు తిరుపతి– రేణిగుంట స్టేషన్ మేనేజర్లు సుభోద్‌మిత్ర, రెహమాన్ షరీఫ్ తెలిపారు. కన్యాకుమారి నుంచి తిరుపతి మీదుగా ముంబాయి వెళ్లే జయంతి ఎక్స్‌ప్రెస్ (వచ్చేది, వెళ్లేది) , చెన్నయ్ నుంచి రేణిగుంట మీదుగా ముంబాయి వెళ్లే దాదార్ ఎక్స్‌ప్రెస్ (వచ్చేది,వెళ్లేది), చెన్నయ్ నుంచి రేణిగుంట మీదుగా ముంబాయి వెళ్లే చెన్నయ్ ఎక్స్‌ప్రెస్ (వచ్చేది,వెళ్లేది) , చెన్నయ్ నుంచి రేణిగుంట మీదుగా ముంబాయి వెళ్లే మెయిల్ (వచ్చేది,వెళ్లేది), ముంబాయి నుంచి గురువారం బయల్దేరే బాలాజీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు.

వేరుశనగ రైతు కంట కన్నీరు

- ముంచేసిన అకాల వర్షం
- కుళ్లిన పంట – ధర పతనం



నీట మునిగిన వేరుశనగ పంట

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

అకాల వర్షాలు వేరుశనగ పంటనూ, రైతులనూ నిలువునా ముంచేశాయి. ఒక్కో రైతూ ఎకరాకు రూ, 20,100 చొప్పున నష్టపోయారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో వేరుశనగ పంట కుళ్లిపోయింది. మరికొన్ని మొలకెత్తాయి. తడిసిన పంటను ఆరబెట్టి మార్కెట్‌కు తరలించడంతో వ్యాపారులు క్రమక్రమంగా ధరలు కుదించేశారు. తొలిరోజుల్లో బస్తా రూ.2,200 పలికిన ధర మూడు దశలుగా ప్రస్తుతం రూ.900లకు పతనమైంది. వెరసి వేరుశనగ రైతు కంట కన్నీరు పెడుతున్నాడు.

ప్రతి ఏడాది నెల్లూరు జిల్లాలో 20,442.5 ఎకరాల్లో వేరు శనగ పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 17,980 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. గతేడాది రూ.2,200 పలికిన బస్తా ధర నెల క్రితం రూ. 1,730, ఆ తరువాత రూ. 1,550, ప్రస్తుతం రూ.900లకు పడిపోయింది. సాధారణంగా బస్తాకు 40 కిలోలతో పాటు అదనంగా 2 లేక 3 కేజీలు తాలు, మట్టి అంటూ తూయడం పరిపాటి. ఈ ఏడాది పంట తడిసిపోవడంతో అదనంగా 7 కేజీలు చొప్పున తూకం వేశారు. కళ్లాల్లో నష్టపోయిన పంటలోనే, వ్యాపారులు అదనంగా కొలుచుకోవడంతో వేరుశనగ రైతుకు నష్టాలే మిగిలాయి.

ఎకరా దిగుబడి 19 బస్తాలు

ఎకరాకు ప్రతి ఏడాది వేరు శనగ 45 బస్తాల వరకూ పండేది. ప్రస్తుతం 19 బస్తాలకు మించలేదు. జులై నాలుగో వారంలో పంట చేతికొచ్చింది. ఆరబెట్టేనాటికి అకాల వర్షాలు మొదలయ్యాయి. రెండు వారాలుగా వర్షాలు ప్రతిరోజూ కురవడంతో మడులు తడిసిపోవడంతో కళ్లాల్లోనే వేరుశనగ కుళ్లిపోయింది. మరికొన్ని మొలకెత్తాయి. వాటిని ఆరబెట్టినా ఫలితం లేకపోయింది. అధిక శాతంగా కాయలు చేదెక్కిపోయాయి. వీటిని మార్కెట్‌కు తరలించడంతో 19 బస్తాలకు మించలేదు.

ఎకరాకు నష్టం రూ. 20,100

దుక్కులకు నాలుగు సార్లు 1,200 చొప్పున రూ.4,800 ఖర్చు చేశారు. ఎకరా విత్తనం ఖర్చు రూ. 11,500, కూలీ ఖర్చు రూ.3,500, ఆరుకట్టలు యూరియా, మందులు ఒక్కోసారి 1,600 చొప్పున నాలుగు సార్లు రూ. 6,400 పెట్టుబడి పెట్టారు. కలుపు తీయించినం దుకు రూ.700 ఖర్చయింది. కాయలు భూమిలోనుంచి వెలికి తీసినందుకు మిషనుకు రూ.8,000, కూలీలకు (ఇద్దరు) రూ.800, వేరుశనగను ట్రాక్టరుతో మార్కెట్‌కు తరలించేందుకు రూ.1500 చొప్పున రూ.37,200 ఖర్చ యింది. 19 బస్తాలకు బస్తా రూ.900 చొప్పున 17,100 చేతికొచ్చింది. ఎకరాలకు 20,100 నష్టం వాటిల్లింది.

రూ.27,125 నష్టపోయాను

మూడున్నర ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. ఎకరాకు 37,200 ఖర్చయింది. ఎకరాకు 19 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ఆగస్టు మొదటి వారంలో విక్రయించడంతో బస్తాకు.1,550 ధర వచ్చింది. రూ. 1, 03,075 నగదు చేతికొచ్చింది. పెట్టుబడికి రూ. లక్షా 30 వేల 200 ఖర్చయింది. రూ.27,125లు నష్టపోయాను.

– సాదా రమణయ్య



బస్తాకు రూ.900 లే వచ్చాయి

రెండు ఎకరాల్లో వేరు శనగ వేశాను. రూ.74,400 పెట్టుబడి పెట్టాను. 39 బస్తాలు పంట దిగుబడి వచ్చింది. బస్తా రూ.900 చొప్పున విక్రయించాల్సి వచ్చింది. 35,100 నగదు చేతికొచ్చింది. 39,300 నష్టపోయాను. సగానికిపై పంట నీళ్లపాలైంది. ప్రభుత్వమే ఆదుకోవాలి

– కోడూరు మాధవరెడ్డి

బెజవాడలో మరో మూడు ప్రత్యామ్నాయ రహదారులు

రూ.24 కోట్లతో త్వరలో టెండర్లు, భూసేకరణకు నోటిఫికేషన్

ప్రజాశక్తి – విజయవాడ సిటీ ప్రతినిధి

విజయవాడ ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. ఈ మేరకు రహదారులు, భవనాల శాఖ (అర్అండ్‌బి) నూతనంగా మూడు ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం, రోడ్ల వెడల్పు తదితర పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రత్యామ్నాయ మార్గాలన్నీ ఏలూరు రోడ్డుపై ట్రాఫిక్ భారం పడకుండా తగ్గించే దృష్టితో ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రత్యామ్నాయ రహదారులకు త్వరలో రూ.24 కోట్లతో టెండర్లు పిలవనున్నారు. కొంత మేర భూ సేకరణా చేయాల్సి ఉందని ఆర్అండ్‌బి అధికారులు పేర్కొంటున్నారు. రామవరప్పాడు బల్లెంవారివీధి నుంచి ఆటోనగర్ మెయిన్ గేటు వరకు ఆరు కిలోమీటర్ల దూరాన్ని రూ.12 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. గొల్లపూడి నుంచి షాబాద్ (జక్కంపూడి నుంచి వై జంక్షన్ వరకు) ఆరు కిలోమీటర్లను రూ.9.75 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. నున్న ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి గుణదల మూడు వంతెనల వరకు రూ.2 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా రహదారులు కొన్ని ప్రాంతాల్లో 7 మీటర్లు వెడల్పు ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో 10 మీటర్లు ఉన్నాయి. నూతనంగా రోడ్లన్నింటినీ 14 మీటర్ల మేర వెడల్పు చేస్తారు. పనులు చేపట్టేందుకు వీలుగా త్వరలో టెండర్ల ప్రక్రియ చేపడతామని ఆర్అండ్‌బి ఎస్ ఈ శేషుబాబు తెలిపారు. విజయవాడలో ట్రాఫిక్ రద్దీ అతి తక్కువ కాలంలో గణనీయంగా పెరిగింది. నూతన వాహనాలు బాగా పెరిగిపోయాయి. ఫలితంగా ఎక్కడ చూసినా ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ప్రత్యామ్నాయ మార్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు.

ఎరువుల వినియోగంపై రైతుల దృష్టి

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

విస్తార వర్షాల నేపథ్యంలో గుంటూరు జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో పైరు ఎదుగుదలకు యూరియాను విరివిగా వినియోగిస్తున్న రైతులు యూరియా, డిఎపి, కాంప్లెక్సు ఎరువుల అంశంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గతంలో కంటే ఎరువుల వినియోగం 30 శాతం వరకూ తగ్గిందని అధికారులు చెబుతున్నారు. గతేడాది నిల్వలు వినియోగానికి నోచక ఇప్పటికీ కేంద్ర సహకార బ్యాంకు శాఖల గిడ్డంగుల్లో, డిసిఎంఎస్ గిడ్డంగుల్లోనే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. గతేడాది వరి సాగు తక్కువ అవడం కూడా ఇందుకో కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం యూరియాకు డిమాండ్ వస్తోందని అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 3 లక్షల ఎకరాల్లో వరి, 4.25 లక్షల ఎకరాల్లో పత్తి, 40 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మిర్చి సాగుకు ఇప్పుడిప్పుడే రైతులు ఉద్యుక్తులవుతున్నారు. ఎరువుల కొరత లేదని అధికారులు చెబుతున్నా జిల్లాలో నకిలీ ఎరువులు, బయో ఫర్టిలైజర్సు యథేచ్ఛగా రైతులకు అంటగడుతున్నారు. చెరుకుపల్లి మండలం గూడవల్లిలో 248 బస్తాల నకిలీ ఎరువులను విజిలెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బెల్లంకొండలో రెండ్రోజుల కిందట 113 బస్తాల కల్తీ ఎరువులు స్వాధీనం చేసుకున్నారు. ఎరువుల్లో ఇసుక కలిపి విక్రయించినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైయింది. గుంటూరు కేంద్రంగా నకిలీ సేంద్రీయ ఎరువుల విక్రయాలూ జోరుగా సాగుతున్నాయి. వీటిపై రైతుల్లో ఎంతో చైతన్యం తీసుకువచ్చామని అధికారులు చెబుతున్నా వీటి తయారీ మాత్రం ఆగటం లేదు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలకు కలిపి మూడు లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా 2.70 లక్షల టన్నుల వరకూ జిల్లాకు వచ్చాయని, ఇంకా వస్తాయని వ్యవసాయ శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు.

సంపాదకీయం

స్వయంకృతాపరాధం


వాన రాకతో పుడమి పులకరిస్తుంది. నీరు యేరులై పారుతుంది. చెరువులు జలకళను సంతరించుకుంటాయి. ఫలితంగా సకల జీవరాశీ వర్ధిలుతుంది. ఇదంతా ప్రకృతిలో సహజ సిద్ధం..! పారే నీటికి అడ్డుకట్ట వేసి, ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టి వినియోగించుకోవడమనేది మానవ మేధస్సు సాధించిన ఫలితమే..! ఒక పరిమితి మేరకు ఇది మానవాళి అభివృద్ధికే దోహదం చేస్తుంది. కానీ, ఊరినే ఏరు మింగేసేలా, చెరువులను కబళించేసి, సహజమైన నీటి ప్రవాహానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించి, కాంక్రీటు కట్టడాలతో విజృంభిస్తే.. ప్రకృతే వికృతిగా మారుతుంది. జనారణ్యాలు జలావరణాలైపోతాయి. ఎడారులుగానూ రూపాంతరం చెందుతాయి. ప్రస్తుతం ముంబయి మహానగరాన్ని చుట్టేసిన వరద నీరే ఇందుకు నిదర్శనం. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంబయి నీట మునిగింది. జన జీవనం స్తంభించింది. సాధారణ ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికార యంత్రాంగం ప్రకటించాల్సి వచ్చింది. ఈ ఏడాదే కాదు, కొన్ని సంవత్సరాలుగా ముంబయి దుస్థితి ఇదే! వర్షాకాలం వచ్చిందంటే ముంబయి వాసులు ప్రాణాలరచేత పట్టుకుని బతకాల్సిందే! ముంబయి ఒక్కటే కాదు, దేశంలోని అన్ని ప్రధాన నగరాల పరిస్థితి ఇంతే! అభివృద్ధి పేరుతో విచ్చల విడిగా చేస్తున్న విధ్వంసం, నగరాల అభివృద్ధి ప్రణాళికలో దూరదృష్టి లోపించడం ప్రజానీకానికి పెనుశాపంగా మారుతోంది. సహజ మార్గాలు మూసుకు పోవడంతో, దిగువకు ప్రవహించాల్సిన జలం జనావాసాలపై విరుచుకుపడుతోంది. రహదారులను మింగేస్తోంది.

వాస్తవానికి ముంబయి ఒక నగరం కాదు. ఏడు దీవులను కలపడం ద్వారా దానిని నిర్మించారు. కాల క్రమేణా ఆ దృశ్యం అదృశ్యమైంది. అవిభాజ్యమైన నగరంగా ముంబయి రూపొందింది. విచ్చల విడిగా పెరిగిన నిర్మాణాలు ఒకప్పుడు వర్షపు నీటిని ఎప్పటికప్పుడు సముద్రానికి తరలించిన జల మార్గాలను పూర్తిగా మాయం చేశారు. ఫలితంగా వర్షపు నీటి ప్రవాహానికి ప్రకృతి సహజమైన మార్గాలు మూసుకుపోయాయి. దీనికి తోడు భూ గర్భ, ఉపరితల మిళితంగా ఉన్న డ్రెయినేజి వ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీటిని తరలించడానికి ఏకైక వాహకంగా ఉన్న మితి నది ఆక్రమణలకు గురైంది. అది పేరుకే నదిగా మిగిలింది. ఈ స్వయం కృతాపరాధమే ముంబయి వాసులకు వర్షకాలంలో తిప్పలు తెచ్చిపెడుతోంది. సమైక్య రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ ఇదే స్థితి. ఒక అధ్యయనం ప్రకారం 404 చెరువులు అదృశ్యమైనాయి. ప్రస్తుతం వీటి ఆనవాళ్లు కూడా దొరకడం లేదు. కీలకమైన హుస్సేన్‌సాగర్ 40 శాతం పైగా ఆక్రమణలకు గురైంది. మూసీ నది పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇటీవల భాగ్యనగర వాసులను కలవరపరుస్తున్న నురుగు సమస్యకు మురుగునీటి పారుదల వ్యవస్థలోని లోపాలే కారణం. 2015లో చెన్నై నగరాన్ని ముంచెత్తిన వరదకూ సహజ నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడటమే కారణం. బెంగళూరుతో పాటు దేశంలోని ఇతర కీలకమైన అన్ని ముఖ్య నగరాల్లోనూ ఇదే స్థితి!

అతి తక్కువ రోజుల్లో అత్యధిక వర్షపాతం కురవడమన్నది ఇటీవల సాధారణ అంశంగా మారింది. అనూహ్యంగా విరుచుకుపడుతున్న ఈ వర్షపు ధాటికి మహా నగరాలు పండుటాకుల్లా వణికిపోతున్నాయి. మరోవైపు ఆర్థిక సంస్కరణల అమలులో భాగంగా పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాలు నగరాలు, పట్టణాలపై పెనుభారం మోపుతున్నాయి. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఫలితంగా అక్రమార్కులకు, కబ్జా రాయుళ్లకు పాలకవర్గాలు బాహాటంగానే మద్దతు పలుకుతున్నాయి. ఇటీవలి ఒక అధ్యయనం ప్రకారం గత 30 సంవత్సరాల కాలంలోనే ముంబయి నగరంలో ఆక్రమణల పర్వం జోరుగా సాగింది. హైదరాబాద్‌లోనూ 1980వ దశాబ్దం తరువాతే కబ్జా రాయుళ్లు చెలరేగిపోయారు. మిగిలిన నగరాల్లోనూ ఇదే స్థితి. దేశంలో ఆర్థిక సంస్కరణల అమలుకు పర్యావరణ విధ్వంసానికి మధ్య ఉన్న సంబంధాన్ని ఇది ధృవీకరిస్తోంది. జాతీయ విపత్తుల నివారణ కమిటీ నగరాల అభివృద్ధికి చేసిన ఎన్నో సూచనలు అమలు కాకపోవడానికి కూడా ఈ నేపథ్యమే కారణం. ఇక పర్యావరణ ఉద్యమకారులు చేసే విజ్ఞప్తులు ప్రభుత్వాల చెవికెక్కడం లేదు. వరుసగా సంభవిస్తున్న విపత్తుల నేపథ్యంలోనైనా పాలకవర్గాల వైఖరి మారాల్సివుంది.

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ స్థాయి రాజధానిని నిర్మిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలో సాగుతున్న పర్యావరణ విధ్వంసంపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమవుతోంది. కృష్ణా నది మనుగడపై కూడా పర్యావరణ నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాజధాని నిర్మాణం కోసం సమీకరించిన భూమిలో ఉన్న వాగులు, వంకల సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యతతో పాటు, మురుగు నీటి పారుదలకు అవసరమైన పూర్తిస్థాయి ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది. ఆ దిశలో తీసుకునే పటిష్టమైన చర్యలే ఆంధ్రప్రదేశ్ రాజధానికి నూతన గుర్తింపును తీసుకువస్తాయి. ప్రజలకు భరోసానిస్తాయి. లేకుంటే ఈ నగరం కూడా ప్రజలకు నరకంగా మారుతుంది.

మహనీయుల మాట




ఏ విషయాన్నయినా నిగ్రహం కోల్పోకుండా వినగలిగే సామర్థ్యాన్ని విద్య ప్రసాదిస్తుంది.

- రాబర్ట్ ఫ్రాస్ట్

'శానిటరీ' పన్ను శాపం

శానిటరీ నాప్‌కిన్లను కూడా జిఎస్‌టి బిల్లు వదిలిపెట్టలేదు. 2017 జులై 1 నుంచి దేశ వ్యాప్తంగా ప్రారంభమైన ఈ బిల్లు మహిళల ఆరోగ్యాన్ని లగ్జరీ వస్తువుల జాబితాలోకి చేర్చింది. సహజంగా ప్రకృతి నియమాలలో భాగంగా ప్రతి నెలా రుతుక్రమం జరుగుతుంది. 12 ఏళ్ళ నుంచి 50 ఏళ్ళ వరకు గల మహిళలందరూ అంటే దేశంలో కోట్లాది మంది ఎదుర్కొనే సమస్య ఇది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వున్న కొంతమంది శానిటరీ నాప్‌కిన్లు తప్పకుండా వాడతారు. శక్తి వున్నా లేకపోయినా మరి కొంతమంది వీటిని వినియోగిస్తారు. ఇవేమీ విలాస వస్తువులు కావు. వినోదం కోసం వాడేవి అంత కంటే కాదు. ఆరోగ్య సూత్రాలలో భాగంగా వినియోగించే వీటిపై ఏకంగా ఏడు శాతం పన్ను పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని బట్టే మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో అర్థమౌతుంది. కేవలం కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడానికే ఈ జిఎస్‌టి బిల్లును ప్రవేశపెట్టారు. అసలు రుతుస్రావ సమస్యను మహిళల ఆరోగ్య సమస్యగా చూడటం లేదు. గౌరవప్రదంగా భావించడం లేదు.



అన్ని రకాలుగా ఆడవాళ్ల అభివృద్ధి దేశ అభివృద్ధి అని చెప్తున్న పాలకులకు ఇది కనిపించడం లేదా? స్వచ్ఛభారత్ అంటే ఆరోగ్య భారత్‌గా ప్రధాని చెప్తున్నారు. పాఠశాలల్లో నీరు లేక, మరుగుదొడ్లు లేక, ఉన్నా నిర్వహించే వ్యవస్థ లేక, కాలికి చెప్పులు లేక, గ్రామాలలో, మురికివాడల్లో ఆరుబయట మల విసర్జనలు జరుగుతున్నాయి. వీటితో సామాన్య జనం ఆరోగ్యసమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితులను మార్చాలనే కనీస బాధ్యత లేని కేంద్రం జిఎస్‌టి పేరుతో నాప్‌కిన్లపై పన్ను వేయడానికి సిద్ధమైంది. కాటన్ బట్ట ఖరీదైన వస్తువుగా మారింది. పాఠశాలల్లో ఆడపిల్లలు నూలు వస్త్రాలు దొరకక, నాప్‌కిన్లను కొనుక్కోలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో పాఠశాలలకు రాలేక పోతున్నారు. బాలికల్లో డ్రాపవుట్స్ పెరగడానికి ఇదీ ఒక సమస్యగానే వుంది. కనీసం పరిశుభ్రం చేసుకునే పూర్తి స్థాయి టాయ్‌లెట్స్ సౌకర్యం, నీటి సౌకర్యం వుండటం లేదు. దీంతో ఆరోగ్య సమస్యలు, గైనిక్ సమస్యలు వారిని వెంటాడుతూ వుంటాయి. ఇదేం స్వచ్ఛభారత్.

నెప్డల్ పథకానికి తిలోదకాలు

జాతీయ విద్యలో బాలికల నైపుణ్యాభివృద్ధికి, వారి అవసరాలను తీర్చేందుకు 2013 వరకు నెప్డల్‌ను కేంద్ర పథకంగా కొనసాగించింది. అందులో భాగంగా విద్యార్థినులతోనే శానిటరీ నాప్‌కిన్లు తయారుచేసేవారు. వాటిని ఐదు రోజులకు సరిపడే విధంగా ఆ క్లస్టర్లలో గల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సరఫరా చేసేవారు. అయితే 2013 నుంచి బడ్జెట్‌లో నిధులను పూర్తిగా నిలిపివేశారు. ఎస్-ఎస్‌ఎకు బాధ్యత అప్పగించినప్పటికీ నిధులు లేక రెండేళ్ళుగా సంక్షేమ హాస్టళ్లకు, కెజిబివి పాఠశాలలకు, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సరఫరా ఆగిపోయింది. అయితే ఎంతో కొంత చైతన్యంతో నాప్‌కిన్లను కొనుగోలు చేసుకొని వినియోగిస్తున్న వారికి జిఎస్‌టితో మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు అయ్యింది. అందుకే దేశవ్యాప్తంగా మహిళా టీచర్లు, విద్యార్థినులు, ఆడవాళ్ళు దీన్ని అంగీకరించడం లేదు. ఈ దేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పక్షాన వుందా? మహిళల పక్షాన వుందా? తేలాల్సిందేనని శానిటరీ నాప్‌కిన్ల ఉద్యమాన్ని చేపట్టబోతున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే ఆడపిల్లలందరికీ ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఉచితంగా నాప్‌కిన్ ప్యాడ్లను సరఫరా చేయాలి. పెంచిన పన్నును వెంటనే రద్దు చేయాలి. మహిళల ఆరోగ్య సమస్యలైన శానిటరీ సమస్యలు, రక్తహీనత, టాయ్‌లెట్లు, నీటి సమస్యలు వెంటాడుతున్నన్ని రోజులు స్వచ్ఛ భారత్ కేవలం ప్రచారంగా మిగిలిపోతుందని కేంద్రం గుర్తించాలి. లేదంటే భవిష్యత్తులో ఒక పెద్ద మహిళా ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

కె విజయగౌరి,
యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

కుల వివక్షను ఎదిరించి కుట్రను తిప్పికొట్టాలి

రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన పచ్చికాపల్లం మహాభారతం ఎట్టకేలకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. 2016లో జరిగిన మహాభారతంలో ఒక ఒప్పందానికి వచ్చినా ఒప్పందం అమలు కాకుండా పెత్తందార్లు ప్రయత్నాలు చేశారు. దీనిపై కెవిపిఎస్, డిఎస్‌ఎమ్‌ఎమ్ నేతృత్వంలో జిల్లాలోని దళిత సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం జరిపింది. జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు జోక్యం చేసుకొని 2017, జులై 9న జరిగిన చర్చల్లో అందరూ కలిసి మహాభారతం జరపాలనే ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం విఫలమైనట్లు, అసలు సమస్యే లేనట్లు, దళిత సంఘాలు కావాలనే 'వివక్ష' అనే కుట్ర చేస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ కాషాయ కూటమి కరపత్రం వేసి తమ దళిత వ్యతిరేకతను చాటుకున్నాయి. అయినప్పటికీ అటు 47 గ్రామాల ప్రజలు, ఇటు 19 దళిత వాడల ప్రజలు కలిసి మహా భారతం జరపబోతున్నారు. మహా భారతం జరగకుండా విద్వేషాలు రెచ్చగొట్టాలని కాషాయ దళం చేసిన ప్రచారాన్ని అటు అధికారయంత్రాంగం, ఇటు ప్రజలు తిప్పి కొట్టారు. 'దేవుడి దృష్టిలో అందరూ సమానమనే ఆర్‌ఎస్‌ఎస్ వారికి ఏ దేవుడు చెప్పాడో కాని కుల విక్షను ఎదిరించిన అన్నమయ్యను మరిచారు.. వివేకానందుని వివేకాన్ని వదిలి అవివేకులుగా మారారు. అసలు కుల వివక్ష లేదని, వాస్తవాలను మరుగు పర్చాలని చూశారు.




పట్టుదలగా ఉద్యమాన్ని నడిపిన దళితులు

మహాభారతంలో జరిగిన కుల వివక్షకు వ్యతిరేకంగా, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం దళితులు పట్టుదలగా పోరాడారు. సమస్యను మొదట్లో రాష్ట్ర, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ల దృష్టికి తెచ్చారు. కుల వివక్ష లేని మహాభారతం జరపాలని మే నెల నుండి పలు రూపాలలో ఆందోళనలు చేపట్టారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నాగమోహన్ దాస్ అతిథిగా జిల్లా సదస్సు జరిపారు. మాజీ జిల్లా జడ్జి గురప్ప అధ్యక్షతన సంఘీభావ కమిటి నేతృత్వంలో జిల్లాలోని అన్ని డివిజన్లు, మండలాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, సంఘీభావ ధర్నాలు, సదస్సులు జరిగాయి. అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్‌ను పిలిపించి సభ నిర్వహించారు. జిల్లాలోని దళితులు ఎదుర్కొంటున్న వివక్షను రూపు మాపాలని శ్మశానం తదితర సమస్యలు పరిష్కరించాలని వేలాదిమందితో డిఎస్‌ఎమ్‌ఎమ్ జాతీయ నాయకులు బివి రాఘవులు ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్ కార్యాలయం చుట్టు ముట్టారు. అధికారులు సానుకూలంగా స్పందించడం సంతోషకరం.

వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా వ్యకాసం ప్రధాన కార్యదర్శి

అమెరికా ఉచ్చులో మోడీ ప్రభుత్వం

యం. కృష్ణమూర్తి



సందర్భం

సెప్టెంబరు 1న సామ్రాజ్యవాద వ్యతిరేక దినం


మోడీ నాయకత్వంలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర్యోద్యమం నాటి నుండి భారతదేశం అనుసరిస్తున్న సామ్రాజ్య వాద వ్యతిరేక వైఖరిని తుంగలో తొక్కి అమెరికాకు మోకరిల్లుతున్నది. ఇంటా బయటా సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు సానుకూల వైఖరిని తీసుకుంటున్నది. మన రక్షణ రంగాన్ని సైతం సామ్రాజ్యవాదులకు దఖలు పరుస్తున్నది.

మోడీ ప్రభుత్వం అమెరికా సైనిక కూటమిలో భారతదేశాన్ని భాగస్వామిని చేసింది. ప్రధాన రక్షణ భాగస్వామి గుర్తింపు, హోదాతో సహా తనకు అత్యంత సన్నిహిత మిత్రుడుగా భారత్‌ను అమెరికా ప్రకటించింది. ఈ వివరాలన్నింటినీ అమెరికా ప్రభుత్వం సెనేట్ ఆమోదం కోసం పెట్టింది. కానీ మోడీ ప్రభుత్వం ఈ అంశాలను మన ప్రజల ముందుంచలేదు. పైగా పార్లమెంటులో కూడా ప్రకటన చేయలేదు. ఈ ఒప్పందంతో భారత రక్షణ బలగాలను అమెరికా పరిశీలనకు అంగీకరించింది. ఫలితంగా భారత రక్షణ ఉత్పత్తులు అమెరికా నియంత్రణలోకి వచ్చాయి. మన దేశ సార్వభౌమాధికార, వ్యూహాత్మక స్వతంత్రతలో రాజీ పడింది. ఈ రక్షణ మరియు భద్రత ఒప్పందం పశ్చిమాసియా, ఇండో పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాలను కాపాడుతుందని స్పష్టం చేసింది. దీంతో భారతదేశం అమెరికా జూనియర్ భాగస్వామిగా దృఢపడింది. దీనిలో భాగంగా భారత, అమెరికా మంత్రిత్వశాఖలు పరస్పర రవాణా సహకారంపై కూడా అంగీకారానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం ప్రపంచంలో ఏ దేశం మీద అమెరికా యుద్ధం చేసినా మన దేశంలో అమెరికా యుద్ధ విమానాలు-యుద్ధ నౌకలు చమురు నింపుకునేందుకు, మరమ్మతులు చేసుకునేందుకు, వాటి నిర్వహణకు, వాటిని మన భూభాగంలో నిలుపుకునేందుకు అంగీకరించడమే. ఆ విధంగా అమెరికా సైనికులను మన గడ్డపై నిరంతరం ఉండేందుకు అంగీకరించడమే. పశ్చిమాసియాను నాటో/అమెరికా యుద్ధ చర్యలకు ఉపయోగించుకుంటాయి. అక్కడ పని చేస్తున్న భారత పౌరులపైనే కాక, భారత విదేశాంగ విధానంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఫిలిప్పైన్స్, దక్షిణ కొరియా ప్రభుత్వం, జపాన్ దేశాలతో చేసుకున్న రవాణా ఒప్పందానికి మారు పేరే పరస్పర రవాణా సహకారం. అంటే దీనితోపాటు భారతదేశం మరో రెండు ఒప్పందాలను చేసుకుంది. వాటి ప్రకారం రక్షణ రంగానికి సంబంధించి ప్రాథమిక సమాచార మార్పిడి, సహకారం అందించుకోవాలి. దీని వలన భారత సాయుధ బలగాలు అమెరికా సాయుధ బలగాలతో కలిసి పనిచేయాలి. ఈ ఒప్పందంతో బిజెపి ప్రభుత్వం అమెరికాకు పూర్తిగా లొంగిపోయింది. ఈ ఒప్పందాలతో భారత్... అమెరికా వ్యూహాత్మక భాగస్వామి కావడంతో భారత దేశానికి ఆయుధాలు అమ్మే దేశంగా అమెరికా తయారైంది. ఈ బంధుత్వంతోనే ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రత నిబంధనలను అమెరికాకు అనుకూలంగా మరో పదేళ్ళు కొనసాగేలా చేసింది. ఈ ఒప్పందం ద్వారా భారత దేశాన్ని దీర్ఘకాలిక సైనిక ఒప్పందంలోకి అమెరికా విజయవంతంగా లాగ గలిగింది. దీని వలన ఉమ్మడి సైనిక విన్యాసాలు, విదేశీ బహుళజాతి సమ్మేళనాలు, మిసైల్ రక్షణ సహకారం, రక్షణ వ్యాపార కొనుగోళ్ళు, సాయుధ బలగాల అంతర్గత సహకారాలు, అమెరికాతో ఉమ్మడి మలబార్ నావికా విన్యాసాలు ప్రతి సంవత్సరం జరుగుతున్నాయి. అదే విధంగా వాయు, సాయుధ బలగాల ఉమ్మడి విన్యాసాలు పెరుగుతున్నాయి. వీటన్నింటి ఫలితంగా ఏ దేశం కంటే భారతదేశంలోనే సైనిక విన్యాసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మనకు లాభం లేని అసంబద్ధమైన సంబంధాలు అమెరికాతో ఏర్పడ్డాయి.

'రక్షణ సాంకేతిక చొరవ' పేరుతో ఏకపక్షంగా అమెరికాకు అనుకూల ఒప్పందాలు జరుగుతున్నాయి. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం రూపంలోగానీ, వ్యూహాత్మకంగా గానీ వీటివల్ల భారతదేశానికి ఎలాంటి ప్రయోజనమూ లేదు. అమెరికాతో సున్నితమైన రక్షణ సాంకేతిక సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే ఒప్పందాన్ని బిజెపి ప్రభుత్వం అంగీకరిస్తున్నది. గత వాజ్‌పేయి ప్రభుత్వమే ఇందుకు పునాదులు వేసింది. బిజెపి ఓడిపోయినందున ఆగాయి. మన్‌మోహన్ ప్రభుత్వం ఆసక్తి చూపినా ఒత్తిడి వలన ముందుకు సాగలేదు. ఇప్పుడు స్వంత మెజారిటీతో బిజెపి అధికారంలోకి రావడంతో ఆ ఒప్పందాలను చేసుకునేందుకు చురుకుగా కదులుతున్నది. వాస్తవానికి అమెరికా ప్రభుత్వాల గూఢచర్యం పట్ల ప్రపంచమంతా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మోడీ ప్రభుత్వం ఆసక్తి చూపడం మరీ అన్యాయం.

ఐక్యరాజ్య సమితి చేసిన అన్ని తీర్మానాలను ఉల్లంఘించి

అమెరికాకు దగ్గరయ్యే బిజెపి వైఖరి మన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం అక్కడికే పరిమితంగాక మొత్తంగా అమెరికా దోచుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. భారత్ - అమెరికా అణు ఒప్పందం అమెరికా కార్పొరేట్ల లూటీకి ద్వారాలు తెరిచింది.



బిజెపి ప్రభుత్వం ఇజ్రాయిల్‌తో లోతైన సంబంధాలను పెట్టుకోవడం మరో ముఖ్యమైన పరిణామం. నేడు ఇజ్రాయిల్ నుండి అన్ని దేశాలకంటే ఎక్కువ ఆయుధాల కొనుగోలు దారుగా భారత్ మారింది. తద్వారా పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులకు ఆర్థిక సహకారం అందించినట్లయింది. కాశ్మీర్ ప్రజలను అంధులను చేసే పెల్లెట్ గన్నులు ఇజ్రాయిల్ నుండి కొనుగోలు చేసినవే. గాజాపై ఇజ్రాయిల్ దాడి చేసి 2,200 మంది పాలస్తీనా పౌరులను పొట్టన పెట్టుకున్నా మోడీ ప్రభుత్వం ఖండించలేదు. ఇజ్రాయిల్‌ను ఖండించేందుకు పార్లమెంటులో తీర్మానాన్ని కూడా బిజెపి తిరస్కరించింది. స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి భారత్‌కు మిత్రుడిగా ఉంటున్న పాలస్తీనాపై ఇంత దారుణానికి ఒడిగట్టినా ఇజ్రాయిల్‌ను ఖండించకపోవడం మన విదేశాంగ విధానంలో వచ్చిన మార్పుకు సంకేతం.

మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాద, మతోన్మాద అనుకూల విధానాలను అనుసరించడం వలన భారతదేశంలో ఉగ్రవాదం వ్యాప్తి చెందేందుకు భూమిక ఏర్పడుతున్నది. పశ్చిమాసియాలో అభ్యుదయ ప్రజా ఉద్యమాలను విచ్ఛిన్నం చేసేందుకు అమెరికా సృష్టించిన ఆల్‌ఖైదా, ఐఎస్ తదితర ఉగ్రవాద సంస్థల ప్రభావం మన దేశంలో పెరుగుతున్నది. బిజెపి ఇజ్రాయిల్ అనుకూల వైఖరి దాని హిందూ మతతత్వంతో ముడిపడి వుంది. జాతీయ దురహంకారంలో ఇజ్రాయిల్, బిజెపి సహజ మిత్రులు. ఇజ్రాయిల్ అరబ్బులపై దాడి చేసి తరిమేసినట్లే భారతదేశంలో ముస్లింలను తరిమికొట్టాలనే సిద్ధాంతమే బిజెపిని ఇజ్రాయిల్‌కు దగ్గర చేస్తున్నది. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలన్నింటినీ ఇజ్రాయిల్‌ను బహిష్కరించమని పిలుపునిచ్చిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు అనుకూల వైఖరి తీసుకోవడం భారతదేశానికి అవమానకరం.

అమెరికాకు దగ్గరయ్యే బిజెపి వైఖరి మన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం అక్కడికే పరిమితంగాక మొత్తంగా అమెరికా దోచుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. భారత్ - అమెరికా అణు ఒప్పందం అమెరికా కార్పొరేట్ల లూటీకి ద్వారాలు తెరిచింది. ఈ ఒప్పందం ముసుగులో మన డబ్బును వెస్టింగ్ హౌజ్ లాంటి దివాలా సంస్థలను రక్షించేందుకు ఉపయోగిస్తున్నది. కొవ్వాడలో పెట్టబోయే ఆరు న్యూక్లియర్ రియాక్టర్ల వెనుక భారీ అవినీతి దాగి వుంది. పెద్దనోట్ల రద్దు, నగదు రహిత లావాదేవీలు అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రయోజనాలకే. నగదు రహిత ఆర్థిక లావాదేవీలు వీసా, మాస్టర్ కార్డు వంటి ద్రవ్యసంస్థలకే గాక కార్పొరేట్ సంస్థలకు లాభదాయకం. భారత ప్రజలు వినిమయం తెలుసుకోవడం ద్వారా వారి ఉత్పత్తులను, ఆ ప్రజలను టార్గెట్ చేసి అమ్ముకునేందుకు ఉపయోగపడతాయి. ఆధార్‌ను బ్యాంకులకు అనుసంధానం చేయడంతో నగదు రహిత ఆర్థిక లావాదేవీలతో బహుళజాతి సంస్థలు మన వ్యవస్థలో వారి వ్యాపార కార్యకలాపాలకు ఉపయోగించుకుంటాయి. వస్తు సేవల పన్నుల విధానం అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, బహుళజాతి సంస్థల ఒత్తిడి ఫలితమే. దేశమంతటా తమ సరుకులను తేలికగా అమ్ముకునే మార్గం. అందువలనే అన్ని పెద్ద కార్పొరేట్ సంస్థలు జిఎస్టీని బలపర్చాయి.

అంతర్జాతీయ సంక్షోభం నేపథ్యంలో మన దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కారుచౌకగా అమ్మేస్తున్నారు. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు సంక్షోభంలో వున్న నేపథ్యంలో వాటి ప్రయోజనాల కోసం మన దేశంలో ఆర్థిక సంస్థలను దెబ్బ తీసేందుకు మోడీ ప్రభుత్వం ఎఫ్ఆర్‌డిఐ చట్టాన్ని చేసింది. ప్రజలంతా అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని, దాన్ని బలపరుస్తున్న మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని తిప్పికొట్టి అలీన విదేశాంగ విధానాన్ని నిలబెట్టుకోవాలి.

సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

'ఉప' ఫలితాలు - మలి సంకేతాలు

తెలకపల్లి రవి



విశ్లేషణ

మూడు రాష్ట్రాల్లో నాలుగు శాసనసభా స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీలే గెలుపొందాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఆప్, గోవాలో బిజెపి (2), నంద్యాలలో తెలుగుదేశం విజయం సాధించాయి. ఈ ఉప ఎన్నికల నేపథ్యం, పోటీల తీరు వేర్వేరైనా అధికార పక్షాల విజయమనే ఒక్క మాటతో వాటన్నిటినీ విస్మరించడం జరుగుతున్నది. ఈ ఫలితాలలోని రాజకీయ సంకేతాలేమిటన్నదానిపై వేరు వేరు భాష్యాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాల మనుగడను ప్రభావితం చేసేవిగాకున్నా వచ్చే ఎన్నికలకు సంబంధించిన రాజకీయ గుణపాఠాలు చాలానే తీసుకోవలసి వుంటుంది.

ఆప్‌కు ఉపశమనం

ఢిల్లీనే తీసుకుంటే పాలకపక్షంగా వున్న ఆప్‌కు అత్యంత క్లిష్టమైన సవాళ్ల మధ్య లభించిన ఈ విజయం పెద్ద ఉపశమనం. మోడీ కేంద్రంలో పూర్తి మెజార్టీతో అధికారం చేపట్టిన తర్వాత రాజకీయంగా తొలి దెబ్బ ఢిల్లీలో ఆప్ చేతుల్లో ఘోర పరాజయం. 70 స్థానాలలో కేవలం మూడింటిని తెచ్చుకోవడం. ఆదర్శాల కలయికగా అనేక ఆశలతో ప్రజలు ఆప్‌ను గెలిపించినా తర్వాత ఆ పార్టీ అనేక కల్లోలాలు చూసింది. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌పై కక్ష గట్టిన కేంద్రం ఢిల్లీ పోలీసు వ్యవస్థపై, సిబిఐపై తనకున్న పట్టును ఉపయోగించి నిరంతర వేధింపులకు గురిచేసింది. వీటికి పాలనా పరమైన అవకతవకలు తోడై ఆప్ అతలాకుతలమైంది. రాజౌరి గార్డెన్ ఉప ఎన్నికలోనూ, మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలోనూ ఆప్ అపజయాలు మూట కట్టుకుంది. అయినా కేజ్రీవాల్ తనను కాబోయే ప్రధాని పదవి అభ్యర్థిగా వూహించుకుని పంజాబ్, గోవా వంటి చోట్ల తనే ప్రత్యామ్నాయంగా వస్తానని హడావుడి చేసి భంగపడ్డారు. ఈ చేదు అనుభవాల తర్వాత ఇప్పుడు బవానాలో ఆప్ అభ్యర్థి రామచంద్రన్ 24 వేల ఓట్ల ఆధిక్యతతో బిజెపిపై గెలుపొందడం రాజకీయంగా పెద్ద వూరట. బిజెపి తరపున పోటీ చేసింది ఆప్ నుంచి ఫిరాయించిన పూర్వపు ఎంఎల్‌ఎ వేద్ ప్రకాశ్ కావడం మరో విశేషం. వరుస దెబ్బల తర్వాత ఆప్ కోలుకోవడం, తన పాలనా పీఠంగా వున్న ఢిల్లీలోనే బిజెపి ఓడిపోవడం చెప్పుకోదగిన విషయాలు. మరి ప్రజల మనోభావాలు గమనించి ఆప్ ఇప్పటికైనా కుదురుగా పాలిస్తుందా, కేంద్రం కుట్రలు విరమిస్తుందా అన్నది చూడాలి.

గోవాలో యథాతథం

2017 ఫిబ్రవరి శాసనసభ ఎన్నికలలో గోవాలో మెజార్టీ రాకపోయినా బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగిందంటే కాంగ్రెస్ అసమర్థతే కారణం. బిజెపి ముఖ్యమంత్రితో సహా చాలామంది మంత్రులు ఓడిపోయారు. 40 మంది సభ్యులున్న సభలో కాంగ్రెస్‌కు 17, బిజెపికి 13 స్థానాలు వచ్చాయి. మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ, గోవా ఫార్వర్డ్ పార్టీ, చెరి మూడు చొప్పున తెచ్చుకోగా మరో మూడు చోట్ల స్వతంత్రులకు, ఒక చోట ఎన్‌సిపికి విజయం లభించింది. కాంగ్రెస్ చొరవ చూపేలోగా బిజెపి గోమంతక్ పార్టీతో కలసి స్వతంత్రుల సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంతకు ముందు ముఖ్యమంత్రి పదవి వదలి రక్షణ మంత్రిగా వెళ్లిన మనోహర్ పారికర్ మళ్లీ హుటాహుటిన వచ్చి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన సభకు ఎన్నిక కావడం కోసమే ఇప్పుడీ ఉప ఎన్నిక జరిగింది. దాంతోపాటే మరో మంత్రి కూడా ఇంకోచోట నుంచి గెలిచారు. ఇవి బిజెపి స్థానాలే గనక బలాబలాల్లో మార్పేమీ వుండదు.



ఈ ఒక్క విజయంతో తమ విధానాలు మహత్తరమని ప్రజలు తీర్పునిచ్చినట్టు ప్రభుత్వం టముకు వేసుకోవడం, ప్రతిపక్షం అసలు అవసరమే లేదని అపహాస్యం చేయడం మరింత పెద్దపొరబాటు. ఇక్కడ తన విజయాన్ని టిడిపి అతిగా చూపిస్తుంటే తన పరాజయాన్ని వైసీపీ మరీ తక్కువ చేస్తున్నది.

నాంది-ప్రస్తావనలేమిటి?

ఈ నాలుగు ఉప ఎన్నికల్లోనూ అందరినీ అమితంగా ఆకర్షించింది నంద్యాల ఉప ఎన్నిక. పాలక టిడిపి, అధినేతల అధికార ప్రయోగం, ప్రతిపక్ష వైసీపీ అత్యుత్సాహం అందుకు కారణమైనాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉప ఎన్నికల వేటిలోనూ లేనంత హడావుడి హంగామా నడిచాయి. రాష్ట్ర విభజన జరిగి, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజకీయంగా జరిగిన తొలి పోటీ ఇదే కావడం మరో కారణం. గతంలో వైసీపీ నుంచి గెలిచి టిడిపిలో చేరిన భూమా నాగిరెడ్డి మరణం వల్ల ఏర్పడిన ఖాళీ కావడం ఇంకో కారణం. చర్చ ఫిరాయింపుల గురించే అయినా అంతకు ముందు తమపై టిడిపి తరపున పోటీ చేసిన మాజీ కాంగ్రెస్ మంత్రి శిల్పా మోహనరెడ్డిని తమ అభ్యర్థిగా తెచ్చుకుంది వైసీపీ. అక్కడ టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేసిన తర్వాతే ఆయన ఇటొచ్చారు. ఈ లోటు కనిపించకుండా జగన్ ఆయన తమ్ముడైన శిల్పా చక్రపాణి రెడ్డికి ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేయించారు (ఈ అంశానికి ప్రచారం రాలేదని వైసీపీ ఫిర్యాదు చేస్తుంది గాని ఆయన అభ్యర్థి కాదని గుర్తించాలి). అధికారంలో వుంటే ఉప ఎన్నికల విజయం కోసం ఎంత దూరమైనా వెళ్లి పనిచేసే ముఖ్యమంత్రి చంద్రబాబు ముందునుంచే సర్వ శక్తులూ కేంద్రీకరించారు. రాజధానినే నంద్యాలకు మార్చినంత పనిచేశారు. భూమా బ్రహ్మానందరెడ్డినే అభ్యర్థిగాపెట్టారు. తండ్రి చనిపోగానే అఖిల ప్రియను మంత్రిని చేశారు. ఇదంతా నంద్యాలను కాపాడుకునే వ్యూహంలో భాగమే. ఎన్నికల కోసం యాభై మంది ఎంఎల్‌ఎలను 12 మంది మంత్రులతో సహా మొత్తం నాయకత్వమంతటినీ దించారు. ఇదంతా భారీ ఎత్తున పథకం ప్రకారం జరిగింది. ఓట్ల కొనుగోలు కోసం నోట్ల వరద పారింది. వైసీపీ సామాజిక సమీకరణలు, నోట్ల పంపిణీ చేయలేదని కాదు గాని ప్రతిపక్షంగా దాని పరిమితులు దానికి వున్నాయి. పైగా జగన్ తనుగా ఖర్చు చేయరంటారు. శిల్పా మోహనరెడ్డికి అనుభవం హంగులూ వున్నా జగన్ అక్కడే వుండి పోవడంతో ఉత్సవ విగ్రహంగా మారిపోయారు. జగన్ ఆయన సహచరుల అనుభవ రాహిత్యం, అనాలోచిత వ్యాఖ్యలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. నంద్యాల ఎన్నిక రాబోయే మార్పునకు నాంది అనీ, ప్రభుత్వ విధానాలపై రెఫరెండం అని ప్రకటించేముందు వాస్తవాలను బేరీజు వేసుకున్నారా అనేది సందేహమే. చంద్రబాబును కాల్చేయాలంటూ మాట్లాడితే ప్రజలు మెచ్చరని కూడా జగన్ తెలుసుకోలేకపోయారు. విమర్శలు వచ్చాకైనా సర్దుకోకపోగా మరింత తీవ్రంగా మాట్లాడి తన ధోరణి అదేనని చెప్పుకున్నారు వైసీపీ ప్రధాన ప్రచారకర్తగా ఎంచుకున్న సినీ నటి రోజా... మంత్రి అఖిల ప్రియ వేషధారణపై వ్యాఖ్యలు చేసి వెగటు పుట్టించారు. జగన్, రోజాల మాటలను పదేపదే వినిపించడంలో మంత్రులు పోటీ పడ్డారు. దళితులపై మంత్రి ఆదినారాయణ రెడ్డి అవాకులు మాట్లాడారు. అయినా.. అధికార పక్షంతో వుంటేనే అభివృద్ధి అన్న సిద్ధాంతం అక్కడ బాగా ఎక్కింది. ఇప్పటి వరకూ ఎలాగూ అభివృద్ధి జరగలేదు గనక మిగిలిన ఒకటిన్నర ఏడాదైనా ఏదైనా జరుగుతుందనే ఆశతో ప్రజలు అధికార పార్టీకి ఓటేసి వుండొచ్చు..

జయాపజయాలు ఎలా వున్నా నంద్యాలలో విభజితాంధ్రప్రదేశ్ అపరిష్కృత సమస్యలు, కేంద్రం సహాయ నిరాకరణ, బిజెపి హయాంలో మతోన్మాద దాడులు, దానితో టిడిపి చెలిమి వంటి అంశాలు చర్చకు రావలసింది. విధానపరమైన తప్పిదాలు, రాయలసీమ సమస్యలు, కర్నూలు జిల్లాలోనే ఏకపక్ష భూసేకరణ, పునరావాస సమస్యల వంటివి మాట్లాడవలసింది. కాని బిజెపికి దగ్గరగా జరిగిన జగన్ ఆ అంశాలను బలంగా ముందుకు తేలేదు (తీరా ఇప్పుడు వారు తీసి పారేశారు). 'తానే కాబోయే ముఖ్యమంత్రి' అన్న ఏకైక కోణంలో దుందుడుకుగా మాట్లాడ్డం ద్వారా జగన్‌కు వున్న అనుకూలతను కూడా పోగొట్టుకుని అత్యధిక తేడాతో ఓటమి కొని తెచ్చుకున్నారు. తర్వాత కూడా రాజకీయ వాస్తవికత చూపకపోగా ఎదురుదాడికే పరిమితమవుతున్నారు. ప్రభుత్వంపైన, అధికార దుర్వినియోగంపైనా తప్పక విమర్శ చేయవలసిందే. కాని తమ తప్పిదాలపై ఆత్మ విమర్శ కూడా జరగాలి. మిగిలిన 20 చోట్ల రాజీనామా చేయండని సవాలు చేయండని తాము విసిరే సవాలను పాలకపక్షం ఎలాగూ తీసుకోదు గనక కేవలం ప్రచారానికే పనికి వస్తుంది. అయితే ఈ ఒక్క విజయంతో తమ విధానాలు మహత్తరమని ప్రజలు తీర్పునిచ్చినట్టు ప్రభుత్వం టముకు వేసుకోవడం, ప్రతిపక్షం అసలు అవసరమే లేదని అపహాస్యం చేయడం మరింత పెద్దపొరబాటు. ఇక్కడ తన విజయాన్ని టిడిపి అతిగా చూపిస్తుంటే తన పరాజయాన్ని వైసీపీ మరీ తక్కువ చేస్తున్నది. నంద్యాలలో శాంతిభద్రతలు భగ్నం చేసే కుట్రలు జరుగుతున్నాయని స్వయంగా ముఖ్యమంత్రే ఆరోపించినా వైసీపీ ప్రత్యారోపణలు చేసినా ప్రజలు మాత్రం ప్రశాంతతను కాపాడుకోవడం అభినందనీయం. పోలింగ్ తర్వాత కూడా ఉద్రిక్తత పెంచేందుకు, పరస్పర దాడులకు ప్రయత్నాలు జరిగితే ప్రభుత్వ యంత్రాంగం పాక్షికతనే చూపింది. పాలక పక్షీయులు చంద్రబాబు భజన కీర్తనలు పాడి పరవశిస్తుంటే రోజా వంటి వారు జగన్ ఔన్నత్యంపై పోస్టింగులు పెడుతున్నారు. ఈ వ్యక్తిగత పోకడలు, నిరర్థక వాదనలు వాక్ కాలుష్యాలు మాని ప్రజల సమస్యలపైన రాష్ట్రాభివృద్ధి విధానాలపైన కేంద్రీకరించడం శ్రేయస్కరం.

జీవన the family

ప్రజాశక్తి
విజయవాడ 5
గురువారం 31-08-2017



సహజంగా సమాజంలో ఆడపిల్లంటే.. ఎప్పటికైనా ఓ ఇంటి ఆడపడుచు. మంచైనా చెడైనా అక్కడే సాగాలి.. అనే అభిప్రాయం. అంతేకాదు, భర్త తోడు లేకుండా ఆడపిల్ల బతకలేదు.. తనపై ఆధారపడ్డ పిల్లల్నీ సాకేంత తెగువ, ధైర్యం ఒంటరి ఆడవాళ్ళల్లో ఎక్కడుంటాయి..? ఎవరో ఒకరిమీద ఆధారపడి ఎలాగోలా బతికేస్తే చాల్లే.. అనే ఓ తేలికపాటి భావన సర్వసాధారణం. కానీ, ఆమె.. మాత్రం అలా ఉండలేకపోయింది. కుటుంబానికి అండగా నిలవాల్సిన భర్త లేకున్నా.. ధైర్యంగా నిలబడింది. తన భర్త ఎక్కడ పోగొట్టుకున్నాడో.. అక్కడే ఉండి.. పట్టుదలతో గెలిచింది.. నెగ్గింది. జీవితంలో ఏనాడూ ఊహించని విధంగా పలుగు, పార పట్టి వ్యవసాయ క్షేత్రంలో తానొక చెమట బిందువైంది. ఆనక తాను నిలబడటమే కాకుండా పదుగురికి ఆసరాగా నిలిచే పోరాట ప్రతిమయ్యింది. పదండి.. ఆమె కష్టం విలువ తెలుసుకుందాం!!

గేలి చేసిన చోటే సేద్యం చేసింది

మానవుడు సంఘజీవి. ఒంటరితనాన్ని పక్కన పెట్టి మన చుట్టూ ఉన్నదీ మనలాంటివారే అనే భావనతో ముందుకు సాగితే జీవితంలో ఏదైనా సాధించవచ్చు అంటారు ప్రతిమ. ఒంగోలులోని మంగమూరు ప్రాంతంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో క్షణం తీరికలేని మహిళా వ్యాపారవేత్తగా ఎదిగేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారామె. అంతేకాదు, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఓ పదుగురికి ఉపాధిని ఇస్తున్నారు. ఇవన్నీ చేయగలనని ఆమె కలలో కూడా ఊహించలేదు. కానీ, జీవితం వేరు.. అనుకున్నవి అనుకున్నట్లు జరగవు. "డిగ్రీ పూర్తవ్వగానే ఇంట్లో పెళ్లి చేశారు. పెళ్లికి వారంరోజుల ముందు నాన్న చనిపోయారు. అయినా పెళ్లి ఆగలేదు. నా భర్త వ్యవసాయం, వ్యాపారం చేసేవారు. అయితే, అత్తింటివారికి ఇష్టం లేకపోవడంతో వచ్చిన బ్యాంకు ఉద్యోగాన్ని వదిలి వచ్చేశాను. ఉన్నంతలో జీవితం సాఫీగా సాగిపోతున్న సమయంలో నా భర్త వ్యసనాలకు బానిసై, అర్థాంతరంగా మమ్మల్ని విడిచి వెళ్లిపోయారు. అప్పటికే ఇద్దరు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలతో ఒంటరిగా మిగిలిపోయాననే భావనతో కుమిలిపోయిన రోజులవి" అంటూ గతాన్ని గుర్తుచేసుకున్నారామె. అలాంటి సమయంలో కొద్దోగొప్పో ఉన్న ఆస్తి... అప్పుల కారణంగా హరించుకుపోయింది. ఆత్మహత్య చేసుకుందామనే ఆలోచనలకు పిల్లలిద్దరి భవిష్యత్తు అడ్డుపడింది. వాళ్లిద్దరికోసమైనా మళ్లీ మామూలు మనిషి కావాలనుకుందామె. అయితే, ఏదైనా చేద్దాం అంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. ప్రతిమ పరిస్థితి తెలిసి, పెద్దమ్మాయి చదువుతున్న స్కూలు యాజమాన్యం ఉద్యోగం ఇస్తామన్నారు. ఆసరా ఉంటుందని వెంటనే చేరిపోయారు ప్రతిమ. అలా పిల్లలిద్దరినీ సాకుతూ వచ్చారు.

ఒంటరి ఆడపిల్లవి అన్నారు

ఆరు నెలలు గడిచేసరికి ఆమెకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. భర్త ఉన్న సమయంలో చేసిన అప్పులు ఆమెకు నిద్ర లేకుండా చేశాయి. రోజూ ఎవరోఒకరు వచ్చి అప్పు తీర్చాలంటూ ఒత్తిడి చేసేవారు. మరోవైపు ఏవో కుటుంబ కలహాల వల్ల అత్తింటివారి సహకారం పూర్తిగా లేకుండా పోయింది. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే.. ఎవరిమీదా ఆధారపడకుండా ఏదైనా పని చేయాలనే సంకల్పంతో ముందడుగు వేశారామె. "ఆయన చనిపోయాక వారి ఆస్తిలో ఒక్క రూపాయి కూడా నేను తీసుకోలేదు. ఆస్తి అంతా ఉమ్మడిలో ఉండిపోవడంతో నాకు పంచివ్వలేదు. ఆయన బతికున్నంత వరకూ కౌలు రూపంలో అయినా కొంత ఆదాయం లభించేది" అని మొన్నటి రోజుల్ని గుర్తుచేసుకున్నారావిడ.

సొంతంగానే వ్యవసాయం చేయాలనే ఆలోచన ఆమెకు అప్పుడే వచ్చింది. అయితే, బతుకుదెరువు కోసం వ్యవసాయం చేయాలనుకున్న ఆమె ఆలోచనలకు చుట్టుపక్కలవారి మాటలు అడ్డుపడ్డాయి. "ఆడపిల్లవి, పైగా ఇద్దరు పిల్లలతో ఒంటరిగా వ్యవసాయం చేస్తావా?" అంటూ మాట్లాడటం మొదలుపెట్టారు. కానీ ఆ మాటలు ఆమె భవిష్యత్తుకు ఎలాంటి చేయూతా ఇవ్వలేవని అర్థం చేసుకుందామె. పుట్టింటివారి నాలుగెకరాలకు తోడుగా మరో 20 ఎకరాలను కౌలుకి తీసుకుని.. ఒంటరిగానే



వ్యవసాయం చేయడం మొదలుపెట్టారు. కాలానికి తగినట్లుగా సీజనల్ పంటలు వేయడం, ఆ పంట చేతికి రావడంతో తను చేస్తున్న ప్రయత్నంపై కొంత నమ్మకం ఏర్పడిందామెకు. అలా వచ్చిన డబ్బుతో క్రమేణా అప్పులు తీర్చుకుంటూ వచ్చారు.

పరిశ్రమకు.. ప్రేరణ

అదే సమయంలో నెల్లూరు జిల్లాలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి గురించి తెలుసుకున్నారు ప్రతిమ. "బీటెక్ పూర్తిచేసి, డెయిరీ ఫాం నడుపుతోన్న ఓ యువకుని గురించి ఎవరో చెప్తే విన్నాను. అతనితో మాట్లాడిన తర్వాత, అటువైపుగా అడుగులు వేయాలనే ఆలోచన బలపడింది" అని తనకు కలిగిన ప్రేరణ గురించి వివరించారు ప్రతిమ. అలా వ్యవసాయంతో పాటు.. పాడి పరిశ్రమ ఏర్పాటు చేశారు. డెయిరీ పెట్టేందుకు బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు. ఆ సమయంలో కూడా కొందరు "డెయిరీ అంటే బాగా కష్టపడాలి. ఆడదానివి చేయలేవు.. ఆలోచించుకో!" అంటూ ఉచిత సలహాలిచ్చారు. కానీ అవేవీ ఆమె ఆలోచనను మార్చలేకపోయాయి. పొలానికి చుట్టుపక్కల వారు డెయిరీఫాం పెట్టడానికి వీల్లేదంటూ అడ్డుపడ్డారు.. బెదిరించారు కూడా! అయినా ప్రతిమ వెనకడుగు వేయలేదు. "మా తాతగారు కమ్యూనిస్టు భావజాలం గల వ్యక్తి. చిన్నప్పుడు ఆయన మాటలే ఈ రోజు నన్ను ధైర్యంగా నిలబడగలిగేలా చేశాయి" అనే ప్రతిమ మాటల్లో ఆ తెగింపునూ చూడగలం.

అలా.. ప్రతిమ ధైర్యంతో ముందడుగు వేస్తున్న క్రమంలో.. అధికారులు ఆమె పట్టుదలను చూసి సహకారం అందించారు. "వాళ్లు నా బాధను అర్థంచేసుకుని అవకాశం ఇచ్చారు. నిర్మాణం పూర్తయ్యింది. తొలుత పది పశువులతో మొదలుపెట్టాను. రెండేళ్లవుతోంది. ప్రస్తుతం ముప్పై వరకూ ఉన్నాయి. రోజూ 150 లీటర్లకుపైగా పాల ఉత్పత్తి వస్తోంది. కౌలు వ్యవసాయం తగ్గించి, వరిని వేసే ఆలోచనలో ఉన్నాను" అంటున్నారు ప్రతిమ. అంతేకాదు, డెయిరీలో వినూత్న పద్ధతులను అనుసరిస్తూ అందరి మన్ననలూ పొందుతున్నారీమె. పశువులకు కావాల్సిన జున్నుగడ్డి పంటలను తన పొలంలోనే స్వయంగా పండిస్తున్నారు. పశువుల వ్యర్థాలనే ఆ పంటలకు ఎరువుగా ఉపయోగిస్తుండటం మరో విశేషం. అలా అటు వ్యవసాయం, పాడి పరిశ్రమలతో పది మందికి ఉపాధిని అందించగలుగుతున్నారు ప్రతిమ.

పిల్లలే ప్రపంచంగా

రోజూ ఉదయం నాలుగు గంటలకే ప్రతిమ దినచర్య మొదలవుతుంది. పిల్లల్ని స్కూల్లో దించి, నేరుగా క్షేత్రానికి చేరుకుంటారు. స్కూల్ పూర్తయిన తర్వాత పిల్లలను తనతోపాటే క్షేత్రానికి తీసుకువస్తారు. "పిల్లలిద్దరూ చాలా యాక్టివ్‌గా ఉంటారు. వారిని విడిచి ఎక్కడికైనా వెళ్లాల్సి వచ్చినప్పుడు ఆలోచించాల్సి వచ్చేది. ఓ రోజు నా పెద్దకూతురు స్థితప్రజ్ఞ "నువ్వేం టెన్షన్ పడకమ్మా..! అంతా నేను చూసుకుంటాను కదా!" అంది. "నిండా ఆరేళ్లు నిండని మా అమ్మాయి అలా అనేసరికి నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఓ తల్లిగా అంతకంటే ఇంకేం కావాలి. ఆస్తులూ, అంతస్తులూ కాదు, నా పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతున్నాను" అంటూ సగర్వంగా చెప్పారు ప్రతిమ. "పిల్లలు నాతో పాటే వ్యవసాయక్షేత్రంలో తిరగటం వల్ల అమ్మపడే కష్టం ఏంటో వాళ్లకూ తెలుస్తోంది. ఆ పొలం గట్లు వారికి జీవిత పాఠాలను నేర్పుతాయి అనేది నా భావన" అంటారామె. వ్యవసాయ పద్ధతుల్లో వస్తోన్న మార్పులను ఇంటర్‌నెట్ ద్వారా అధ్యయనం చేస్తూ ఎందరో ఒంటరి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు ప్రతిమ.

- చందు తిలారు

ఫొటోలు : జి. కోటేశ్వరరావు

నమ్మకం ఉంటే ఏదైనా సాధ్యమే!

నా దృష్టిలో ఒంటరి అనే పదానికి అర్థంలేదు. ఏదో ఒకవిధంగా ఒకరికి ఒకరు సాయపడాలి. అదే జీవితం. మన నిర్ణయంపై మనకు నమ్మకం ఉన్నప్పుడు ఇతరుల మాటలు పట్టించుకోకూడదు. ఆడపిల్లలకు పెళ్లి చేసేటప్పుడు కుటుంబ గౌరవం, సిరిసంపదలే ముఖ్యం అనుకోకూడదు. వ్యవసాయం, పాడి పనుల్లో నాకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుని, పదిమందికీ సాయపడాలి. నా పిల్లలకు ఏ లోటూ లేకుండా చూసుకోవాలన్నదే నా లక్ష్యం.

- ప్రతిమ



పిల్లల.. పోట్లాటా?!

తనకి తోడుగా మరో బుజ్జాయి పుట్టినప్పుడు మొదట్లో భలే సంతోషపడతారు. ఎదిగే కొద్దీ ఏవో కారణాలతో చిన్నారులు చీటికీమాటికీ గొడవలు పడుతుంటారు. చూసేవాళ్లకి తోబుట్టువులా... శత్రువులా అన్నట్టుగా ఉంటుంది పరిస్థితి. మరి వాళ్లు కలిసిమెలిసి ఉండాలంటే..



- చాలామంది తమ పిల్లలకి ఒకేరకమైన వస్తువులూ, దుస్తులు కొంటుంటారు. ఇందువల్ల ప్రయోజనం ఉండదు. ఒకరికి నచ్చినివి మరొకరికి నచ్చాలని లేదుగా! అందుకని వారివారి ఇష్టాలకు అనుగుణంగా కొంటే గొడవపడరు.
- పిల్లలు మీతో ఏదైనా విషయం పంచుకోవాలనుకున్నప్పుడు ఇద్దరి వాదనలూ ఒకేసారి వినకూడదు. అలా చేస్తే ఎవరు కాస్త దూకుడుగా ఉంటారో, బలంగా ఉంటారో వారి మాటే నిలబడుతుంది. విడివిడిగా సమయం కేటాయించి వినాలి. ఎవరిది తప్పో అప్పుడు తెలుస్తుంది. అలా విన్న తర్వాతనే నిర్ణయం తీసుకోండి. దూకుడుగా ఉన్న పిల్లలకు ఇలా చేయడం తప్పు అని నెమ్మదిగా చెప్పండి. పెద్దవారు కూడా వాళ్లలాగే దూకుడుగా ఉంటే పిల్లలు కూడా అదే కరెక్టు అనుకొని దాన్నే పాటిస్తారు.
- చిన్నారుల మధ్య తగాదాలు వచ్చినప్పుడు మనం కలగజేసుకుని తప్పొప్పుల నిర్ధారణ చేసే బదులు... చిన్న తగాదాలయితే వాళ్లనే పరిష్కరించుకోమనాలి. ఇలా చేయడం వల్ల ఎదిగేకొద్దీ వారిలో సర్దుకుపోయేతత్వం అలవడుతుంది.

తేనెతో చర్మ ఆరోగ్యం

ముఖమంతా జిడ్డు... దానికితోడు మొటిమల సమస్య చాలామందిని ఇబ్బంది పెడుతుంది. ఇలాంటప్పుడు ఈ పూతలు ప్రయత్నించి చూడండి.

- గుప్పెడు తాజా పుదీనా ఆకులని మెత్తగా నూరి, రెండు చెంచాల తేనె కలపాలి. దీన్ని ముఖానికి పట్టించి ఆరిన తరవాత కడిగేసుకోవాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే మొటిమల సమస్య తగ్గడమే కాదు, జిడ్డు కూడా వదులుతుంది.
- కాసిన్ని గులాబీ నీటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి.. ముఖానికి రాసుకోవాలి. పది నిమిషాలయ్యాక చన్నీళ్లతో కడిగేసి ఆపై తేనెతో పూత వేసుకోవాలి. తర్వాత కడిగేస్తే సరిపోతుంది. నిమ్మరసం ముఖంలోని జిడ్డునీ, మొటిమల్ని తొలగిస్తే.. తేనె ముఖానికి కావాల్సిన తేమను అందిస్తుంది.
- ముందుగా కీరదోసని సన్నగా తురుముకుని దానిని మిక్సీలో వేసి రసాన్ని వడకట్టి పెట్టుకోవాలి. కీరదోస తేనె ముద్దని ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. ఆరిన తర్వాత అంతకుముందు తీసి పెట్టుకున్న రసాన్ని కొద్దికొద్దిగా చిలకరించడంకానీ దూదితో అద్దడం కానీ చేస్తే చక్కని ఫలితం ఉంటుంది. ఇలా వారానికి కనీసం రెండు సార్లు చేయాలి.
- గుడ్డులోని తెల్లసొనని, తేనెని బాగా గిలకొట్టి దానిని మొటిమలు ఉన్న చోట కాస్త దట్టంగా ప్యాక్‌లా వేసుకోవాలి. జిడ్డు చర్మం ఉన్నవారు తెల్లసొనకి నిమ్మరసం కూడా కలిపి వేసుకుంటే తక్షణ ఫలితం ఉంటుంది.



'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అనిపిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.

మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2, ఇ మెయిల్ jeevanapageps@gmail.com


ఫోన్ నెం. 9490099006

మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.

విజయానికి షార్ట్‌కట్స్ ఉండవు

జీవితం ఎలాంటి ఒత్తిడులు లేకుండా ప్రశాంతంగా సాగిపోయే ఉండాలనుకుంటారు కొందరు. అలాంటివారంతా రంగుల రాట్నాన్ని ఒక్కసారి పరిశీలనగా చూడాలి. ఎందుకంటే, అది ఒకే సర్కిల్‌లో తిరుగుతూ ఉంటుంది. అంతకుమించి ఒక్క ఇంచు కూడా ముందుకు కదలదు. కంఫర్ట్ జోన్‌లో ఉండాలనుకునేవారు కూడా అలాంటి సర్కిల్‌లోనే ఉండిపోతారు. నిజానికి, విజయం అందరికీ కావాలి. కానీ అది సాధించడం ఎలా? అన్నదే ముఖ్యం. సక్సెస్‌కి ఎప్పుడూ షార్ట్‌కట్స్ ఉండవు. కష్టపడాలి.

- నాకన్నీ తెలుసు అనుకోవడం పిచ్చితనం అవుతుంది. ఎప్పుడూ నిత్య విద్యార్థిలా ఉండాలి. కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఉత్సాహం చూపించాలి. తెలిసిన విషయమయితే మరింత లోతుగా అధ్యయనం చేయాలి. నేర్చుకోవడం ఎప్పుడైతే మానేస్తామో ఉన్నచోటే ఉండిపోతాం. విస్తరణ సక్సెస్‌లో భాగం. అందుకే కొత్త విషయాలు తెలుసుకోవడానికి నిత్యం సిద్ధంగా ఉండాలి.
- విజయం సాధించనవాళ్లంతా ఎవరినో అనుసరించలేదు. అందరికంటే భిన్నంగా తమకంటూ ఓ మార్గాన్ని నిర్మించుకున్నవాళ్లే. కాబట్టి ఆలోచనల్లోనూ అనుసరించడం మానేసి మనకంటూ ఓ మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలి. నావల్ల కాదు, నేను చేయలేను అనే ఆలోచనలు రానివ్వకూడదు. అలాంటి ఆలోచనలు ఉన్నవారిని మన చుట్టుపక్కల చేరనివ్వకూడదు.
- మనకు తెలిసిన విషయం అయినా నిర్ణయం తీసుకునే ముందు దాని గురించి ఇతరులతో చర్చించాలి. వ్యాపారంలో ఉన్నవారైతే ఇప్పటికే ఆ రంగంలో ఉన్నవారి సలహాలు, సూచనలు తీసుకోవడం మంచిది. సూచనలు తీసుకున్నంత మాత్రాన మనం తక్కువ అయిపోతాం అనుకోకూడదు. 'అడిగితే పోయేదేముంది.. అడిగేయండి బాస్' ఇది ఓ యాడ్. ఇదే సక్సెస్ మంత్రం కూడా.
- అబద్ధం ఎవరికైనా చెప్పి కొన్నాళ్లు మోసం చేయగలం. కానీ ఎక్కువ మందిని, ఎక్కువకాలం మోసం చేయలేం కదా! అంచేత అబద్ధాలతో మనల్ని మనం మోసం చేసుకోవద్దు. సమస్యలను అంగీకరించాలి. వాటినుంచి పారిపోవడానికి ప్రయత్నించకూడదు.



మీ కోసం

పెరుగులో పసుపు, నిమ్మరసం, బియ్యం పిండి కలిపి ఈ మిశ్రమాన్ని చేతులకి రాసుకుని ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకుంటే చేతులపై ఉన్న నలుపు తగ్గి చర్మం మృదువుగా మారుతుంది.



జీవన సౌరభం

పనిలో ప్రతిసారీ సంతోషం కలగకపోవచ్చు.
కానీ పని అన్నది లేకపోతే
అసలు సంతోషమనేదే ఉండదు.

దీపిక



కుర్రా శ్రీనివాసరావు,
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9701415678

రైల్వే బోర్డు నూతన ఛైర్మన్ ?

వర్తమాన అంశాలు (అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ) పోటీ పరీక్షల ప్రత్యేకం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా దీపక్ మిశ్రా

సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా **జస్టిస్ దీపక్ మిశ్రా** ఆగస్టు 28న పదవీ బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ దీపక్ మిశ్రాతో రాష్ట్రపతి **రామ్‌నాథ్ కోవింద్** ప్రమాణ స్వీకారం చేయించారు. ఈయన 2011 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. ప్రధాన న్యాయమూర్తి పదవిలో **2018 అక్టోబర్ 2 వరకూ** (18 నెలలు) కొనసాగను న్నారు. దీపక్ మిశ్రా **ఒడిశా** రాష్ట్రానికి చెందినవారు.


రూ.200 నోట్లు

రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకాశవంతమైన పసుపు రంగులో ఉండే రూ.200 నోట్లను ఆగస్టు 25 నుంచి మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ నోట్లపై భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే సాంచీస్థూపాన్ని ముద్రించారు.

ట్రిపుల్ తలాక్ చెల్లదు

ముస్లింలు అప్పటికప్పుడు **ట్రిపుల్ తలాక్** (తలాక్-ఎ-బిద్దత్) ద్వారా భార్యలకు విడాకులు ఇవ్వడం కుదరదని ఇటీవల సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం **3:2** మెజారిటీతో తీర్పునిచ్చింది. ట్రిపుల్ తలాక్ చెల్లదని జస్టిస్ **కురియన్ జోసెఫ్,** జస్టిస్ **ఆర్.ఎఫ్.నారీమన్,** జస్టిస్ **లలిత్** పేర్కొన్నారు. అంతకు ముందు ట్రిపుల్ తలాక్‌కు అనుకూలంగా జస్టిస్ **జె.ఎస్.ఖేహార్,** జస్టిస్ **ఎస్.అబ్దుల్ నజీర్** తమ తీర్పును వెలువరించారు.

గోప్యత ప్రాథమిక హక్కే



వ్యక్తిగత **గోప్యత** (ప్రైవసీ) ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు **ఆగస్టు 24న** తేల్చి చెప్పింది. రాజ్యాంగం ప్రసాధించిన ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత గోప్యత కూడా విడదీయలేని భాగమేనని, రాజ్యాంగంలోని **మూడో భాగంలోని, 21వ నిబంధనలో** పేర్కొన్నారు. **జీవించే హక్కు** వ్యక్తిగత స్వేచ్ఛల్లో గోప్యత కూడా అంతర్భాగమని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనానికి అప్పటి ప్రధాన న్యాయమూర్తి **జస్టిస్ జె.ఎస్ ఖేహార్** నేతృత్వం వహించారు. ఆధార్‌పై ప్రత్యేక భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచన చేశారు.

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సింధూకు రజత పతకం

స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలో భారత క్రీడాకారిణులు రజిత పతకం, కాంస్య పతకం సాధించారు. సైనా నెహ్వాల్ కాంస్యపతకం సాధించగా, **పి.వి.సింధు** రజత పతకం సాధించారు. నాల్గోసీడ్ పి.వి.సింధు జపాన్‌కు చెందిన ఏడో సీడ్ **నాజోమిఒకుహారా** చేతిలో ఫైనల్స్‌లో పరాజయం పాలయ్యారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో గతంలో (2013,14) రెండు కాంస్య పతకాలు సాధించారు. భారత్ తరపున ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అత్యధికంగా **మూడు పతకాలు** సాధించిన క్రీడాకారిణి పి.వి సింధు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఏకకాలంలో భారత్‌కు **రజతం, కాంస్యం** లభించడం ఇదే తొలిసారి. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలలో ఇప్పటివరకూ భారత దేశానికి **ఏడు పతకాలు** లభించాయి. 1983లో **ప్రకాశ్ పదుకొనే** కాంస్యం, 2011లో **గుత్తాజ్వాల-అశ్విని పొన్నప్ప** జంట కాంస్యం దక్కించుకోగా 2015లో సైనా నెహ్వాల్ **రజిత** పతకం సాధించారు.

14వ రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్

భారతదేశ 14వ రాష్ట్రపతిగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన **రామ్‌నాథ్ కోవింద్** ఎన్నికయ్యారు. **2017 జులై 25న** పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎలక్టోరల్ కాలేజీలోని మొత్తం ఓట్లలో **65.65 శాతం** ఓట్లు పొందారు. ప్రతిపక్షాల అభ్యర్థిగా లోక్‌సభ మాజీ స్పీకర్ **మీరాకుమార్** పోటీచేయగా ఆమెకు **34.35 శాతం** ఓట్లు లభించాయి.

భారతదేశంలోని రాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తం ఓట్ల విలువ **10,98,882. నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదిలీ** పద్ధతిలో రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. అనగా సగం + 1 ఓటు **(50%+1)** రావాల్సి ఉంటుంది. 2017లో జరిగిన రాష్ట్రపతి ఎన్నిక **15వది** కాగా, రామ్‌నాథ్ కోవింద్ **14వ వ్యక్తి.** బాబూ రాజేంద్రప్రసాద్ రెండు పర్యాయాలు (1952, 1957) రాష్ట్రపతి పదవిని చేపట్టారు.

✧ రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి పదవికి పోటీచేయడానికి ముందు ఏ రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్నారు - **బీహార్**

✧ రాష్ట్రపతి ఎన్నికలలో ఓట్ల విలువ ఏ జనాభా లెక్కల ప్రకారం ఉంది - **1971**

✧ దేశంలో మొత్తం ఎన్నికైన ఎమ్మెల్యేల సంఖ్య - **4120 (ఢిల్లీ, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలతో సహా)**

✧ రాష్ట్రపతి ఎన్నికలలో పాల్గొనే ఎంపిల సంఖ్య - **776 (ఎన్నికైన సభ్యులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది.)**

✧ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్యే ఓటు విలువ - **208 (అత్యధికం)**

✧ సిక్కిం రాష్ట్ర ఎమ్మెల్యే ఓటు విలువ - **7 (అత్యల్పం)**

✧ ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే ఓటు విలువ - **159**

✧ మధ్యప్రదేశ్ ఓటు విలువ - **708**

✧ ఈ ఎన్నికలలో మొత్తం 4896 ఓట్లు (ఎమ్మెల్యే + ఎంపి)లో రామ్‌నాథ్ కోవింద్‌కు 2930 ఓట్లు వచ్చాయి. వీటి మొత్తం విలువ - **7,02,044 (65.65%)**

✧ ఇప్పటివరకూ ఎన్నికైన రాష్ట్రపతుల్లో అత్యధికంగా ఓట్లు పొందిన వ్యక్తి - **కె.ఆర్.నారాయణన్ (1997 -9,56,290 ఓట్లు)**

✧ ఈ రాష్ట్రపతి ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన లోక్‌సభ సెక్రటరీ జనరల్ - **అనూప్ మిశ్రా**

ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు

భారతదేశ **15వ** ఉపరాష్ట్రపతిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన **ముప్పవరపు వెంకయ్యనాయుడు** 2017 ఆగస్టు 5వ తేదీన ఎన్నికయ్యారు. ప్రతిపక్షపార్టీల అభ్యర్థిగా **గోపాలకృష్ణ గాంధీ** పోటీచేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో పార్లమెంట్ ఉభయసభల మొత్తం సభ్యులకు (ఎన్నికైన + నామినేటెడ్) ఓటు హక్కు ఉంటుంది. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వ్యక్తి రాజ్యసభకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతూ అదే సభకు ఛైర్మన్ అయిన మొదటి వ్యక్తి వెంకయ్యనాయుడు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా **షంషేర్ కె షరీఫ్** వ్యవహరించారు. ఇప్పటి వరకూ వెంకయ్యనాయుడు కాకుండా మొత్తం **12 మంది** ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక కాగా, వీరిలో **ఆరుగురు** రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 1952, 1957లో సర్వేపల్లి రాధాకృష్ణన్, 1979లో జస్టిస్ మహ్మద్ హిదయతుల్లా, 1987లో శంకర్ దయాళ్‌శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వ్యక్తులలో వెంకయ్యనాయుడు **13వ వ్యక్తి.** ★

బిట్‌బ్యాంక్

✧ ఇటీవల భారత్, చైనాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన ప్రాంతం - **డోక్లాం**

✧ ఇటీవల భారతదేశంలో పర్యటించిన నేపాల్ ప్రధాన మంత్రి - **షేర్‌బహదూర్ దేవ్‌బా**

✧ రైల్వే బోర్డు నూతన ఛైర్మన్‌గా నియమితులైనవారు - **అశ్విని లోహని**

✧ ఇన్ఫోసిస్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమించిన వారు - **నందన్ నీలేకని**

✧ రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న (2017) అవార్డు గ్రహీతలు - **దేవేంద్ర (పారాఅథ్లెట్), సర్దార్‌సింగ్ (హాకీ)**

✧ 2016-17లో దేశంలో మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తి - **275.68 మిలియన్ టన్నులు**

✧ 2016-17లో వరి ధాన్యం ఉత్పత్తి - **110.15 మిలియన్ టన్నులు**

✧ 2016-17లో గోధుమ ఉత్పత్తి - **98.38 మిలియన్ టన్నులు**

✧ 60 సంవత్సరాలు లేదా అంతకుపైబడిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించడానికి 2017 జులైలో ప్రారంభించిన పెన్షన్ పథకం - **ప్రధానమంత్రి వయోవందన్ యోజన**

✧ పై పథకాన్ని నిర్వహించేది - **ఎల్ఐసి**

✧ రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం 2017 మార్చి 10 నాటికి దేశంలో చలామణిలో ఉన్న కరెన్సీ - **రూ.12.45 ట్రిలియన్లు**

✧ ప్రపంచంలో అత్యంత నివాసయోగ్య నగరంగా ఎంపికైన నగరం - **మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)**

✧ పై ఎంపిక కోసం మొత్తం ఎన్ని నగరాల్లోని స్థిరత్వం, ఆరోగ్యసేవలు, సంస్కృతి, పర్యావరణం, విద్య, మౌలిక వసతులు తదితర 30 అంశాల ఆధారంగా సర్వే చేశారు - **140 నగరాలు**

✧ బ్రిటన్‌లోని టివి చానల్ 4 నిర్వహించిన చైల్డ్ జీనియస్ క్విజ్ పోటీల్లో భారత సంతతికి చెందిన ఏ బాలుడు విజేతగా నిలిచాడు - **రాహుల్ దోశి**

✧ రాహుల్ దోశి ఐక్యూ (ఇంటలిజెంట్ కోషెయింట్) ఎంతగా ఉంది - **162 (ఇది అల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ ఐక్యూలకన్నా ఎక్కువ)**



✧ 99 సంవత్సరాల తర్వాత ఇటీవల ఎప్పుడు అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడింది - **ఆగస్టు 21**

✧ తెలంగాణాలో మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 24 గంటల హెల్ప్‌లైన్ నంబర్ - **181**

✧ ఇటీవల అమెరికా అంతరిక్ష కేంద్రం నాసా మొట్టమొదటి సూపర్ కంప్యూటర్ (స్పేస్ బర్నో కంప్యూటర్)ను ఎక్కడ నుంచి అంతరిక్ష కేంద్రంలోనికి పంపింది - **ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్**

✧ అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు -2017 పొందిన వారు - **కె.చంద్రశేఖర్‌రావు (తెలంగాణ ముఖ్యమంత్రి)**

✧ నాసా చేపట్టనున్న అతరిక్ష యాత్రలకు ఎంపికైన భారత సంతతి వ్యోమగామి - **రాజాచారి**

✧ ఈశాన్య రాష్ట్రాలతో పాటు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ము కాశ్మీర్‌లకు ప్రత్యేక హోదా కింద లభించే పన్ను రాయితీలను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్ని సంవత్సరాలపాటు పొడిగించింది - **పది సంవత్సరాలు (2017 జులై 1 నుంచి 2027 మార్చి 31 వరకూ)**

✧ నూతనంగా అమలులోకి రానున్న ఏ నోటుపై హంపీ రథాన్ని ముద్రించారు - **రూ.50**


✧ 2017 ఆగస్టు 1న పాకిస్తాన్ నూతన ప్రధానమంత్రిగా నవాజ్‌షరీఫ్ స్థానంలో బాధ్యతలు చేపట్టినవారు - **షాహిద్ కఖాన్ అబ్బాసీ**

✧ నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్‌గా అరవింద్ పనగారియా స్థానంలో నూతనంగా నియమించిన వ్యక్తి - **రాజీవ్‌కుమార్**

సెన్సెక్స్ ▲ 258 — 31,646
నిఫ్టీ ▲ 88 — 9,884
రూపాయి ▲ 08 పైసలు — ఒక అమెరికా డాలరుకు రూ. 63.94

చౌకగా వాటాల విక్రయం

- పిఎస్‌యుల్లో డిజిన్వెస్ట్‌మెంట్ వేగవంతం
- కొనుగోళ్లకు మార్కెట్ శక్తుల ఆసక్తి
- 5 నెలల్లో రూ.9,300 కోట్ల వాటాల ఉపసంహరణ
- ఎన్‌టిపిసి ఇష్యూకు భారీ స్పందన



హైదరాబాద్ : దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల్లోని వాటాలను ప్రయివేటు శక్తులకు విక్రయించే ప్రక్రియను మోడీ సర్కార్ వేగవంతం చేసింది. అందులోనూ అత్యంత చౌకగా ఈ వాటాలను పెద్దోల్లకు చెందేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటున్నాయి. వివిధ పిఎస్‌యుల్లో తనకున్న వాటాను చౌక ధరల్లో సర్కారు ఫలహారంలా అమ్మేస్తుండటంతో వీటిని కొనుగోలు చేసేందుకు గాను బడా బాబులు పోటీ పడుతున్నారు. తాజాగా మంగళవారం ప్రారంభమైన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసిలో) ఆఫర్ ఫర్ సేల్‌లోనూ (ఒఎఫ్ఎస్) ఈ విషయం మరోమారు రుజువైంది.

సర్కారు జోరు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ వాటాల విక్రయం ద్వారా దాదాపు రూ.73,000 కోట్ల మేర నిధులను సమీకరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. గడిచిన అయిదు నెలల కాలంలో వివిధ సంస్థల్లో ప్రభుత్వానికి ఉన్న వాటాను విక్రయించడం ద్వారా దాదాపు రూ.9,300 కోట్ల మేర నిధులన సమీకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైనార్టీ వాటా విక్రయం ద్వారా రూ.46,500 కోట్లు, వ్యూహాత్మక వాటా విక్రయం ద్వారా రూ.15,000 కోట్లు, స్టాక్ ఎక్ఛ్సేంజీల్లో నమోదైన పిఎస్‌యులు, బీమా కంపెనీల్లో వాటాల విక్రయం ద్వారా రూ.11,000 కోట్లను సమీకరించాలని సర్కారు నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. సర్కారు నిర్ణయం సంపన్నులకు బాగా కలిసి వస్తోంది. తక్కువ ధర వద్ద మేటి కంపెనీల స్టాక్స్ లభిస్తుండడంతో వారుపోటీ పడి కొనుగోలు చేస్తున్నారు.


ఎన్‌టిపిసికి భలే డిమాండ్..

ఎన్‌టిపిసి వాటా విక్రయానికి గాను సర్కారు తీసుకువచ్చిన ఆఫర్ ఫర్ సేల్‌కు తొలిరోజైన మంగళవారం బంపర్ స్పందన లభించింది. కాగా బుధవారం ఆశించిన స్థాయిలో డిమాండ్ అందుకోలేదు. తొలిరోజు ఆఫర్‌ను కేవలం నాన్-రిటైల్ ఇన్వెస్టర్లకే (బడాబాబులులకే) వర్తింపజేశారు. దీంతో ఈ విభాగానికి కేటాయించిన 32.98 కోట్ల షేర్లకు గాను 38.66 కోట్ల బిడ్లు లభించాయి. ఇది దాదాపు 1.17 శాతం అధికం కావడం విశేషం. రెండు రోజుల పాటు నిర్వహించిన ఒఎఫ్ఎస్‌లో 824 మిలియన్ షేర్లకు గాను 548 మిలియన్ బిడ్స్ నమోదయ్యాయి. రెండో రోజు బుధవారం రిటైల్ ఫోర్షన్‌లో కేవలం 73 శాతం మాత్రమే సబ్‌స్క్రైబ్ అయ్యాయి. బిఎస్ఇలో ఈ షేర్ రూ.168 వద్ద ముగిసింది. ఇదే స్థాయిలో ఒఎఫ్ఎస్ ఫ్లోర్ ధర ఉంది. మొత్తంగా రూ.9,000 కోట్ల విలువ చేసే వాటాలను విక్రయించింది. ఎన్‌టిపిసి ఆఫర్‌కు అనూహ్య స్పందన లభిస్తే విక్రయాన్ని 10 శాతం వరకు విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకు సర్కారు ఇప్పటికే పచ్చజెండా ఊపింది.

విప్రో బైబ్యాక్‌కు పచ్చజెండా

99.68 శాతం వాటాదారుల సై!

న్యూఢిల్లీ: దేశంలో మూడో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ విప్రో బైబ్యాక్ ఆఫర్‌కు మార్గం సుగమమైంది. సంస్థ ప్రతిపాదించిన రూ.11,000 కోట్ల మేర షేర్ల బైబ్యాక్ ఆఫర్‌కు కంపెనీ వాటాదారులు సమ్మతి తెలిపారు. ఈ విషయాన్ని విప్రో ఒక ప్రకటనలో స్టాక్ ఎక్ఛ్సేంజీలకు తెలిపింది. ప్రతిపాదిత బైబ్యాక్ ఆఫర్‌కు సంస్థ సెప్టెంబరు 15ను రికార్డు తేదీగా నిర్ణయించింది. షేరు ఒక్కింటికి రూ.320 చొప్పున దాదాపు 34.375 కోట్ల వాటాలను తాము తిరిగి కొనుగోలు చేయనున్నట్టుగా విప్రో ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. బైబ్యాక్‌నకు సంబంధించిన ప్రతిపాదనకు గాను పోస్టల్ బ్యాలెట్, ఈ-ఓటింగ్ ద్వారా వాటాదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేసినట్టుగా విప్రో తెలిపింది.కంపెనీ ప్రతిపాదనకు నిర్వహించిన ఓటింగ్ ప్రక్రియ ఈ నెల 28తో ముగిసిందని.. ఇందులో దాదాపు 99.68 శాతం మంది వాటాదారులు బైబ్యాక్ ఆఫర్‌కు సమ్మతి తెలపినట్టుగా వివరించారు. బైబ్యాక్ నేపథ్యంలో విప్రో షేర్లు బుధవారం స్వల్పంగా పెరిగి రూ.291.65 వద్ద ముగిశాయి. విప్రో తలపెట్టిన వాటాల బైబ్యాక్ వల్ల షేరు ఒక్కింటిపై ఆర్జన పెరగడంతో పాటు సంస్థ వద్ద నిబంధనల కంటే అధికంగా ఉన్న నగదు వాటాదారులకు పంచేందుకు వీలు పడనుంది. జూన్ 30 నాటికి విప్రో పుస్తకాలలో రూ.5,432 కోట్ల నగదు లేదా నగదు సమానమైన సొత్తు, రూ.37,204 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి.



ఎఐపై బర్డ్ గ్రూపు కన్ను

- ట్రాన్స్‌పోర్ట్ విభాగం కొనుగోలుకు ఆసక్తి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఎయిరిండియా కొనుగోలుకు పలు సంస్థలు ముందుకు వచ్చినట్టుగా పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్.ఎన్.చౌబే తెలిపారు. బుధవారం ఇక్కడ ఏర్పాటుచేసిన అసోచామ్ ఏవియేషన్ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎయిరిండియా గ్రౌండ్ హాండ్లింగ్ అనుబంధ సంస్థ 'ఎయిరిండియా ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్' (ఎఐటిఎస్ఎల్) కొనుగోలుకు బర్డ్ గ్రూపు ఆసక్తి కనబరిచినట్టుగా ఆయన తెలిపారు. బర్డ్ గ్రూపు ఇప్పటికే దేశంలో పలు హోటల్స్ నిర్వహణతో పాటు విమానయాన రంగంలోనూ వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. మరోవైపు ఎఐటిఎస్ఎల్ కొనుగోలుకు ఆసక్తి కనబరిచిన అంశాన్ని బర్డ్ గ్రూపు ధ్రువీకరించింది. ఇప్పటికే తాము ఈ రంగంలో ఉన్నందున ఎయిరిండియా గ్రౌండ్ హ్యాండ్లింగ్ విభాగంపై ఆసక్తి కనబరుస్తున్నట్టుగా బర్డ్ గ్రూపు అధికార ప్రతినిధి తెలిపారు. బర్డ్ గ్రూపు సంస్థ దేశంలోని ఏడు విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. సంస్థ సాధారణ వృద్ధి ప్రణాళికలో భాగంగానే ఎయిరిండియా వైపు చూస్తున్నట్టుగా సమాచారం.

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌పై ఇండిగో ఆసక్తి..

ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న ఇండిగో విమానయాన సంస్థ ఎయిరిండియా చౌక ధరల విమానయాన విభాగం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కొనుగోలుపై ఆసక్తి కనబరుస్తోంది.

చెరువులోకి 'వేధా' వ్యర్థజలాలు

- ఆందోళనకు దిగిన నడిపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి- పూసపాటిరేగ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని వేధా బయోఫ్యూయల్ పరిశ్రమ తన వ్యర్థ జలాలను నడిపల్లి గ్రామంలోని చెరువులోకి విడిచి పెడుతుండటాన్ని నిరసిస్తూ ఈ గ్రామస్తులు పరిశ్రమ వద్ద బుధవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

వ్యర్థ జలాలను గ్రామంలోని చెరువులోకి విడుదల చేస్తుండటంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సర్పంచ్ బొజ్జల ఈశ్వరమ్మ, గ్రామస్థులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి పరిశీలనకు వచ్చి పరిశ్రమ యాజమాన్యానికి నోటీసు ఇచ్చారు. అయినా పరిశ్రమ తీరులో మార్పు రాలేదు. గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో వర్షం నీటితోపాటు వ్యర్థ జలాలను చెరువులోకి మళ్లీ విడిచి పెడుతోంది. దీంతో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పరిశ్రమ వద్దకు చేరుకొని ధర్నా చేశారు. యాజమాన్య ప్రతినిధులు స్పందించకపోవడంతో పరిశ్రమ గేట్లు తోసుకొని లోపలకు వెళ్లారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులకూ, గ్రామస్తులకూ మధ్య స్వల్ప తగాదా చోటు చేసుకుంది.



విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగలోని పరిశ్రమ వద్ద ధర్నా చేస్తున్న నడిపల్లి గ్రామస్తులు

పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు రావడం లేదని యాజమాన్య ప్రతినిధులు బుకాయించే ప్రయత్నం చేశారు. దీంతో గ్రామస్థులు పరిశ్రమలోకి వెళ్లి వ్యర్థ జలాలు బయటకు వస్తున్న ప్రాంతాన్ని చూపించారు. ఈ విషయం ఇంతవరకూ తమ దృష్టికి రాలేదని, దీన్ని నివారిస్తామని యాజమాన్య ప్రతినిధులు బదులిచ్చారు. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీకు తెలియకుండా వ్యర్థ జలాలు బయటకు వచ్చేస్తున్నాయా'? అంటూ నిలదీశారు. పరిశ్రమపై గ్రామస్తులు దాడికి దిగారంటూ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భోగాపురం సిఐ నర్సింహారావు, ఎస్ఐలు కళాధర్, తారకేశ్వరరావుతోపాటు పలువురు పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. వాస్తవ పరిస్థితిని చూసిన పోలీసులు వెనక్కి తగ్గారు. పరిశ్రమల వ్యర్థ జలాలను చెరువుల్లోకి, పంట పొలాల్లోకి విడిచిపెట్టడం నేరమని యాజమాన్యం దృష్టికి సిఐ తీసుకెళ్లారు. మీరు దీన్ని నివారించకపోతే శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. గతంలో కూడా ఈ సమస్యపై గ్రామస్తులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని యాజమాన్య ప్రతినిధులను ప్రశ్నించారు. సమస్యను 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని సిఐ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి ఆందోళన విరమించారు.

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై గుంటూరు జిల్లాలో సభలు



గుంటూరు జిల్లా నకరికల్లు మండలం చేజర్లలో జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య

ప్రజాశక్తి - నరసరావుపేట(గుంటూరు)

ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు విమర్శించారు. సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ప్రచారంలో భాగంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బుధవారం పలు చోట్ల సభలను నిర్వహించారు. నరసరావుపేట ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సదస్సుకు పి.రామారావు అధ్యక్షత వహించారు. సభలో పాశం మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ఇస్తామని చెప్పినా అమలు చేయలేదని, దీంతో రైతులు మరింత సంక్షోభంలోకి కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు మాత్రం పెద్దఎత్తున రాయితీలిస్తున్నారని విమర్శించారు. మతోన్మాద దాడులు పెరిగాయని, కేరళలో 38 మంది సిపిఎం కార్యకర్తలను మతోన్మాదులు హత్య చేశారని తెలిపారు. బిజెపి వల్లే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందలేదన్నారు. జిఎస్‌టి వల్ల పరిశ్రమలు మూతబడుతున్నాయని చెప్పారు. అనంతరం నకరికల్లు మండలం చేజర్లలో పుచ్చలపల్లి సుందరయ్య భవన్ (ప్రజా సంఘాల కార్యాలయం)ను రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్యతో కలిసి రామారావు ప్రారంభించారు. చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి పోపూరి సుబ్బారావు, చుండూరు మండలం చినగాదెలవర్రు, చినపరిమి సభల్లో తెనాలి డివిజన్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి మాట్లాడారు.

ప్రయివేటుకు భూ రిజిస్ట్రేషన్లు

- కన్సల్టేషన్ వర్క్‌షాప్‌లో రైతుల ఆవేదన
- లంచాలు అడుగుతున్నారని సిఆర్‌డిఎ అధికారులపై ఆగ్రహం



రైతులు ప్రస్తావించిన అంశాలను నోట్ చేసుకుంటున్న పరిశీలకులు

ప్రజాశక్తి-తుళ్లూరు(గుంటూరు)

రాజధాని పేరుతో తీసుకున్న భూముల్ని రైతులు రిజిస్ట్రేషన్లు చేయకుండానే ప్రయివేటు సంస్థలకు ప్రభుత్వం కట్టబెడుతోందని రాజధాని రైతులు మండిపడ్డారు. రాజధాని ప్రాజెక్టుల నిర్మాణంపై పర్యావరణ, సామాజిక ప్రభావ అంచనా తదితర అంశాలపై రైతుల అభిప్రాయ సేకరణ కోసం సిఆర్‌డిఎ అధికారులు కన్సల్టేషన్ వర్కుషాపు రెండ్రోజులుగా రాజధాని ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. బుధవారం తుళ్లూరు మండలం వెంకటపాలెంలో నిర్వహించారు. సమావేశంలో మల్కాపురం రైతు గద్దె చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. రైతుల భూములను సిఆర్‌డిఎకు కాకుండా తక్కువ ధరకు ప్రయివేటు సంస్థలకు ప్రభుత్వం ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆయా సంస్థలు స్థానికులకు మాత్రం ఉపాధి కల్పించడం లేదన్నారు. వెంకటపాలెం రైతు బెల్లంకొండ నరసింహారావు మాట్లాడుతూ.. భూములిచ్చిన రైతు కుటుంబాల్లో ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా? అని ప్రశ్నించారు. భూమి రకం గుర్తింపులో వివాదాలనూ ప్రస్తావించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎం.రవి మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతంలోని పేద కుటుంబాలకు రూ.2,500 పింఛను సరిపోవడం లేదని, నిపుణుల కమిటీ సూచించిన విధంగా రూ.9 వేలు ఇవ్వాలని కోరారు. మూడో విడత కౌలు ఇంకా కొందరు రైతులకు అందలేదన్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సిఆర్‌డిఎ కార్యాలయంలో లంచాలు అడుగుతున్నారని ఎర్రబాలేనికి చెందిన వెంకట కోటిరెడ్డి ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామని సిఆర్‌డిఎ ల్యాండ్ డైరెక్టర్ చెన్నకేశవులు చెప్పారు. సామాజిక ప్రభావ అంచనా ప్రక్రియే సరిగా లేదని పెనుమాకకు చెందిన నవీన్‌రెడ్డి చెప్పారు. భూసేకరణపై అభ్యంతరాలు స్వీకరించాలనే కోర్టు ఉత్తర్వులతో సమావేశాలకు వస్తున్నవారిపై కేసులు పెడుతున్నారన్నారు. రైతులు ప్రస్తావించిన అంశాలను ప్రపంచబ్యాంకు బృంద సభ్యులు నమోదు చేసుకున్నారు.

మిర్చి రైతుల ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం(ప్రకాశం)

మిర్చి రైతులకు నష్టపరిహారం విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ కరువు, ధరల్లేమి వల్ల నష్టాలపాలైన మిర్చి రైతులను ఆదుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతు ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 2016-17లో మిర్చి పంట సాగు చేసిన వివరాలు నమోదు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పశ్చిమ ప్రాంతంలో 95 వేల ఎకరాల్లో ఈ పంట సాగు చేయగా అందులో 50వేల ఎకరాలు పూర్తిగా ఎండిపోయిందన్నారు. కేంద్ర కరువు బృందం పర్యటించిన రెండు విడతలు మిర్చి రైతుల నష్టాలను వివరించి అర్జీలు అందజేసినట్లు తెలిపారు. నష్టపోయిన మిర్చి రైతుల విషయమై చర్చించేందుకు ఉద్యాన శాఖ జిల్లా అధికారితో పాటు మార్కాపురం ఆర్‌డిఒ కె.పెంచల కిశోర్ రైతు నాయకులను చర్చిద్దామని, బుధవారం మార్కాపురం ఆర్‌డిఒ కార్యాలయానికి రావాలని చెప్పగా.. తామంతా వస్తే.. అధికారులు పత్తా లేకుండా పోవడమేమిటని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తూ వినతిపత్రాన్ని ఆర్‌డిఒ కార్యాలయంలో ఉన్నతాధికారులు లేకపోవడంతో సిబ్బందికి అందించారు. ఈ ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి, రైతు నాయకులు కందుల కాశిరెడ్డి, యేర్వ పాపిరెడ్డి, ముక్కమల్ల ఆదినారాయణరెడ్డి, గాలి చిన్నవీరారెడ్డి, పలువురు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో హిందూ, ముస్లిం మత పెద్దలతో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎస్‌పి గోపినాథ్ శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా నగరంలోని జమ్మిచెట్టు నుంచి పాతబస్టాండ్ వరకు ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్‌పి మాట్లాడారు. సెప్టెంబర్ 2న జరిగే బక్రీద్, వినాయక నిమ్మజ్జన విగ్రహాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. మతసామరస్యాలకు చిహ్నంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డిఒ హుసేన్‌సాహెబ్, మున్సిపల్ కమిషనర్ హరినాథ్‌రెడ్డి, శాంతి సమితి సభ్యులు హిందూ, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. 92,983 కోట్లు
2. గౌరవ్ బిదూరి
3. చైనా
4. సిక్కిం
5. వెన్నం జ్యోతి సురేఖ

జిఒ 279ను రద్దు చేయాలి

- సెప్టెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మె
- శంఖారావ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు



విశాఖ బహిరంగసభలో మాట్లాడుతున్న నర్సింగరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : వర్క్ టెండర్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 40 వేల మంది పారిశుధ్య కార్మికులను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని, అందుకే జిఒ 279ను తెచ్చిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు విమర్శించారు. జిఒ 279ను రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 15 నుంచి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ల జెఎసి ఆధ్వర్యాన అన్ని మున్సిపాలిటీల్లో సమ్మెకు దిగుతున్నట్లు చెప్పారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ వర్కర్ల సమ్మె 'శంఖారావసభ'లో ఆయన ప్రసంగించారు. 279 జిఒ రద్దు చేయాలని ఏడాదిన్నర కాలంగా మున్సిపల్ వర్కర్లు ఆందోళన సాగిస్తున్నా ప్రభుత్వంలో చలనం కనిపించలేదన్నారు. యనమల చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఏ విషయమూ తేల్చకుండా నాన్చుతూ వస్తుందన్నారు. గత్యంతరం లేక 15 నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మెకు వెళుతున్నామని తెలిపారు. ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 279 జిఒను రద్దు చేయాలని రాష్ట్రంలోని 110 మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు అనేక పోరాటాలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

పెన్షనర్ల డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటం

- సమస్యలు పరిష్కరించాలని ధర్నా
- పాల్గొన్న ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)/కడపఅర్బన్

పెన్షనర్ల డిమాండ్ల సాధనకు ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బివిఎస్.రాజు అన్నారు. బుధవారం పిఎఫ్ కార్యాలయం ఎదుట అందరికీ హయ్యర్ పెన్షన్ ఇవ్వాలనీ, ఇపిఎస్ పెన్షనర్లందరికీ నెలకు రూ.6,500 కనీస పెన్షన్ డిఎతో కలిపి ఇవ్వాలనీ, 2008కి ముందు అమ్మిన పెన్షన్ మొత్తం నిర్ణీత కాలవ్యవధిలో తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలకు అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ కార్యదర్శి సి.ఎల్లారెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ సమయంలో ఉన్న జీతాన్ని పరిగణనలోకి తీసుకొని పింఛను ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసి హయ్యర్ పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎఐఐఇఎ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ్‌రెడ్డి, డిసిసి బ్యాంకు నాయకులు పి.వీరన్న, ఎల్ఐసి పెన్షనర్లు సంఘ కార్యదర్శ కె.శంకరరావు, ఆర్‌టిసి నాయకులు సుబ్బారెడ్డి, ఎల్ఐసి నాయకులు అవధానం, రాజు సంఘీభావం తెలియ జేశారు. ధర్నా అనంతరం పిఎఫ్ రీజినల్ కమిషనర్ ఎల్లారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఆయన తన పరిధిలోని వాటిని పరిష్కరిస్తానని పేర్కొ న్నారు. వినతిపత్రాన్ని కేంద్ర కార్మిక శాఖ మంత్రికి పంపుతానని పేర్కొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

రాష్ట్రం లోని పెన్షనర్ల సమస్యలపై వచ్చే శాసన మండలి సమావేశాల్లో చర్చించటంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం తరపున కోరతామని శాసన మండలి సభ్యులు బొడ్డు నాగేశ్వర రావు హామీ ఇచ్చారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్‌పిఎ) కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద బుధవారం జరిగిన ధర్నాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇపిఎఫ్-95 పెన్షనర్లను దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతూ వృద్ధులు కూడా పోరాడకుండా హక్కులు సాధించుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్స్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.

టపాసుల కోసం కలకత్తాకు..

- గుంటూరు పిల్లలు కలకత్తాలో గుర్తింపు



పిల్లల్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - గుంటూరు అర్బన్

వినాయకుడి విగ్రహాలను చూసొస్తామని వెళ్లిన ఇద్దరు పిల్లల్ని గుంటూరు అర్బన్ పోలీసులు కలకత్తాలో గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ పరిధిలోని దాసరిపాలేనికి చెందిన వాలిపల్లి సుజాత కుమారుడు విజయకుమార్, చౌడవరం ప్రాంతానికి చెందిన రాంబహదూర్ కుమారుడు బిస్వజిత్ వినాయకుని విగ్రహాలు చూసి వస్తామని ఈనెల 25న ఇంటి నుండి వెళ్లారు. అనంతరం వారి వద్ద ఉన్న రూ.1500తో దీపావళి టపాసులు కొనుగోలు చేసేందుకు కలకత్తాలోని తమ స్నేహితుడు గౌతమ్ వద్దకు వెళ్లారు. ఈ విషయం తెలియని విజయకుమార్ తల్లి సుజాత నల్లపాడు రూరల్ పోలీసుస్టేషన్‌లో 26వ తేదీన ఫిర్యాదు చేసింది. డిఎస్‌పి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన బృందం పిల్లల వద్ద ఉన్న సెల్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా కలకత్తాలో ఉన్నట్లు గుర్తించారు. గుంటూరులోని గౌతం తల్లిదండ్రులతో కలిసి గౌతం ఉంటున్న ప్రాంతాన్ని తెలుసుకున్నారు. కలకత్తా భవానీపూర్‌లోని జగ్గుబజార్‌లో ఉంటున్న గౌతం వద్దకు 28వ తేదీ రాత్రి వెళ్లి అక్కడున్న పిల్లల్ని గుంటూరుకు తీసుకొచ్చారు. కేసులో ప్రతిభ చూసిన సిబ్బందిని అర్బన్ ఎస్‌పి సిహెచ్ విజయరావు అభినందించారు.

16న తిరువనంతపురంలో రోడ్డు రవాణా ఉద్యోగుల జాతీయ సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సెప్టెంబర్ 16న తిరువనంతపురంలో రోడ్డు రవాణా ఉద్యోగుల జాతీయ సభను నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్ లక్ష్మయ్య, ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ భాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రవాణా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

డిజిపి నండూరు సాంబశివరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని డిజిపి నండూరు సాంబశివరావు కోరారు. బుధవారం రాత్రి గుంటూరులో పోలీసుల పిల్లలకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా వల్ల తలెత్తే దుష్పరిణామాలను గమనించకపోతే ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సోషల్ మీడియా ద్వారా కేవలం విద్యాభ్యాసానికి సంబంధించిన సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే తెలుసుకోవాలని కోరారు. విద్యార్థులకు అందించే పురస్కారాలను కేవలం నగదు రూపంలో కాకుండా మంచి రచనలతో కూడిన పుస్తకాలను కూడా ఇవ్వాలని కోరారు.

వాహన చట్ట సవరణపై సర్కారు స్పందనేది?

ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోటారు వాహన చట్ట సవరణ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ భాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వినియోగదారులు, అన్ని ఆర్టీసిలు, రవాణా ఉద్యోగ, అధికారుల సంఘాలతో ఈ బిల్లుపై చర్చించేందుకు పార్లమెంట్ సెలక్ట్ కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఎపిఎస్ ఆర్టీసిలోని అన్ని సంఘాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్ట సవరణబిల్లుపై అభ్యంతరాల్ని తెలియజేయాలని వారు కోరారు.

మధ్యాహ్న భోజనాన్ని ప్రయివేటీకరిస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తాం

80 వేల మంది మహిళలకు అన్యాయం చేయొద్దు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె స్వరూపరాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు దయా రామాదేవి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 15 ఏళ్ల నుంచి పథకాన్ని నిర్వహిస్తున్న డ్వాక్రా సభ్యుల్ని తొలగించి సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో ఇస్కాన్, అక్షయపాత్ర వంటి సంస్థలకు అప్పగించడం సరికాదని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్కాన్, నాంథి, అక్షయ పాత్ర, బుద్ధవరపు ట్రస్ట్, హరే రామ హరే కృష్ణ వంటి స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న పాఠశాలల్లో భోజనం నాసిరకంగా ఉంటోందన్నారు. బిల్లులు సరిగా రాక అప్పుల పాలైనప్పటికీ మహిళలు ఈ పథకాన్ని నిర్విఘ్నంగా అమలు చేస్తున్నారని అదే ఉపాధిగా నమ్ముకున్న 80 వేల మంది అన్యాయం చేయొద్దని వారు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు వేతనాలు పెంచాలి

కమిషనర్‌కు యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల వేతనాలు పెంచాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. ఈ మేరకు బుధవారం ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, పలివెల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, కార్య నిర్వాహక అధ్యక్షులు ఎస్ లక్ష్మణరావు, కోశాధికారి సిహెచ్ సత్యనారాయణ బృందం హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. గత ఏడు సంవత్సరాలుగా రెగ్యులర్ ప్రాతిపదికన స్టాఫ్ నర్సుల నియామకాలు చేపట్టలేదని, ఆ ఖాళీల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలని, 35 సెలవుల సౌకర్యాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ చేసేలోగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం.VI(ఎ)

Ref: C1/511/2017 — ది.28-8-2017

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ సుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను పశ్చిమ గోదావరి జిల్లా, **ద్వారకాతిరుమల** మండలం, **జి.కొత్తపల్లి** గ్రామం నందు ప్రజా ప్రయోజనముకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనల ననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలంగా నోటీసు జారీ చేయబడినది. చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియు లేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి, వారి సిబ్బందికి, మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది. పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది. పై చట్టంలో సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేది నుండి 60(అరువది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

గ్రామం: జి.కొత్తపల్లి — మండలం: ద్వారకాతిరుమల

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు తండ్రి/ భర్త పేరు	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	204/1B	0.22	0.10	రేగంటి శాంతమ్మ భర్త: సత్యనారాయణ	204	206	204	204	సాగుభూమి
2	204/1C	0.15	0.03	రేగంటి సత్యనారాయణ తండ్రి: సుబ్బయ్య	204P	204P	204P	204P	సాగుభూమి
3	204/1D	0.05	0.04	రేగంటి రామచంద్రయ్య తండ్రి: ముక్కయ్య	204	204	204	204	సాగుభూమి
4	204/1E	0.44	0.14	అల్లాడి సుబ్బారావు, తండ్రి: దొరయ్య	204	204	204	204	సాగుభూమి
5	204/1F	0.59	0.02	జాలపర్తి జాలవతి	204	204	204	204	సాగుభూమి
6	204/1O	2.40	0.25	ఘంటా సత్యనారాయణ తండ్రి: పుల్లయ్య	204	204	204	204	సాగుభూమి
7	204/1M	1.01	0.40	జాలపర్తి సత్యనారాయణ	204	204	204	204	సాగుభూమి
8	204/1L	5.59	0.25	రేవూరి రాములు, తండ్రి: నర్సయ్య	203	204	203	203	సాగుభూమి
9	203/2	2.75	0.24	వంకిన సుజాత మరియు జలపర్తి జలవతి	204	203P	203P	203	సాగుభూమి
10	203/3	0.58	0.03	నల్లూరి గంగాధరరావు మరియు నల్లూరి నరసింహమూర్తి	203P	139	203	203	సాగుభూమి
11	203/4	2.28	0.63	వంకిన యోగానంద సత్యనారాయణ తండ్రి: సుబ్బారావు	203	203	203	203	సాగుభూమి
12	203/5A	2.74	0.86	ఆచంట వెంకట దుర్గారావు తండ్రి: సత్యనారాయణ	203	139 140	203	203	సాగుభూమి
13	139/5	2.34	0.08	ఘంటా నరసింహరావు తండ్రి: సత్యనారాయణ	203	139	140	139	సాగుభూమి
14	140/2A	1.76	0.23	ఘంటా నరసింహరావు తండ్రి: సత్యనారాయణ	141	140	140 141	140	సాగుభూమి
15	140/2B	2.33	0.79	ఆలపాటి కామేశ్వరి తండ్రి: సుబ్బారావు	140	139	140	140	సాగుభూమి
16	45/2	0.77	0.04	బోడ దుర్గమ్మ	44	45	45	141	సాగుభూమి
17	44	5.96	0.78	కాసాని రామారావు, తండ్రి: గంగరాజు	44	44	141	241	సాగుభూమి
Total			4.91						

సం/- **సిహెచ్.భానుప్రసాద్**, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆధార్ అనుసంధానం గడువుపొడిగింపు

డిసెంబరు 31 వరకు సమయం



న్యూఢిల్లీ : ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సామాజిక సంక్షేమ పథకాలకు ఆధార్‌ను అనుసంధానం చేసే గడువును సెప్టెంబరు 30 నుంచి డిసెంబరు 31 వరకు పొడిగించినట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం తెలిపింది. అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్ సుప్రీం ధర్మాసనానికి ఈ విషయాన్ని తెలిపారు. ఆధార్ పథకం చట్టబద్ధతను సవాల్‌చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. సంక్షేమ పథకాలకు ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు తుది గడువు సెప్టెంబరు 30తో ముగియనుండటంతో దానిపై అత్యవసర విచారణ జరపాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది శ్యామ్ దివాన్ ధర్మాసనాన్ని కోరారు. దీంతో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరుపున వేణుగోపాల్ తన సమాధానాన్ని వినిపిస్తూ డిసెంబరు 31 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. వేణుగోపాల్ సమాధానం విన్న ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను నవంబరు మొదటి వారానికి వాయిదా వేసింది.

సబర్మతీ ఆశ్రమం డైరెక్టర్ రాజీనామా

పరిశోధన కోసమే మానివేస్తున్నానని వివరణ



అహ్మదాబాద్: సబర్మతీ ఆశ్రమం పరిరక్షణ స్మారక సంస్థ(సంపత్) డైరెక్టర్ పదవికి ప్రముఖ గాంధేయవాది తృదీప్ సుహృద్ బుధవారం రాజీనామా చేశారు. గురువారం సాయంత్రం నుంచి డైరెక్టర్ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు తన రాజీనామా లేఖలో ఆయన పేర్కొన్నారు. తృదీప్ నిర్ణయం తమని దిగ్భ్రాంతికి గురిచేసిందని సహోద్యోగులు అభిప్రాయపడ్డారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలపై చేసిన పరిశోధనలకుగాను తృదీప్ గుర్తింపు పొందారు. అయితే గాంధీతత్వంపై పరిశోధన కొనసాగించేందుకే రాజీనామా చేసినట్లు ఆయన వివరణ ఇచ్చారు. ఇతర కారణాలతో రాజీనామా చేసినట్లుగా వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. రెండు నెలల క్రితమే తన రాజీనామా గురించి ట్రస్టుకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఆయన హయాంలో ప్రారంభమైన పరిశోధక ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు మరో ఐదేళ్ళపాటు తృదీప్ సలహాలు, సూచనలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఆయన హయాంలోనే ఆశ్రమంలోని గాంధీ జ్ఞాపకాలు, రచనలు, పత్రాలు, లేఖల్ని డిజిటలైజేషన్ ప్రాజెక్టు ప్రారంభమైంది. గాంధీ మేధోసంపత్తి స్మృత్యర్థం ఓ వెబ్‌పోర్టల్‌ను కూడా నిర్వహిస్తున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేతులుమీదుగా ఇది ప్రారంభమైంది. ఇందులో సుమారు 35 వేల పత్రాలు లభ్యమౌతాయి.

ఒడిషా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు పెంపు

భువనేశ్వర్ : ఒడిషా రాష్ట్ర ఉద్యోగులకు సెప్టెంబరు నుంచి వేతనాలు పెరగనున్నాయి. ఉద్యోగుల వేతనాల విషయంలో ఏడవ వేతన కమిషన్ సిఫార్సులను అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం ప్రకటించారు. ఈ సిఫార్సుల అమలుతో రాష్ట్రంలోని 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షన్ దారులకు లబ్ది చేకూరనున్నది. 7వ వేతన కమిషన్ సిఫార్సులను పరిశీలించి అమలు చేసేందుకు ఒక కమిటీని నియమించనున్నట్లు ఆయన చెప్పారు. ఒడిషాలో 4.5 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, 3.5 లక్షల మంది పదవీ విరమణ పొందిన ఉద్యోగులున్నారు. ఉద్యోగులకు వేతనాలు పెంచడం వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.4 వేల 5 వందల కోట్లు అదనపు భారం పడనున్నది పట్నాయక్ తెలిపారు. పెరిగిన వేతనం సెప్టెంబరు నెల నుంచే ఉద్యోగులకు అందుతుందన్నారు. అయితే ఏడవ వేతన కమిషన్ సిఫార్సులను సెప్టెంబరు నుంచి అమలు చేయడంపై ఉద్యోగ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధంగానే జనవరి 1, 2016 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

పోలీసు కస్టడీలో హార్దిక్ పటేల్

మూడు రోజులు రిమాండ్ విధించిన మెజిస్ట్రేట్

దాడి చేశారంటూ అనుచరుని ఫిర్యాదు

అహ్మదాబాద్: పాటిదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్‌ను బుధవారం పటాన్ పోలీసుల కస్టడీకి తరలించారు. తమపై దాడి చేశారంటూ హార్దిక్ అనుచరుల్లో ఒకరు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఆయనపై నమోదైంది. ఈ నేపథ్యంలో హార్దిక్, ఆయన అనుచరుడు దినేష్ బంభానియాలను జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ముందు పటాన్ పోలీసులు ప్రవేశపెట్టారు. వీరికి పది రోజులు కస్టడీ విధించాలని మెజిస్ట్రేట్ వికె సోలంకిని పోలీసులు కోరగా మూడు రోజుల రిమాండ్‌కు ఆయన అనుమతించారు. దీంతో వారిద్దరినీ బుధవారం మధ్యాహ్నం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. పాటిదార్ అనామత్ ఆందోళన్ సమితి(పాస్) నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీ ప్రారంభానికి ముందు తనతో పాటు తన స్నేహితులపై హార్దిక్ బృందం దాడి చేసిందని, తన స్నేహితుడు దిలీప్ పటేల్ వద్ద బంగారపు గొలుసు లాక్కొని, ఫోన్ పగుల గొట్టారని ఫిర్యాదులో నరేంద్ర పటాన్ పేర్కొన్నారు. పటాన్‌లోని నవజీవన్ హోటల్‌లో ర్యాలీ గురించి చర్చిస్తుండగా ఈ విభేదాలు తలెత్తినట్లు నరేంద్ర పోలీసులకు వివరించారు. అనంతరం ఈ విభేదాల్ని పక్కనబెట్టి ర్యాలీకి వెళ్లినప్పటికీ అక్కడ కూడా బంభానియా తమను బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నివాసం వద్ద ఆప్ ఎమ్మెల్యేల నిరసన

న్యూఢిల్లీ: ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ నివాసం వద్ద బుధవారం ఆప్‌కు చెందిన ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫైల్‌లతో పాటు మోహాలా క్లినిక్ ఫైల్‌పై పై కూడా సంతకం పెట్టాలని పట్టుబట్టారు. మోహల్లా క్లీనిక్‌లో నిర్మాణంలో ఎలాంటి రాజకీయాలు లేవనీ, రెండుకోట్ల ఢిల్లీ ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడం కోసం కృషి చేస్తున్నామనీ, గవర్నర్ తక్షణమే ఈ ఫైల్‌ను క్లియర్ చేయాలని అరవింద్ క్రేజీవాల్ ట్విట్టర్‌లో కోరారు. అయితే గవర్నర్ కార్యాలయం మాత్రం కేజ్రీవాల్ గవర్నర్‌తో సమావేశాలకు హాజరుకావడం లేదనీ, బిల్లు తమ వద్దకు చేరలేదని పేర్కొంది. ఈ ఏడాది మేలోనే ఆ ఫైల్‌ను గవర్నర్‌కు పంపించామనీ, దీనిపై గత వారం కూడా ఆప్ ఎమ్మెల్యేలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిశారనీ కేజ్రీవాల్ ట్విట్టర్‌లో స్పందించారు.

సహకారానికి పుష్కలంగా అవకాశాలు

- చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి
- డోక్లాం వివాదంపై చైనా వ్యాఖ్య



బీజింగ్: భారత్-చైనా మధ్య దాదాపు 73 రోజుల పాటు కొనసాగిన డోక్లాం ప్రతిష్టంభనకు ఎట్టకేలకు బుధవారం తెరపడింది. భారత్ తన సైన్యాలను ఉపసంహరించుకోవటంతో ఈ ప్రతిష్టంభనకు తెరపడిందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి చెప్పారు. భారత్-చైనాలు ఆసియాలో పెద్ద దేశాలనీ, వాటి మధ్య సమస్యలుండటం సాధారణమేనని ఆయన వ్యాఖ్యానించారు. తమ మధ్య విభేదాలను సరైన వేదిక ద్వారా ఉభయ దేశాల నేతల ఏకాభిప్రాయంతో పరిష్కరించుకోవటం ప్రధానమని బుధవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో చెప్పారు.. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో సీ జిన్‌పింగ్, నరేంద్రమోడీ మధ్య భేటీ వుంటుందా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరుగకుండా ఈ ప్రతిష్టంభన నుండి భారత్ గుణపాఠం నేర్చుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 3 నుండి చైనాలో జరుగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని నరేంద్రమోడీ హాజరు కావటానికి కొద్ది రోజుల ముందు ఇరుదేశాలూ తమ సైన్యాలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి.

భారత్ అతిక్రమణతోనే ప్రతిష్టంభన

భారత సైన్యాలు తమ సరిహద్దులను అతిక్రమించినందువల్లే ఈ ప్రతిష్టంభన ఏర్పడిందని ఆయన వివరించారు. ఇప్పుడు భారత్ తన సైన్యాలను ఉపసంహరించుకోవటంతో దీనికి తెరపడిందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత్ తన ముఖం చాటేసుకునేందుకే సైన్యాలను వెనక్కి పిలిపించిందంటూ మీడియాలో వెలువడిన వార్తా కథనాలపై ఆయన స్పందిస్తూ మీడియా ఊహాగానాలతో కథనాలను ప్రచురించవచ్చుని, అయితే అందుకు చైనా ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని ఆధారం చేసుకోవాలని సూచించారు.

సిక్కింలో గోవధపై నిషేధం

బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం

గ్యాంగ్‌టక్: గో వధపై నిషేధం విధించిన తొలి ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం నిలిచింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ మంగళవారం ఆమోదం తెలిపింది. సిక్కిం పశు సంవర్ధక శాఖ మంత్రి సోమ్‌నాథ్ పౌడ్యాల్ ఈ బిల్లును సోమవారం ప్రవేశపెట్టారు. ఇక నుంచి రాష్ట్రంలో ఎవరైనా ఆవులను వధిస్తే రెండు నుంచి ఐదేండ్ల వరకు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానాను ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాక, చట్టాన్ని పదే పదే ఉల్లంఘిస్తే ఏడేండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశమున్నది. రాష్ట్రంలో సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్(ఎస్‌డీఎఫ్) అధికారంలో ఉన్నది. ఇది బీజేపీ కూటమి అయిన నార్త్ ఈస్ట్ డెమోక్రటిక్ అలయెన్స్(ఎన్ఈడీఏ)లో భాగస్వామ్య పార్టీగా ఉన్నది.

ఎన్‌జెఎసి తీర్పుపై సత్వర సమీక్షకు సుప్రీం నో!



న్యూఢిల్లీ: 2014 నాటి జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టం, 99వ రాజ్యాంగ సవరణ చట్టాలను కొట్టివేస్తూ 2015లో వెలువరించిన తీర్పుపై సత్వర సమీక్ష నిర్వహించాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. న్యాయమూర్తుల నియామకాలలో అనుసరిస్తున్న కొలీజియం విధానాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఈ సవరణ చట్టాలను అమలులోకి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. సుప్రీకోర్టు ఈ చట్టాలను కొట్టివేయటంతో కొలీజియం విధానం యధాతథంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ తీర్పుపై సత్వర సమీక్ష జరపాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు అమితావరాయ్, ఎఎం ఖన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఉన్నత స్థాయి న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల నియామకంలో 2014 నాటి ఎన్‌జెఎసి చట్టం కీలక పాత్ర పోషించాల్సి వుంది. అయితే 2015 అక్టోబర్ 16న ఈ చట్టాన్ని కొట్టివేసిన సర్వోన్నత న్యాయ స్థానం, కొలీజియం విధానాన్ని యధాతథంగా కొనసాగించాలని స్పష్టం చేసింది. ఎన్‌జెఎసి చట్టం, 99వ రాజ్యాంగ సవరణ చట్టం చెల్లవని ఐదుగురుసభ్యుల ధర్మాసనంలో నలుగురు అభిప్రాయ పడగా న్యాయమూర్తి జె చలమేశ్వర్ మాత్రం రాజ్యాంగ సవరణ చట్టం చెల్లుబాటును సమర్థించారు.

మహారాష్ట్రను అతలాకుతలం చేసిన భారీ వర్షాలు

15 మంది మృతి, 12 మందికి గాయాలు



ముంబయి : భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు 15 మంది మృతి చెందారు. 12 మందికి గాయాలయ్యాయి. బుధవారం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ముంబయిలో బస్సులు, రైళ్ళు, విమానాలను పునరుద్ధరించారు. ముంబయిలో మంగళవారం రాత్రి మరో ముగ్గురు మృతి చెందడంతో మృతుల సంఖ్య 15కు పెరిగింది. గడిచిన 24 గంటల్లో కుండపోతగా కురిసిన వర్షాల కారణంగా ముంబయిలో పలు ప్రాంతాలు వరదల్లో చిక్కుకున్నప్పటికీ తరువాత నీటి ఉధృతి తగ్గింది. రోడ్లకు అడ్డంగా పడిన చెట్లను స్థానికులు తొలగించారు..

ముందుగా హెచ్చరించినా... పట్టించుకోని ప్రభుత్వం

ముంబయిలో బుధవారం ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు భారీ వర్షాలు కురిశాయి. దీంతో రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడ నిలిచి పోయింది. రహదారులు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో పౌరులందరూ తమ తమ నివాసాలలోనే ఉండాలంటూ గ్రేటర్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) మధ్యాహ్నం 2 గంటల సమయంలో తొలి హెచ్చరిక చేసింది. అప్పటికే వర్షం తగ్గుముఖం పట్టి, నీటి ప్రవాహం తగ్గిపోయింది. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా చాలా ఆలస్యంగా స్పందించి మధ్యాహ్నం నుంచి కార్యరంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మధ్యాహ్నం కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఆ తరువాత విపత్తు నిర్వహణ కేంద్రాలను సందర్శించారు. కాగా ఉదయం రాష్ట్ర విపత్తు నిర్వహణా కేంద్రం అధికారులు మాట్లాడుతూ పరిస్థితి మెరుగుపడిందని, సహాయ చర్యలను కొనసాగిస్తున్నామని చెప్పారు. కుండపోత వర్షాలు ముంబయి నగరానికి కొత్త కాదు. అయితే విపత్తును ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసుకోకపోవడం, సరైన సమయంలో హెచ్చరికలు జారీ చేయకపోవడం అధికారుల తీరును వెల్లడిస్తోంది.

భారత వాతావరణ శాఖకు చెందిన కొలాబా అబ్జర్వేటరీ సోమవారం ఒక ప్రకటనను జారీ చేస్తూ రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురవనున్నాయని ముందుగానే హెచ్చరించింది. దీని తరువాత బిఎంసి కూడా ప్రజలు అప్రమత్తం చేసింది.అయితే అధికారులు మాత్రం ఈ హెచ్చరికలను చాలా తేలికగా తీసుకున్నారు. లక్షలాది మంది ప్రజలు స్టేషన్లలో చిక్కుకు పోయారు.

సమర్థవంతంగా పనిచేశాం...!

- సమర్థించుకున్న హర్యానా సిఎం
- అమిత్‌షాను కలిసిన అనంతరం ప్రకటన

చండీగఢ్: హర్యానాలో డేరా సచ్చా సౌధా అధినేత గుర్మిత్ రామ్ రహీమ్ బాబా అరెస్టు అనంతరం హింస చెలరేగకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్న ఆరోపణల నేపథ్యంలో హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్ ఖట్టర్ స్పందించారు. అరెస్టు అనంతర పరిణామాలను తాము సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు తనను తాను కీర్తించుకున్నారు. ఢిల్లీలో బిజెపి చీఫ్ అమిత్‌షాను కలిసిన అనంతరం సిఎం ఈ ప్రకటన చేశారు. డేరా మద్దతుదారులు పెద్ద ఎత్తున హింసకు పాల్పడడంతో రాజకీయ పక్షాలు ఖట్టర్ రాజీనామాను డిమాండ్ చేశాయి. గుర్మిత్ అరెస్టు నేపథ్యంలో ఆయన మద్దతు దారులకు సున్నితమైన ప్రాంతాల్లో కూడా శిబిరాలుఏర్పాటు చేసుకోవడానికి ముఖ్యమంత్రి అనుమతిం చారన్న ఆరోపణలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డేరాబాబా బిజెపికి సహకరించడంతో ఇలా అనుమతించాల్సి వచ్చిందనీ, దీంతో పెద్ద ఎత్తున హింస చెలరేగిందనీ ఆరోపణలున్నాయి.

బీహార్ విద్యా వ్యవస్థ వైఫల్యాన్ని నిరసిస్తూ

భోజ్‌పూర్‌లో విద్యార్థుల ఆందోళనలు



భోజ్‌పూర్ : బీహార్ విద్యా వ్యవస్థ వైఫల్యాన్ని నిరసిస్తూ భోజ్‌పూర్‌లో విద్యార్థులు ఆందోళనలకు దిగారు. నిరుపేద, దళిత, ముస్లిం కుటుంబాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వీధుల్లో నమూనా తరగతులు నిర్వహించారు. ఎఐఎస్ఎ-ఆర్‌వైఎ స్థానిక శాఖ, కొత్తగా ఏర్పడిన భగత్‌సింగ్ యువ బ్రిగేడ్‌ల సాయంతో విద్యార్థులు ఈ ఆందోళనలు చేపట్టారు. స్కూళ్ళలో సౌకర్యాలు కొరవడడం, పాఠ్య పుస్తకాల కొరత, తరగతులకు హాజరవని, వచ్చినా గంట కూడా టీచర్లు పాఠాలు చెప్పకపోవడంపై విద్యార్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కులతత్వం వేళ్ళూనుకుపోవడం, స్కూళ్ళలో టాయిలెట్లు లేకపోవడం వంటి పరిస్థితులపై వారు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఏజియన్ బ్లాక్‌లోని అహిలె పాఠశాలలో దళిత విద్యార్థులు తమ చేతులతో టాయిలెట్‌ను శుభ్రం చేయాల్సి వస్తోంది. ఈ విషయాన్ని విద్యా అధికారి దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన దురుసుగా సమాధానమిచ్చారు. భోజ్‌పూర్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో సైన్స్ లేబరేటరీ ఒక్కటి కూడా లేదని, ప్రాక్టికల్స్‌కు అవసరమైన పరికరాలు, టీచర్లు కూడా లేరని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. లైబ్రరీలు వున్నాయి కానీ వాటిల్లో పుస్తకాలు లేవన్నారు. ఖోపిరా పంచాయితీలోని ఝురా ముషాహరి స్కూలు సగం నిర్మాణానికే నోచుకుందని, ఐదేళ్ళుగా మిగిలిన సగం పూర్తవలేదని విద్యార్థులు తెలిపారు. సందేష్ పంచాయితీలోని భటోలి స్కూలు పూర్తిగా అధికారుల నిర్లక్ష్యానికి గురైందని, మరో పాఠశాలలో టీచర్లే లేరని విద్యార్థులు తెలిపారు. ఏప్రిల్ నుండి నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్మీలో సంస్కరణలు : జైట్లీ


- అమల్లోకి శేకత్‌కర్ కమిటీ సిఫార్సులు
- 99 సూచనల్లో 65 అమలుకు ప్రభుత్వ అంగీకారం



న్యూఢిల్లీ: భారత ఆర్మీలో నూతన సంస్కరణలు ప్రారంభం కానున్నాయని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం తెలిపారు. శేకత్‌కర్ కమిటీ సిఫార్సుల్లో కీలకమైన అంశాలను అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. కమిటీ ప్రతిపాదించిన 99 సిఫార్సుల్లో 65 సిఫార్సులు త్వరలో అమల్లోకి రానున్నాయన్నారు. ఇందులో భాగంగా 57 వేల అధికారి హోదా పోస్టులను ప్రక్షాళన చేస్తామని పేర్కొన్నారు. సైనిక శిబిరాల్లో రక్షణ పరికరాలు, సామాగ్రి, పనిముట్లు మెరుగుపరచడంతోపాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని, నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సిసి)లో సంస్థాగత మార్పులకు శ్రీకారం చుడతామని జైట్లీ పేర్కొన్నారు. సైనికదళాల యుద్ధ సామర్థ్యం మెరుగుదలకు మార్గదర్శకాలను రూపొందించేందుకు శేకత్‌కర్ కమిటీని ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే.

సునంద పుష్కర్ హత్య కేసు దర్యాప్తు నివేదికనివ్వండి

ఢిల్లీ పోలీసులను కోరిన హై కోర్టు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ భార్య సునంద పుష్కర్ హత్య కేసు దర్యాప్తుకు సంబంధించిన స్థాయీ నివేదికను సమర్పించాలని ఢిల్లీ హై కోర్టు బుధవారం నగర పోలీసులను ఆదేశించింది. నివేదికను సమర్పించేందుకు రెండు వారాలు గడువిచ్చింది. ఈ కేసులో ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తు వివరాలను పరిశీలించాలని అడిషనల్ సొలిసిటర్ జనరల్ సంజయ్ జైన్ కోరిన అనంతరం న్యాయమూర్తులు జి.ఎస్. సిస్తాని, చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు పోలీసులను ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తులో పోలీసుల నుంచి వైఫల్యమేమీ లేదని, సీనియర్ పోలీసు అధికారులను పిలిపించి మాట్లాడాలని కూడా సంజయ్ జైన్ ధర్మాసనాన్ని కోరారు. ఈ కేసు దర్యాప్తుకు సంబంధించి సైంటిఫిక్ నివేదికలు పొందడంలోనే జాప్యం జరుగుతున్నదని ఆయన చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ దర్యాప్తును పర్యవేక్షించడం, పరిశీలించడం సబబు కాదని పేర్కొంది. అయితే ఈ రోజుకు దర్యాప్తు ఎంతవరకు వచ్చిందన్న విషయాన్ని ఖచ్చితంగా తెలుసుకుంటామని చెప్పింది. ఈ కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ప్రమాదాలపై 'రైల్వే' ఆందోళన

- డిఆర్‌ఎంలకు మరిన్ని అధికారాలు?
- ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేసిన కమిటీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వరుసగా సంభవిస్తున్న ప్రమాదాలపై రైల్వే శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆర్థిక, నిర్వహణ అధికారాల్లో విస్తృత మార్పులు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. డివిజన్లను పూర్తి స్థాయి వాణిజ్య యూనిట్లుగా మార్చేందుకు, ప్రమాదాల నివారణకు మార్గదర్శకాలు రూపొందించడం కోసం రైల్వే మంత్రి సురేష్ ప్రభు జూన్ నెలలో ఓ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ కమిటీ రూపొందించిన నివేదిక ముసాయిదాలో డివిజనల్ రైల్వే మేనేజర్ల(డిఆర్‌ఎం)కు విస్తృత అధికారాలు ఇవ్వాలని సూచించబోతున్నట్లు సమాచారం. తద్వారా రైల్వే నిర్వహణ సజావుగా జరిగే అవకాశముందని, ముఖ్యంగా ఎమర్జెన్సీ సమయంలో స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అధికారాలుంటే ప్రమాదాలు నివారించొచ్చని అందులో పేర్కొంది. యుపి రైలు ప్రమాదం ఘటనతో ఉలిక్కిపడ్డ రైల్వే శాఖ ఈ సూచనలను సీరియస్‌గా పరిగణించే అవకాశముంది.

గర్భిణికి సర్జరీ చేస్తూ ఘర్షణ పడ్డ వైద్యులు

- పుట్టిన కొద్ది గంటలకే మరణించిన శిశువు
- వైద్యులను సస్పెండ్ చేసిన అధికారులు
- సంఘటనపై నివేదిక కోరిన జోథ్‌పూర్ కోర్టు



న్యూఢిల్లీ : రాజస్థాన్‌లోని జోథ్‌పూర్ ఉమైద్ ఆసుపత్రి ఆపరేషన్ గదిలో ఇద్దరు వైద్యుల మధ్య జరిగిన ఘర్షణ ఒక పసిబిడ్డ ప్రాణాలను బలితీసుకుంది. రాజస్థాన్ హై కోర్టు ఈ సంఘటనపై నివేదికను కోరింది. ఒక గర్భిణి మంగళవారం బిడ్డను ప్రసవించేందుకు ఆసుపత్రిలో చేరింది. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీయాలని నిర్ణయించుకున్నారు. ఆమెను ఆపరేషన్ దియేటర్‌కు తరలించారు. డాక్టర్ అశోక్ నైన్వాల్, ఎం.ఎల్.తక్‌లు ఆమెకు అత్యవసర ఆపరేషన్ నిర్వహించాల్సి ఉంది. ఇద్దరూ ఆపరేషన్ గదికి చేరుకున్నారు. అక్కడ వీరితో పాటు ఒక నర్సు, మరో వైద్యుడు కూడా ఉంది. ఆపరేషన్‌కు ముందు రోగి ఆహారం తీసుకుందా, లేదా అనే విషయమై ఇద్దరు వాదించుకున్నారు.

వైద్యులిద్దరి మధ్య వాదులాట వీధి ఘర్షణలను తలపించింది. అక్కడే ఉన్న నర్సు, డాక్టర్ వారిని ఆపేందుకు ప్రయత్నించారు. ఆమెకు ఆపరేషన్ నిర్వహించాలని కోరారు. వీరి ఘర్షణల దృశ్యాన్ని అక్కడే ఉన్న నర్సు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించింది. ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. దీంతో డాక్టర్ నైనాల్, తక్‌లను ఆసుపత్రి అధికారులు సస్పెండ్ చేశారు. ఆపరేషన్ తరువాత జన్మించిన శిశువు శ్వాస సంబంధిత సమస్యతో కొద్ది సేపటికే మృతి చెంది ందని ఆసుపత్రికి చెందిన సీనియర్ డాక్టర్ రంజనా దేశాయ్ తెలిపారు. ఆపరేషన్ దియేటర్‌లో ఉన్న సిబ్బంది వ్యాఖ్యలను తాము నమోదు చేశామని చెప్పారు. రోగికి సంబంధించినంద వరకు చికిత్స అందించడంలో ఎటువంటి లోపం జరగలేదన్నారు. ఆసుపత్రిలో చేరి మూడు గంటల వ్యవధిలోనే ఆమెకు ఆపరేషన్ నిర్వహించినట్లు చెప్పారు. వైద్యులిద్దరి ప్రవర్తనపై ఆసుపత్రి కమిటీ దర్యాప్తు చేయనున్నదని ఆసుపత్రిని నిర్వహిస్తున్న జోథ్‌పూర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అమిలాల్‌భట్ తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌లో పాటించాల్సిన క్రమశిక్షణను వైద్యులిద్దరూ పాటించలేదని, ఇది తీవ్రంగా ఖండించదగిన విషయమని ఆయన పేర్కొన్నారు.

ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరించిన తమిళనాడు గవర్నర్

చెన్నై : ప్రత్యేక అసెంబ్లీని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి పళనిస్వామిపై విశ్వాస ఓటింగ్ జరిపించాలంటూ ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను తమిళనాడు గవర్నర్ సిహెచ్. విద్యాసాగర రావు తిరస్కరించారు. రెబల్ ఎమ్మెల్యేలు 19 మందిని కూడా ఎఐఎడిఎంకె సభ్యులుగా గుర్తించాలని దినకరన్ వర్గం నేతల డిమాండ్‌పై ఆయన తన తన అశక్తతను వ్యక్తం చేశారు. వెంటనే అసెంబ్లీ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి పళని స్వామిని విశ్వాస పరీక్షను ఆదేశించాలని,తద్వారా అధికార పక్షంలో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించాలని రాష్ట్రంలోని నాలుగు ప్రతిపక్ష పార్టీలు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జి. రామకృష్ణన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, టిఎంఎంకె నాయకులు ఎం.హెచ్. జవహిరుల్లా, విడుతలై చిరుతైగల్ కచ్చి (విసికె) నాయకుడు థోల్ ఈ మేరకు గవర్నర్‌ను అభ్యర్థించారు.. గవర్నర్‌తో భేటీ అనంతరం ముత్తరసన్ మీడియాతో మాట్లాడుతూ ఈ అంశంపై గురువారం రాష్ట్రపతిని కలవనున్నట్లు తెలిపారు. రాష్ట్రపతి, గవర్నర్ ఇద్దరూ కూడా దీనిపై తగిన చర్య తీసుకోని పక్షంలో ప్రజల ముందుకు వెళ్తామన్నారు.

లండన్ వెళ్ళిన నవాజ్ షరీఫ్

స్వదేశానికి తిరిగి రావడం అనుమానమేనా?



ఇస్లామాబాద్ : అస్వస్థతతో బాధ పడుతున్న భార్యను చూసేందుకు పదవీచ్యుతుడైన పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ లండన్ బయలుదేరి వెళ్ళారు. కాగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న షరీఫ్ బహుశా వెనక్కి తిరిగి రాకపోవచ్చని పుకార్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం షరీఫ్‌పై అవినీతి, మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయి. లండన్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి షరీఫ్ బక్రీద్ జరుపుకోనున్నారు. బుధవారం ఉదయం ఎమిరేట్స్ విమానమెక్కిన షరీఫ్ మధ్యలో దుబాయ్‌లో కొద్ది గంటల సేపు ఆగారు. లండన్ బయలుదేరడానికి ముందుగా షరీఫ్ మాట్లాడుతూ, గొంతు కేన్సర్‌తో బాధ పడుతున్న తన భార్య ఆరోగ్యం కోసం ప్రార్ధనలు చేయాల్సిందిగా ప్రజలను కోరారు. లండన్‌లో షరీఫ్ 10 రోజులు వుంటారని ఆయన సన్నిహితుడు, సెనెటర్ పర్వేజ్ రషీద్ తెలిపారు. ఆయన భార్య ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైతే మరికొన్ని రోజులు పొడిగిస్తారని చెప్పారు. అయితే ఆయనపై కేసులు వున్న దృష్ట్యా వెనక్కి తిరిగి వచ్చే అవకాశాలు లేవని తీవ్రంగా పుకార్లు షికారు చేస్తున్నాయి. కాగా ఈ పుకార్లను అర్థం లేనివంటూ రషీద్ కొట్టిపారేశారు. దేశానికి దూరంగా ఆయన ఎందుకు వుంటారు? ఆయన తన దేశాన్ని చాలా ప్రేమిస్తారని చెప్పారు.

'హార్వీ'పై ట్రంప్ సమీక్ష

తుఫాన్‌ల్లో 30 మంది మరణం



వాతావరణం కేంద్రంలో మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్

హోస్టన్: హార్వీ హరికేన్ ప్రభావంతో చిన్నాభిన్నమైన హోస్టన్, టెక్సాస్ ప్రాంతాలను అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మంగళవారం సందర్శించారు. హరికేన్ ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన ట్రంప్ అక్కడి బాధితులను పరామర్శించి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. దాదాపు నాలుగు రోజులపాటు హోస్టన్ నగరాన్ని గడగడలాడించిన హార్వీ హరికేన్ దెబ్బకు రోడ్లన్నీ నదులను తలపిస్తుండటంతో శిధిలాలలో చిక్కుకుపోయిన వారికి సహాయం అందించేందుకు సహాయక బృందాలు అక్కడి చేరుకోవటం కష్ట సాధ్యమవుతోంది. మంగళవారం ఉదయం 8.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) భార్య మెలానియాతో కలిసి బయల్దేరిన ట్రంప్ హార్వీ హరికేన్ ప్రభావిత ప్రాంతాలను చూసి చలించి పోయారు. హోస్టన్ నుండి టెక్సాస్ చేరుకున్న ట్రంప్ బాధిత ప్రజలను ఆదుకునేందుకు ఫెడరల్ ప్రభుత్వం పూర్తి సహాయం అందిస్తుందని చెప్పారు. హార్వీ హరికేన్ కారణంగా కలిగిన నష్టం నుండి తేరుకునేందుకు సుదీర్ఘ సమయం పడుతుందన్నారు. టెక్సాస్‌లో దాదాపు ఎనిమిది వేల మంది ప్రజలు సహాయక కేంద్రాల్లో తలదాచుకుంటుండగా, మరికొన్ని వందల మంది సహాయం కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. ఇదిలా వుండగా హోస్టన్ నగరంలో భారీ వర్షాలకు పోటెత్తిన వరదనీరు నగరం దక్షిణ ప్రాంతంలోని బ్రజోరియా కౌంటీని ముంచెత్తింది. దీనితో అప్రమత్తమైన అధికారులు అక్కడి వారిని వెంటనే ఇళ్లు ఖాళీ చేయించి సహాయక శిబిరాలకు తరలించారు. నగరానికి సమీపంలో వున్న కొలంబియా సరస్సు గట్లు తెగి ప్రవహిస్తోందని కౌంటీ ప్రభుత్వం వెల్లడించింది. దీనితో అదనపు నీటి ప్రవాహాన్ని కిందికి వదిలేందుకు అమెరికా సైనిక ఇంజనీర్లు అడిక్స్, బార్కర్ డామ్‌ల వద్ద ప్రయత్నాలు చేస్తున్నారని ప్రభుత్వం తెలిపింది. మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించటంతో పొరుగునే వున్న అప్రమత్తమైన లూసియానా రాష్ట్ర అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు ప్రారంభించారు.

30కి చేరిన మృతుల సంఖ్య

అమెరికా చరిత్రలోనే అత్యంత భారీ వర్షపాతంగా రికార్డులకెక్కిన హార్వీ హరికేన్ మంగళ వారం రాత్రి హోస్టన్ నుండి దూరంగా కదులుతోంది. తుపాను సరిహద్దు దాటినప్పటికీ వర్షాల జోరు మాత్రం ఇంకా తగ్గలేదు. హార్వీ హరికేన్ పొరుగునే వున్న లూసియానా దిశగా కదులుతుండటంతో అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు హోస్టన్ నగరంలో 30 మంది మరణించినట్లు అధికారులు ధృవీకరించారు. హరికేన్ దెబ్బకు గల్లంతయిన వారి సంఖ్య అంచనాలకు అందటం లేదన్నారు. దెబ్బతిన్న ఇళ్లు, భవనాల సంఖ్యను అంచనా వేయటం కూడా కష్టసాధ్యంగా మారిందన్నారు. వరద నీటి నుండి తాము 13 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు చెప్పారు. అనేక మంది పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 13,300 మంది ప్రజలు సహాయక శిబిరాల్లో తలదాచుకుంటుండగా మరో 30 వేల మందిని శిబిరాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఉత్తరకొరియా చర్యను ఖండించిన ఐరాస

తక్షణమే అణు కార్యక్రమాలు నిలిపివేయాలని డిమాండ్

న్యూయార్క్ : ఉత్తరకొరియా మంగళవారం నిర్వహించిన క్షిపణి ప్రయోగాన్ని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీవ్రంగా ఖండించింది. భవిష్యత్తులో క్షిపణి పరీక్షలు నిర్వహించరాదని, అన్ని అణ్వాయుధ కార్యక్రమాలు తక్షణమే నిలిపివేయాలని భద్రతా మండలి డిమాండ్ చేసింది. కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి ఉత్తర కొరియా తక్షణమే నిర్దిష్ట చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యమని 15మంది సభ్యుల భద్రతా మండలి ఒక ప్రకటనలో కోరింది. ఉత్తర కొరియాపై ఐక్యరాజ్య సమితి విధించిన ఆంక్షలను అమలు చేయాలని అన్ని దేశాలను కోరింది. ఉత్తర కొరియా తీసుకుంటున్న ఈ చర్యలు కేవలం ఈ ప్రాంతానికే కాకుండా ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలన్నింటికీ ముప్పేనని ఆ ప్రకటన పేర్కొంది. శాంతియుత, దౌత్య, రాజకీయ పరిష్కారానికి తాము కట్టుబడి వున్నట్లు పేర్కొంది.

ఖండాంతర క్షిపణిని పరీక్షించిన అమెరికా

వాషింగ్టన్: అమెరికా బుధవారం ఖండాంతర క్షిపణిని ప్రయోగాత్మకంగా పరీక్షించింది. జపాన్ మీదుగా ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఆ తరువాతి రోజునే అమెరికా క్షిపణి భద్రతా సంస్థ(ఎండిఎ), నౌకాదళం సంయుక్తంగా ఖండాంతర క్షిపణిని పరీక్షించడం విశేషం. అయితే అమెరికా క్షిపణి పరీక్షను ఐరాస ఖండించలేదు. యుఎస్ఎస్ జాన్ పాల్ జోన్స్ నౌక నుంచి ఈ మధ్య తరహా ఖండాంతర క్షిపణిని పరీక్షించినట్లు ఎండిఎ ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు జపాన్ కూడా భూఉపరితల లక్ష్యాలను అధిగమించే ఏజిస్ శ్రేణిలోని ఖండాంతర క్షిపణి వ్యవస్థను రూపొందిస్తోన్న సంగతి తెలిసిందే. 2023 నాటికి దీన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తాజా పరిణామాల నేపథ్యంలో ప్రకటించింది.



ప్రతిపక్ష నేతల విచారణకు వెనిజులా అసెంబ్లీ ఆమోదం



కారకస్ : దేశ ద్రోహానికి పాల్పడినందుకు ప్రతిపక్ష నేతలను విచారించాలని వెనిజులా కొత్త రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. వెనిజులాపై అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలకు మద్దతు ఇచ్చిన వారిని విచారించనున్నట్లు అసెంబ్లీ తెలిపింది. అధ్యక్షుడు నికొలస్ మదురో వ్యవహార శైలిని విమర్శిస్తూ అమెరికా గత వారం ఆంక్షలను విధించింది. కాగా ఆర్థిక సంక్షోభం నెలకొన్న సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను మరింత విచ్ఛిన్నం చేయడానికి అమెరికా చర్యలు తీసుకుంటోందని మదురో విమర్శించారు. మూడు గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశంలో 'వివా మదురో' అంటూ అసెంబ్లీ సభ్యుడు గ్లేడీస్ రెక్వెనా నినదించారు. వెంటనే సభ్యులు లేచి కరతాళ ధ్వనులు చేశారు. మదురో ప్రభుత్వాన్ని విమర్శించే వారిని తీవ్రంగా నిరసించారు.

గాజాలో ఐరాస చీఫ్ పర్యటన

ఇజ్రాయిల్ ఆంక్షలను ఎత్తివేయాలని పిలుపు

గాజా : గాజాలో బుధవారం ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటానియో గుటెరస్ పర్యటించారు. గాజాపై ఇజ్రాయిల్-ఈజిప్ట్ ఆంక్షలను ఎత్తివేయాలని, మానవతా సంక్షోభం నుండి కాపాడాలని ఆయన పిలుపిచ్చారు. కాగా ఐరాస చీఫ్ పర్యటనను హమస్ పాలకులు స్వాగతించారు. సహాయ, అభివృద్ధి కార్యక్రమాలకు గుటెరస్ ఆమోద ముద్ర వేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా ఖైదీల విడుదల కోసం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ ఏడాది ప్రారంభంలో బాధ్యతలు చేపట్టిన తర్వాత గుటెరస్ మొదటిసారిగా గాజాలో పర్యటించారు. శాంతి చర్చల పునరుద్ధరణను ప్రోత్సహించే లక్ష్యంతో ఇజ్రాయిల్, పాలస్తీనా నేతలతో గుటెరస్ సమావేశాలు జరిపారు. గాజాకు రావడానికి ముందుగా గుటెరస్ హెలికాప్టర్‌లో ఇజ్రాయిల్-గాజా సరిహద్దుల్లో పర్యటించారు. ఆయన వెంట ఇజ్రాయిల్ అధికారులు వున్నారు. సరిహద్దు వెంట గల సున్నిత ప్రాంతాల్లోని ప్రజలను కలుసుకున్నారు. అంతర్జాతీయంగా అందుతున్న మానవతా సాయాన్ని గాజా పాలకులు దుర్వినియోగం చేస్తున్నారని, ఇజ్రాయిల్‌కు హాని తలపెట్టేందుకు సొరంగాలు తవ్వుతున్నారంటూ ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయిల్ రాయబారి డేనీ డానన్ ఆరోపించారు.

జపాన్ చేరుకున్న బ్రిటన్ ప్రధాని మే



ఒసాకా (జపాన్): బ్రిటన్ ప్రధాని థెరెస్సా మే మూడు రోజుల అధికార పర్యటన నిమిత్తం బుధవారం నాడు జపాన్ చేరుకున్నారు. ఐరోపా కూటమి నుండి నిష్క్రమించిన అనంతరం బ్రిటన్‌లో విదేశీ సంస్థల వాణిజ్యంపై భయాందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రధాని మే జపాన్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పర్యటనలో ఆమె ముఖ్యంగా జపాన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు జరుపుతారని తెలుస్తోంది. ఒసాకా నుండి ప్రారంభమయ్యే ఈ పర్యటనలో ఆమె ముందుగా టోయోటా సంస్థ ఛైర్మన్‌తో భేటీ అవుతారు. అనంతరం ఆమె టోక్యోకు వెళ్లి అక్కడ చక్రవర్తి అకిహిటో, ప్రధాని షింజో అబేతో చర్చలు జరుపుతారు. వచ్చే మార్చి చివరి నాటికి తాము ఐరోపా కూటమి నుండి నిష్క్రమిస్తామని బ్రిటన్ ఇప్పటికే లాంఛనంగా ప్రకటించిన విషయం తెలిసిందే. బ్రెగ్జిట్ అనంతరం బ్రిటన్‌లో వున్న తమ కంపెనీల భవిష్యత్ ఏమిటన్న అంశం జపాన్ వాణిజ్య వేత్తలకు ప్రశ్నార్థకంగా మారింది. తమ కంపెనీలపై బ్రెగ్జిట్ ప్రభావాన్ని సాధ్యమైనంత కనిష్ట స్థాయిలో వుండేలా, చూడాలని తాము కోరనున్నట్లు జపాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. జపాన్‌కు చెందిన దాదాపు వెయ్యికిపైగా సంస్థలు బ్రిటన్‌లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థల్లో దాదాపు 1,40,000 మందికి పైగా స్థానికులు ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

నేడు పిఎస్ఎల్‌వి-సి39 ప్రయోగం

దూసుకెళ్లనుంది. శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో స్వల్ప మార్పు చేశారు. ఒక నిమిషం ఆలస్యంగా నింగిలోకి పంపేందుకు నిర్ణయించారు. తొలుత నిర్ణయించిన మేరకు నేడు సాయంత్రం 6:59 గంటలకు ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపితే వ్యర్థాలు అడ్డుపడే అవకాశం ఉందన్న అంశం చర్చకు వచ్చింది. దీంతో మంగళవారం రాత్రి లాంచ్ ఆథరైజేషన్ (ల్యాబ్) సమావేశంలో నిర్ణయించారు. ఇందులో రాకెట్ ప్రయోగానికి అధికారికంగా నిమిషం ఆలస్యంగా నింగిలోకి పంపేందుకు అనుమతిచ్చారు. ఈ మేరకు కౌంట్‌డౌన్‌లో మార్పు చేశారు. బుధవారం మధ్యాహ్నం 1:59 గంటలకు బదులు మధ్యాహ్నం 2 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ కౌంట్‌డౌన్ ప్రక్రియ నిరంతరాయంగా 29 గంటల పాటు కొనసాగిన అనంతరం నేటి సాయంత్రం 7 గంటలకు పిఎస్ఎల్‌వి-సి39 ప్రయోగం జరగనుంది. 1,425 కిలోల బరువు గల ఐఆర్ఎన్ఎస్ఎ-1హెచ్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి మోసుకెళ్లనుంది. 2013 జులైలో పిఎస్ఎల్‌వి ద్వారా నావిగేషన్ వ్యవస్థ కోసం ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఎ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపారు. అందులో ఉన్న గడియారాల్లో సాంకేతిక లోపం తలెత్తి అవి పని చేయక సేవలందించడం లేదు. దీని స్థానంలో ప్రస్తుతం ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని పంపుతున్నారు. బుధవారం ఇస్రో అధినేత కిరణ్‌కుమార్, ఇస్రో ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్, స్పేస్ కమిషన్ సభ్యులు, విఎస్ఎస్‌సి డైరెక్టర్ డాక్టర్ శివన్ షార్‌కు చేరుకున్నారు.

బిఆర్‌డిలో మరణ మృదంగం

వార్డు నుండి, మరో 25 చిన్నారుల వార్డు నుండి నమోదయ్యాయి. ఇటీవలి భారీ వర్షాలు, వరదలకు ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయిన నేపథ్యంలో పెరిగిన దోమలతో మెదడు వాపు కేసులు రానున్న రోజుల్లో మరింత పెరగనున్నాయని స్థానిక డాక్టర్లు చెబుతున్నారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా బిఆర్‌డి ప్రిన్సిపాల్ డా.పికె సింగ్ నుండి స్పందన కరువైందని స్థానిక వైద్యుడు డా.ఆర్ఎన్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దోమల నివారణకు గత జనవరిలో చేపట్టిన చర్యలు అసమగ్రంగా ముగిసాయని, ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు ముంచుకు రావటంతో అధికార యంత్రాంగం అందులో బిజీ అయి ఈ సమస్యను పట్టించుకోవటం మానేసిందని ఆయన వివరించారు. దీనితో పాటు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు చిన్నారుల్లో అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయన్నారు. దోమల నివారణ, చిన్నారులకు వ్యాధి నిరోధక ఇంజక్షన్ల వంటి చర్యలు సకాలంలో చేపట్టటం లేదని, ఆస్పత్రిలో పేషెంట్లు కిక్కిరిసి పోతుండటంతో ఒక బెడ్‌పై ముగ్గురు నుండి నలుగురు చిన్నారులను సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన వివరించారు.

సెప్టెంబర్ 27న నిర్మాణ కార్మికుల 'డిమాండ్స్ డే'

ఆ మొత్తాన్ని నిర్మాణ రంగ కార్మికుల పిల్లల విద్య, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్యం తదితర సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ బెల్ట్ పేరుతో సుప్రీం కోర్టు తీర్పును అడ్డు పెట్టుకుని ప్రభుత్వం మైనింగ్‌ను పూర్తిగా నిలిపివేసిందన్నారు. ఇందువల్ల నిర్మాణ రంగం సహా, రియల్ ఎస్టేట్ రంగం కూడా దెబ్బతింటోందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం మైనింగ్‌కు అనుమతులివ్వాలని కోరారు. నిర్మాణ రంగ మెటీరియల్‌పై జిఎస్టీ వల్ల భారం పెరిగిందని, ప్రభుత్వం ఆ భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు పేరును రాష్ట్ర ప్రభుత్వాల నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వారి పేర్లను పెట్టుకోవడాన్ని ఆయన ఖండించారు. సంక్షేమ బోర్డు నిధులను పక్కకు మళ్ళిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో నవంబర్ 9 నుంచి 11 వరకు బిఎమ్ఎస్ మినహా అన్ని ట్రేడ్ యూనియన్లు పాల్గొనే ' మహా పడావో ' కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుంచి నిర్మాణ రంగ కార్మికులు వేల సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్. సింగారవేలు మాట్లాడుతూ కార్మికులు తమ హక్కులను కోల్పోయేలా చట్టాల్లో తీసుకొస్తున్న మార్పులను వ్యతిరేకించాలని సూచించారు. కార్మికుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు మత ఘర్షణల చిచ్చు పెడుతున్నారని, వీటిని తిప్పికొట్టి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి. ఉమామహేశ్వరరావు, సి. నర్సింహరావు సమావేశంలో పాల్గొన్నారు.

నిరుటి కంటే తగ్గిన సాగు

- **ఆగస్టు ముగిసినా పుంజుకోని సేద్యం**
- **ఇంకా ఖరీఫ్‌కు గడువు నెల రోజులే**

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

మరో నెల రోజుల్లో ఖరీఫ్ ముగుస్తుండగా వివిధ పంటల సాగులో ఆశించినంత పురోగతి లేదు. గడచిన పది రోజుల్లో అడపాదడపా కురిసిన వర్షాలు ఇప్పటికే సాగు చేసిన పంటలకు కొంత ఉపశమనం కల్గించగా కొత్తగా పంటలు సేద్యం చేసేందుకు అనుకూలించే స్థాయిలో లేవు. ఆగస్టు 30 వరకు చూసుకుంటే ఇప్పటికి సాధారణంగా సాగు కావాల్సిన విస్తీర్ణంలో రెండున్నర లక్షల హెక్టార్లు తగ్గింది. సీజను ప్రారంభం నుంచీ సాగు తగ్గుదల కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉండగా ఖరీఫ్ సాగుపై బుధవారం వ్యవసాయశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం నిరుటి కంటే కూడా ఈ సంవత్సతరం సేద్యం తగ్గింది. గతేడాది ఆగస్టు 30 నాటికి పంటలన్నీ కలుపుకొని 31.64 లక్షల హెక్టార్లలో సాగు కాగా ఈ ఏట ఇదే సమయానికి 29.07 లక్షల హెక్టార్లలో సాగయ్యాయి. నిరుటి మీద ఈ సంవత్సరం వర్షాలు కొంత మెరుగ్గా పడినా సాగు తగ్గడం విశేషం. నిరుడు జూన్‌లో సాధారణ వర్షపాతం కంటే 69 శాతం అధికంగా నమోదు కాగా ఈ సంవత్సరం 30.7 శాతం అధిక వర్షపాతం రికార్డయింది. జులైలో నిరుడు 19 శాతం లోటు వర్షం నమోదు కాగా ఈ ఏట 24 శాతం లోటు వర్షం రికార్డయింది. ఆగస్టులో నిరుడు 44 శాతం తక్కువ వర్షం కురవగా ఈ ఏడాది 18 శాతం అధిక వర్షం కురిసింది. మొత్తంగా మూడు నెల్ల మీద నిరుడు 8.5 శాతం తక్కువ వర్షం పడగా ఈ సంవత్సరం 5 శాతం అధిక వర్షం పడింది. మరోవైపు జూన్ ఫస్ట్ నుంచి గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల చేశారు. తదుపరి గోదావరికి వరద రావడంతో పట్టిసీమ ద్వారా జూన్ నెలాఖరి నుంచి కృష్ణా డెల్టాకు నీరివ్వడం మొదలుపెట్టారు. ఇంతా చేసినా వరి నాట్లు నిరుటి మీద సుమారు 80 వేల హెక్టార్లలోనే పెరిగాయి. చిరుధాన్యాలు, పప్పులు, ఆహారధాన్యాలు, వేరుశనగ సహా నూనెగింజలు, ఇలా అన్ని పంటల సాగు నిరుటి కంటే ఈ సంవత్సరం తగ్గింది. నాగార్జునసాగర్, కెసి కెనాల్, సోమశిల ఆయకట్టు, ఇంకా పలు మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టుల కింద ఆయకట్టులో నీటి లభ్యత లేక వరి సాగు నిలిచిపోయింది. దీంతో చివరికొచ్చేసరికి వరి సేద్యం నిరుటి కంటే కూడా తగ్గే అవకాశాలున్నాయి. సెప్టెంబర్‌లో వర్షాలు వెనుకపట్టుపడతాయని ఇస్రో సర్కారుకు సూచించింది. ఎలాగూ శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీళ్లు లేవు. ఎగువ నుంచి వస్తాయన్న ఆశ లేదు. ఈ నేపథ్యంలో గోదావరికి వరద తగ్గితే పట్టిసీమ వట్టిపోయే ప్రమాదం ఉంది. కృష్ణా డెల్టాలో వరిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గోదావరి డెల్టాకూ నీటి సమస్య రావచ్చని ప్రభుత్వం అంచనా వేసింది.

పంటల సాగు (లక్షల హెక్టార్లలో)

పంట	2016 ఆగస్టు 30కి సాగు	2017 ఆగస్టు 30కి సాగు
వరి	10.81	11.62
చిరుధాన్యాలు	1.63	1.52
పప్పులు	3.48	2.52
ఆహారధాన్యాలు	15.92	15.67
వేరుశనగ	9.18	5.88
నూనెగింజలు	9.86	6.22
పత్తి	3.88	5.44
మొత్తం పంటలు	31.64	29.07

ఒలింపిక్ సంఘం ఎన్నికల రికార్డులివ్వండి

2016లో రిజిస్ట్రేషన్ చేస్తే 2015లో ఎన్నికలెలా నిర్వహిస్తారు..?

ఒలింపిక్ సంఘానికి హైకోర్టు సూటి ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్

ఏపీ ఒలింపిక్ సంఘం రిజిస్ట్రేషన్ 2016లో జరిగితే...2015లో ఎన్నికలు ఎలా జరుగుతాయని ఉమ్మడి హైకోర్టు ఆ సంఘ కార్యదర్శిని నిలదీసింది. ఎన్నికల రికార్డులన్నింటినీ తమ ముందుంచాలని కార్యదర్శిని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్‌రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ సారథ్యంలోని ఏపీ ఒలింపిక్ సంఘమే అసలైనదిగా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) గుర్తించడాన్ని అనంతపురం ఎంపీ జేసీ కుమారుడు, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘ ప్రధాన కార్యదర్శి పవన్‌రెడ్డి సవాల్ చేసిన కేసును హైకోర్టు విచారించింది. ఐఓఏ 2015 ఏప్రిల్ నెలలో జారీ చేసిన రెండు ప్రొసీడింగ్స్ నిలిపివేయాలంటూ కృష్ణా జిల్లా ఒలింపిక్ సంఘం దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కూడా బెంచ్ విచారించింది. గల్లా జయదేవ్ కంపెనీలో ఐఓఏ అధ్యక్షుడు రామచంద్రన్ కుమారుడు డైరెక్టర్ కావడం వల్లే ఎంపీ గల్లా జయదేవ్ అధ్యక్షతన ఉన్న సంఘానికి గుర్తింపు ఇచ్చేశారని, పేపర్లకే పరిమితమైన సంఘాన్నే నిజమైనదిగా చేసే ప్రయత్నాల్ని అడ్డుకోవాలని జేపీ పవన్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదించారు. తమదే అసలైన సంఘమని, పిటిషనర్ ఆరోపణల్లో నిజం లేదని గల్లా జయదేవ్ సారథ్యంలోని సంఘం తరఫు న్యాయవాది బదులిచ్చారు. ఎన్నికలు జరిగినప్పుడు ఐఓఏ నుంచి అబ్జర్వర్ వచ్చారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండు తెలుగు రాష్ట్రాలకు విడివిడి సంఘాల్ని చేసి ఎన్నికలు నిర్వహించమంటే ఏపీకి మాత్రమే ఎందుకు ఎన్నికలు జరిపారని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల రికార్డుల్ని తమ ముందుంచాలని ఆదేశించిన బెంచ్ విచారణ వచ్చే సెప్టెంబర్ 5కి వాయిదా వేసింది.

ఇంధన రంగంలో ఐటి ఆధారిత వెబ్‌టూల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : ఇంధన రంగాల్లో సాంకేతికత వినియోగానికి ఐటి ఆధారిత వెబ్‌టూల్‌ను వినియోగించనున్నట్లు ఇంధన శాఖ ప్రభుత్వ సలహాదారు కె.రంగనాథం తెలిపారు. విజయవాడలోని విద్యుత్తు సౌధలో 'స్టేట్ లెవర్ ఎనర్జీ కాలెక్యులేటర్ డెవలప్‌మెంట్'పై వర్కుషాపును బుధవారం నిర్వహించారు. 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కాలెక్యులేటర్-2050' పేరుతో సిఐఎఫ్ సంస్థ ఐటి ఆధారిత వెబ్‌టూల్‌ను రూపొందిస్తోందని రంగనాథం పేర్కొన్నారు.

జోన్ల వారీగా రాజధాని అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

సిఎం పలు నిర్ణయాలు తీసుకున్నారు. పట్టణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల అభివృద్ధి చేపట్టాలని ఆదేశించారు. ఈ గ్రామాల్లో పరిశుభ్రత, రహదారుల నిర్మాణం వంటి వసతుల కల్పన కోసం ఉపాధి నిధుల్ని వినియోగించాలని సూచించారు. న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల భవనాలు, ఇతర పౌర నివాస సముదాయాలను రూ.1.47 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు సిఎంకు వివరించారు. ఈ నిర్మాణాలను మూడేళ్ళలో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని దీనికి రూ.11,602 కోట్ల వ్యయమవుతుందని చెప్పారు. శాఖమూరులో ఏర్పాటు చేయనున్న పార్కు నమూనాలపై సమావేశంలో చర్చకు వచ్చింది. 280 ఎకరాలలో నిర్మించే ఈ పార్కును ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని అధికారులకు సిఎం సూచించారు. సీడ్ యాక్సెస్ రోడ్లకు ఇరువైపులా, శాఖమూరు పార్కులోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని సెప్టెంబరు రెండో వారంలో చేపట్టాలన్నారు. అక్షరధామ్ నిర్మాణానికి నదీముఖంగా 30 ఎకరాలు కేటాయించాలని నిర్వాహకులు కోరినట్లు అధికారులు సిఎంకు తెలిపారు. అమెరికాలో అక్షరధామ్ నిర్మాణం పూర్తయ్యాక అమరావతిలో నిర్మాణాన్ని ప్రారంభిస్తారన్నారు. రాజధాని ప్రాంతంలో 10 హోటళ్లు త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నాయని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ విద్యాసంస్థలు అమరావతిలో తమ సంస్థలను నెలకొల్పేందుకు వచ్చే నెలలో ఒప్పందాలు చేసుకోనున్నాయని అధికారులు చెప్పారు. మరోవైపు విజయవాడలోని రాజీవ్‌గాంధీ పార్కుతో సహా ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, ఇంద్రకీలాద్రి తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సిఎం ఆదేశించారు. కనకదుర్గమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడం, కేశఖండన శాల, క్యూలైన్ల ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు.

25 కస్తూర్బాల్లో ఇంటర్: మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 25 కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) ఇంటర్ విద్యను ప్రారంభించనున్నట్లు మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ ఏడాది నుంచే వాటిలో ప్రవేశాలు పొందవచ్చని ఆయన అన్నారు. విద్యాలయాల్లో చదువుతోపాటు ఫిజికల్ లిటరసీపై దష్టి సారించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి కేజీబీవీకి 5 కంప్యూటర్లు అందజేస్తున్నామన్నారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం ఆయన సర్వశిక్షాభియాన్ పిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం నిధులను పూర్తిస్థాయిలో అందిస్తున్నా ఇంకా కొన్ని లోపాలు ఉంటున్నాయన్నారు. అలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని పిఓలకు మంత్రి సూచించారు. తనిఖీలు చేసి సదుపాయాల కొరత ఉంటే పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతుల కోసం యాన్యుటీ ప్రతిపాదికన రూ.4,848 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. ప్రహరీ గోడలు, భవన నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులు వెచ్చించాలన్నారు. కొన్ని చోట్ల మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తోందన్న విషయం తనిఖీల్లోనూ వెల్లడైందన్నారు. తరచూ తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఖరీదైన కార్లు.. కాస్మెటిక్స్..

గుర్మీత్ లైఫ్ స్టయిలే డిఫరెంట్

చండీగఢ్: లగ్జరీ కార్లలో ప్రయాణం.. కాస్మెటిక్స్ అంటే ఎనలేని పిచ్చి.. వీఐపీ గదుల్లో ఉండే వస్తువులన్నీ బంగారంతో చేసినవే.. ఆ గదుల్లోకి కోరుకున్న వారు తప్ప వేరొకరు ప్రవేశించడానికి వీల్లేదు. ఇదీ డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ లైఫ్ స్టైల్.. ఇద్దరు సాధ్వి(భక్తురాలు)లపై లైంగికదాడి కేసులో గుర్మీత్‌కు సీబీఐ కోర్టు సోమవారం 20 ఏండ్ల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. గుర్మీత్ దోషిగా తేలగానే హర్యానాలోని డేరా కేంద్రాలను ఖాళీ చేయించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే గుర్మీత్ రాసలీలలు, అక్రమాలు, అరాచకాలు, దుర్మార్గాలు.. ఒకొక్కక్కటిగా వెలుగులోకొస్తున్నాయి. ఇప్పటికే దాదాపు 100 డేరా ఆశ్రమాలను పోలీసులు ఖాళీ చేయించారు,. పంచకుల సెక్టార్ 23 డేరాలో గుర్మీత్ కల్పించుకున్న సదుపాయాలను చూసి పోలీసులు సైతం విస్తుపోయారు. డేరా లోపల ఆయనకంటూ కొన్ని ప్రత్యేక గదులు నిర్మించుకున్నాడని, దానిలోకి కోరుకున్న వారినే అనుమతించేవారిని దర్యాప్తులో వెల్లడైంది. డేరాలో పెద్ద సంఖ్యలో ఐరన్ రాడ్స్, కర్రలు, పెట్రోల్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాస్మెటిక్స్ అంటే గుర్మీత్ ఎంతో ఇష్టమని పలువురు స్థానికులు చెబుతున్నారు.



మహేష్ బాబు

స్పోర్ట్స్‌తో ప్రేమలో పడ్డా

"నేను స్పోర్ట్స్‌తో ప్రేమలో పడ్డా. ప్రతి రోజూ బ్యాడ్మింటన్ ప్రాక్టీస్ చేస్తున్నా. అక్కడ చిన్నారులు ఆడుతున్న తీరు చాలా అద్భుతంగానూ, స్ఫూర్తివంతంగానూ ఉంటుంది. ఆ ఆట నాకు పాఠాలుగా ఉపయోగపడుతుంది. నేను శారీకంగా ఫిట్‌గా ఉన్నా..ఇక మానసికంగా దృఢంగా కావాలి. ఈ పాత్ర నాకు ఓ ఛాలెంజింగ్" అని శ్రద్ధా కపూర్ చెబుతుంది. ఇదంతా ఎందుకంటే... శ్రద్ధా ఇప్పుడు బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ పాత్ర పోషించబోతుంది. సైనా జీవిత కథ ఆధారంగా ఈ స్పోర్ట్స్ చిత్రం రూపొందించేందుకు దర్శకుడు అమోల్ గుప్తా సన్నాహాలు చేస్తున్నాడు. ఆ పాత్రలో శ్రద్ధా మెప్పించేందుకు బ్యాడ్మింటన్ ప్రతి రోజూ ప్రాక్టీస్ చేస్తోంది. ఇప్పుడు ఆ ఆటతోనే ప్రేమలో పడిపోయిందట. ఇది మాత్రమే కాదు శ్రద్ధ స్వయంగా సైనా వెంటే ఉండి ఆమె ఆట తీరును నిశితంగా గమనిస్తోందట. ఆమె ఫీడ్ బ్యాక్‌ను తీసుకుంటుందట. " సైనా చెప్పే సూచనలను తీసుకుంటున్నా. బ్యాడ్మింటన్‌కు సంబంధించిన నోట్స్‌ను ఒకరికొకరం ఎక్స్ఛేంజ్ చేసుకుంటున్నాం. నేను ప్రాక్టీస్ చేసిన సెషన్స్‌కు సంబంధించిన వీడియోస్‌ను సైనాతో షేర్ చేసుకుంటున్నా. వాటిపై తన ఫీడ్‌బ్యాక్ ఇస్తుంది. నేనింకా ఎలా బెటర్‌గా ఆడగలనో నిరంతరం చెబుతూనే ఉంటుంది" అని శ్రద్ధా కపూర్ చెప్పింది.



శ్రద్ధా కపూర్

ఆడియో వేడుక రద్దు

3న నేరుగా మార్కెట్‌లోకి 'జై లవ కుశ ' గీతాలు

10న గ్రాండ్‌గా టీజర్ ఆవిష్కరణ

ఎన్టీఆర్ కథానాయకుడిగా చేస్తోన్న 'జై లవ కుశ' ఆడియో వేడుకను ఈనెల మూడో తేదీన ఆర్భాటంగా నిర్వహించాలని చిత్రబృందం మొదట భావించింది. కానీ ఆ వేడుకను వాయిదా వేసుకుంది. అనుకున్న రోజే ఎటువంటి ఆర్భాటం లేకుండా నేరుగా ఈ చిత్రం ఆడియో మార్కెట్‌లోకి విడుదల చేయబోతున్నారు. ప్రస్తుతం నెలకొన్న భారీ వర్షాలు, మరో పక్క వినాయక నిమజ్జనాల్లో పోలీస శాఖ నిమనగ్నమై ఉండడంతో అభిమానుల భద్రత దృష్ట్యా ఈ వేడుకను రద్దు చేశారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చిన ఆడియోను నేరుగా మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్టు చిత్రబృందం బుధవారం ప్రకటించింది. వచ్చే నెల 10న హైదరాబాద్‌లో అభిమానుల మధ్య, ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన రాశీ ఖనా, నివేదా థామస్ కథానాయికలుగా చేస్తున్నారు. చోటా కె నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్ రామ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కె.ఎస్. రవీంద్ర(బాబీ) దర్శకత్వం వహిస్తున్నాడు.



ఎన్టీఆర్

ఇక ఖద్దరు దుస్తుల్లోనే

మహేష్ బాబు కొరటాల కాంబినేషన్‌లో వచ్చిన 'శ్రీమంతుడు' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు మరో సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసింది. ఆ చిత్రమే 'భరత్ అనే నేను'. ఈ సినిమా మొత్తం రాజకీయ నేపథ్యంలో ఉంటుంది. మహేష్ బాబు రాజకీయ నాయకుడిగా ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నాడు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చేనెల మొదటి వారం నుంచి భారీ షెడ్యూల్‌ను ఉండబోతుంది. మొత్తం 40 రోజులు పాటు చిత్రీకరణ జరపనున్నారు. దీని కోసం భారీ సెట్‌ను నిర్మించారు. అదే అసెంబ్లీ. 40 రోజులు పాటు ఈ సెట్‌లోనే చిత్రీకరణ ఉంటుందంటే మొత్తం సినిమాలో సగ భాగం ఇక్కడే ఉంటుందని సమాచారం. వచ్చే నెల నుంచి మహేష్ బాబు ఖద్దరు దుస్తులతో చిత్రీకరణకు హాజరుకానున్నాడు. ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య నిర్మిస్తున్నాడు. కైరా అద్వానీ కథానాయికగా చేస్తోంది. దేవిశ్రీప్రసాద్ బాణీలు సమకూరుస్తున్నాడు.

ఒకే బ్యానర్‌లో ఇద్దరు సినిమాలు



శర్వానంద్



నాగచైతన్య

చిన్న సినిమాలతో ట్రెండ్ సృష్టించిన దర్శకుడు మారుతి. ఆయన చేసిన 'బస్టాప్, ఈ రోజుల్లో' సినిమాలు చిన్న సినిమాలుగా వచ్చి పెద్ద విజయాలను అందుకున్నాయి. ఆ తర్వాత నానితో 'భలే భలే మగాడివోయ్' తీసి భారీ బ్లాక్ బస్టర్‌ను అందుకున్నారు. ప్రస్తుతం శర్వానంద్‌తో ఆయన చేస్తున్న 'మహానుభావుడు' షూటింగ్ దశలో ఉంది. స్వామి రారా, దోచేయ్, కేశవ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సుధీర్ వర్మ ...ఈ ఇద్దరు దర్శకులు సితార ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌లో త్వరలో సినిమాలు చేస్తున్నారు. మారుతి దర్శకత్వంలో అక్కినేని నాగచైతన్య చిత్రం, శర్వానంద్ హీరోగా సుధీర్ వర్మ సినిమా రూపొందనున్నాయి. ఈ విషయాన్ని నిర్మాత సూర్య దేవర నాగ వంశీ బుధవారం తెలిపారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థకు తల్లి సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధినేత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) గురువారం జన్మదినోత్సావాన్ని పురస్కరించుకుని నిన్న ఈ వివరాలను తెలిపారు.

'2ఫ్రెండ్స్' ప్రేమకథ



స్నిగ్ధ, సూరజ్

ప్రేమ, స్నేహం నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం '2ఫ్రెండ్స్' (ట్రూ లవ్). శ్రీనివాస్ జిఎల్‌బి దర్శకత్వంలో ముళ్లగూరు లక్ష్మీదేవి సమర్పణలో ముల్లగూరు అనంతరాముడు, ముళ్లగూరు రమేష్‌నాయుడు నిర్మిస్తున్నారు. సూరజ్ హీరోగా రవీంద్రతేజ, సానియా, స్నిగ్ధ, కార్తీక్, సారా, ధనరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే బెంగుళూరు, వరంగల్, అనంతపురంలో షూటింగ్ చేశారు. రెండు పాటల చిత్రీకరించారు. తాజాగా కర్నాటకలోని మడకశిర లొకేషన్‌లో కీలక సన్నివేశాలను, రెండు పాటలను చిత్రీకరించారు. ఈ నెలఖరు నుంచి జరిగే తదుపరి షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుందని దర్శకుడు తెలిపారు.

నేటి యువత ఎన్నో అద్భుతాలు సృష్టిస్తోంది. కాలేజీ రోజుల్లోనే యువతకు భవిష్యత్ నిర్దేశకత్వం అవుతుంది. ప్రేమకంటే స్నేహం గొప్పదనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోందని నిర్మాత అనంతరాముడు తెలిపారు. మా సంస్థలో ఇది తొలి చిత్రమనీ, కేవలం వినోదమే కాకుండా అంతర్లీనంగా సందేశం ఇచ్చే విదంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సురేందర్ రెడ్డి, కథ, మాటలు, సంగీతం: ఘటికా చలం.

అంతటా అంతేగా..!



ఇలియానా

తాప్సీ తన తొలి సినిమా 'ఝుమ్మంది నాదం'లో బొడ్డుపై కొబ్బరికాయలు, పళ్లు వేసి చిత్రీకరించడంపై కొన్ని వ్యాఖ్యలు చేసింది. మహిళలను తక్కువ చేసి చూస్తున్నారని పేర్కొంది. ఇది దక్షిణ భారతదేశ చిత్ర సీమలో ఎక్కువగా ఉందని ప్రచారమవుతుంది. దీనిపై ఇలియానా మాట్లాడుతూ "హీరోయిన్లను తక్కువ చేసి చూడడం ఒక్క దక్షిణాది చిత్రసీమలోనే కాదు...అంతటా అలాగే ఉంది కదా. బాలీవుడ్‌లో కూడా ఆ తరహాలోనే చూస్తున్నారు. మహిళల ప్రాధాన్య పాత్రల కంటే ఎక్స్‌పోజింగ్ చేసి చూపించే పాత్రలకే దర్శకులు ప్రాధాన్యమిస్తున్నారు. నేనైతే ఆ తరహా కథలు ఉన్న వాటిల్లో నటించడానికి అంగీకరించడం లేదు. మంచి గ్లామర్ థీమ్ ఉన్న వాటినే చేయడానికి ఒకే చేస్తున్నా" అని చెప్పింది. ఇటీవల ఆమె మాట్లాడుతూ సహజీవనానికి, పెళ్లికి పెద్దగా తేడా లేదని కూడా వ్యాఖ్యానించింది.

పొల్లాచ్చిలో పోరాటం



బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే

'డిక్టేటర్' తర్వాత శ్రీవాస్ దర్శకత్వంలో మరో సినిమా రూపొందుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే హీరో హీరోయిన్లుగా చేస్తున్నారు. ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ఇటీవలే ఫిలిమ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో ఒక షెడ్యూల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తర్వాత షెడ్యూల్ కోసం త్వరలో తమిళనాడులోని పొల్లాచ్చికి వెళ్లనున్నారు. అక్కడ ఒక పల్లెటూరి సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రించేందుకు చిత్ర బందం సన్నాహాలు చేస్తోంది. ఈ షెడ్యూల్ 15 రోజులు పాటు జరగనుంది. అందుకోసం విండ్ టర్బైన్స్‌తో కలిపి ఓ భారీ సెట్‌ను రూపొందించారు. పీటర్ హెయిన్స్ నేతత్వంలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ప్లాన్ చేశారు. 'శ్రీవాస్ చాలా సమయం వెచ్చించి ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు, తెలుగులో ఇది చాలా డిఫరెంట్ మూవీగా నిలిచిపోతుంది. దాదాపు నలభై శాతం చిత్రీకరణ పూర్తయింది' అని అభిషేక్ నామా అన్నారు. ఈ చిత్రానికి కళ : ఎ.ఎస్.ప్రకాష్, కూర్పు : కోటగిరి వెంకటేశ్వర్రావు, సినిమాటోగ్రఫీ : ఆర్థర్ ఎ.విల్సన్, మాటలు : సాయిమాధవ్ బుర్రా, యాక్షన్ : పీటర్ హైన్స్, సంగీతం : దేవిశ్రీప్రసాద్.

హిజ్రాల గురించి తెలియని రహస్యం

ధర్మశ్రీ ఎంటర్ ప్రైజెస్ పతాకంపై శ్రీ మురళి, రచితారామ్ జంటగా నటించిన కన్నడ చిత్రం 'రథావరం'. మంజునాథ్.ఎన్ నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో అదే పేరుతో అనువదిస్తున్నారు. 'ది అల్టిమేట్ వారియర్' అనేది క్యాప్షన్. చంద్రశేఖర్ బండియప్ప దర్శకుడు. రవిశంకర్ విలన్ పాత్రలోనూ, చరణ్ రాజ్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గానూ చేశారు.

నిర్మాత మంజునాథ్.ఎన్ మాట్లాడుతూ 'కన్నడలో భారీ వసూళు రాబట్టిన ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నాం. 'రథావరం' అంటే నమ్మిన బంటు అని అర్థం. తెలుగు నేటివిటీకి తగిన విధంగా సెకండాఫ్‌లో కొన్ని మార్పులు చేసి విడుదల చేస్తున్నాం. ఇందులో మూడు గీతాలు ఉన్నాయి. ఇటీవల పాటలు మార్కెట్‌లోకి విడుదల చేశాం. ఆడియో సక్సెస్ అయింది. హిజ్రాల గురించి ఎవరికీ తెలియని ఒక రహస్యాన్ని మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం. ఈ సినిమా చూస్తే థర్డ్ జెండర్ గొప్పతనం ఏంటో అర్థమవుతుంది. పొలిటికల్ బ్యాక్ డ్రాప్‌లో నడిచే యాక్షన్ లవ్ స్టోరీ. ఈ శుక్రవారమే విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.



శ్రీమురళి, రచితారామ్




విజయ్ బర్సేగా అమితాబ్

నాగ్‌పూర్‌లోని మురికివాడల్లో నివసించే పిల్లల కోసం ఓ ఎన్జీవో ఏర్పాటు చేసి వారికి సాకర్ ఆట నేర్పించిన విజయ్ బర్సే ఇదంతా పదేళ్ల క్రితం జరిగింది. ఆయన పేరు అప్పట్లో మారుమోగింది. ఈయ. జీవిత కథ ఆధారంగా ఓ సినిమా తీయబోతున్నాడు దర్శకుడు నాగరాజ్ మంజులే. ఈయన గతంలో 'సైరాట్' తీశారు. బర్సే పాత్రలో బిగ్ బీ అమితాబ్ బచ్చన్ నటిస్తున్నాడు. ఈ సినిమా కోసం దాదాపు రెండేళ్ల పాటు మంజులే స్క్రిప్ట్ రాశారట. తనకు అమితాబ్ అంటే చిన్నప్పటి నుంచి చాలా ఇష్టమని ఏ స్క్రిప్ట్ రాయాలన్నా ఆయన్ని దృష్టిలో పెట్టుకునే రాస్తుంటానని మంజులే అన్నారు. చిన్నప్పుడు స్కూల్‌కి వెళ్లేటప్పుడు కూడా అమితాబ్‌లా చొక్కాను పక్కకు ముడివేసుకుని వెళ్లేవాడినని.. అదిచూసి టీచర్లు బయట నిలబెట్టేవారని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు మంజులే.



సైటెక్
Science & Technology

శాస్త్రవేత్తలంటే ఎవరు?



ప్రశ్న : ప్రకృతి సూత్రాల ఆవిష్కర్తలా లేక సాంకేతిక పరికరాల రూపకర్తలా, శాస్త్రవేత్తలంటే ఎవరు?
– ఎ.భరత్, పొదలకూరు, నెల్లూరు

జవాబు : నిర్దిష్ట నియమాల ప్రకారం విశ్వంలోను, చుట్టుప్రక్కల ఉన్న భౌతిక ప్రపంచంలోను సంఘటనలు, దృగ్విషయాలు సంభవిస్తున్నాయి. వీటిని ప్రకృతి నియమాలు లేదా ప్రకృతి సూత్రాలు అంటాము. ఉదాహరణకు ద్రవ్యరాశులున్న రెండు వస్తువుల మధ్య గురుత్వాకర్షక బలం వుంది అనడం ఓ ప్రకృతి నియమం. నీరు గది ఉష్ణోగ్రత దగ్గర



వాయురూపంలో కాకుండా ద్రవ రూపంలో వుండటానికి కారణం నీటి అణువుల మధ్య హైడ్రోజన్ బంధం వుండడమే కారణం అనేది మరో నియమం. చంద్రుడు భూమికి ఉపగ్రహమనడం కూడా ఓ ప్రకృతి సత్యం. సూర్య గ్రహణం రావడానికి కారణం సూర్యుడికి, భూమికి మధ్య నిర్ణీత ఖగోళ సందర్భంలో రావడమే ననడం కూడా ప్రకృతి సూత్రం. కేవలం సత్యాలు మాత్రమే ప్రకృతి ధర్మాలు కావు. నిషిద్ధాలు కూడా ప్రకృతి ధర్మాలే. ఈ విశాల విశ్వంలో ఏ సంఘటనలలోను శక్తి–ద్రవ్యరాశిని ఎవరూ శూన్యం నుంచి సృష్టించలేరు లేదా ఉన్నదాన్ని మాయం చేయలేరు అనడం కూడా ప్రకృతి సూత్రమే. సూర్యగ్రహణం, చంద్రగ్రహణం రావడానికి కారణం రాహువు కేతువులనే పాములు మింగడమేననడం అశాస్త్రీయం అనడం కూడా ప్రకృతి ధర్మం. నక్షత్ర రాశుల ప్రభావం మనుషుల మీద ఉందనే నమ్మకంతో ఏర్పడిన జ్యోతిష్యశాస్త్రం శుద్ధ తప్పు అనడం కూడా వైజ్ఞానిక సూత్రమే! DNA జీవాణు శృంఖలం (Biopolymer) లేకుండా ఏ జీవీ లేదు అనడం కూడా ఓ సూత్రం. ఇలాంటి ఎన్నో వందల నియమాలను, సూత్రాలను మానవ మేధస్సు, జనబాహుళ్యపు శ్రామిక శక్తి, బతుకుదెరువు కోసం ప్రకృతితో జరిగిన ఘర్షణ, మానవుడి సహజ కుతూహలం, ప్రశ్నించేతత్వం ఆవిష్కరించాయి. ముందుభాగాన ఉండి ధైర్యంగా, శ్రమ ఫలితంగా జలాంటి సూత్రాలను బయల్పరిచిన వ్యక్తి లేదా వ్యక్తుల సమూహంలోని వ్యక్తులు అందరూ శాస్త్రవేత్తలే. అలాగే మనిషి శ్రమను తగ్గించి మానవ సామాజిక, దైనందిన కార్యకలాపాలను సులభతరం చేయడానికి ఎన్నో పరికరాలు, పద్ధతులు రూపొందించబడ్డాయి.



గడియారాలు, గుండుసూదులు, ఇంజన్లు, పిన్నీసులు, విమానాలు, కాగితాలు, సైకిళ్లు, కంప్యూటర్లు, పారలు పలుగులు, సుత్తీ కొడవళ్లు, ఇళ్లు, రోడ్లు, సెల్‌ఫోన్లు, పెన్నులు గన్నులు, బాంబులు, చెంబులు, కడవలు, పడవలు, మేకులు, మైకులు మొదలైనవెన్నో రకాల పాదార్థిక వస్తు పరికరాలు సాధనాలతోపాటు రోగనివారణ మందులు చికిత్సా పద్ధతులు మానవ బాహుళ్యం కాలక్రమేణా సాధించుకుంది. ఇలాంటి పదార్థాలు, పరికరాల రూపకర్తలు కూడా శాస్త్రవేత్తలే! కానీ శాస్త్రవేత్తలు మానవాతీతులనీ, పూర్వజన్మసుకృతులనీ, ప్రజాబాహుళ్యపు ఆవల వుంటారని భావించకూడదు. మానవ శ్రమే శాస్త్రవేత్తకు ఊతం. సమాజంలేని శాస్త్ర సాంకేతికత లేదు.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com

గూగుల్ తెచ్చిన ఇన్‌స్టెంట్ యాప్స్



స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం పెరుగుతున్న కొద్దీ... అవసరమైన కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడమూ పెరుగుతుంది. అయితే కొన్నింటికి మాత్రం మాత్రం కచ్చితంగా యాప్‌లు ఉండాల్సిందే. అలాగని అవసరమైన అన్ని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటూపోతే ఫోన్ నిండిపోతుంది. ఈ తరహా అవసరాలను గుర్తించిన గూగుల్... ఆండ్రాయిడ్ ఇన్‌స్టెంట్ యాప్స్ పేరుతో సరికొత్త సదుపాయాన్ని గూగుల్ సంస్థ ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. గూగుల్ డెవలప్ చేసిన ఈ సర్వీసును తొలిగా గూగుల్ I/O 2016 డెవలపర్స్ కాన్ఫరెన్స్‌లో ప్రకటించినప్పటికి ఈ ప్రక్రియ మొదట నత్తనడకన సాగింది. అనేక టెస్టింగ్స్, అప్‌డేట్స్ అనంతరం ఈ సర్వీసును జూన్‌లో నిర్వహించిన గూగుల్ I/O 2017 డెవలపర్స్ కాన్ఫరెన్స్‌లో భాగంగా అధికారికంగా విడుదల చేసింది. ఏ యాక్టివిటీకి నిర్వహించడానికైనా 4ఎంబీ కన్నా తక్కువ పరిమాణంలో వుండే ఈ ఇన్‌స్టంట్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. జూన్ నుంచి ఇప్పటి వరకు 50 కోట్ల ఆండ్రాయిడ్ డివైస్‌లకు చేరినట్లు గూగుల్ చెబుతోంది. ఈ యాప్‌లు ఎక్కువగా మార్ష్‌మెలో 6.0 వెర్షన్‌లో లభ్యం అవుతున్నాయి. గూగుల్ ప్లే స్టోర్‌లో కూడా వెతుక్కోవాల్సిన అవసరం లేకుండానే, మనం ఏ వెబ్‌సైట్‌కు వెళితే దానికి సంబంధించిన యాప్‌లు ఆటోమెటిక్‌గా డౌన్‌లోడ్ అయిపోతాయి. దీంతో ప్రతి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవల్సిన అవసరం ఉండదు. ఇదే సమయంలో ఫోన్ ఇంటర్నల్ స్టోరేజ్‌పై కూడా పెద్దగా ప్రభావం ఉండదు. అయితే ముందుగా మీ ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి గూగుల్ ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకున్నట్లయితే అకౌంట్స్, సర్వీసెస్ పేరుతో రెండు విభాగాలు కనిపిస్తాయి. వాటిలో సర్వీసెస్ విభాగంలో కనిపించే Instant Apps ఆప్షన్ పై క్లిక్ చేసి ఆ సర్వీసును ఎనేబుల్ చేసుకున్నట్లయితే ఆండ్రాయిడ్ ఇన్‌స్టెంట్ యాప్స్ సర్వీసు మీ ఫోన్‌లో ఎనేబుల్ అవుతుంది. ప్రస్తుతం అన్ని యాప్స్ Instant App పద్ధతిలో లభించట్లేదనే విషయాన్ని గమనంలో వుంచుకోవాలి.

సెట్టింగ్స్ విధానం :

- సెట్టింగ్స్ ఓపెన్ చేసి గూగుల్ ఇన్ ద పర్సనల్ సెక్షన్‌ను క్లిక్ చేయాలి.
- ఇన్‌స్టంట్ యాప్ అనే ఆప్షన్ కనిపించే వరకు స్క్రాల్ డౌన్ చేస్తూ వెళ్లాలి
- మీకు ఒక చోట గూగుల్ లిస్టెట్ అకౌంట్ కనిపిస్తుంది. మీకు మల్టిపుల్ అకౌంట్స్ ఉంటే ఒక అకౌంట్‌ను సెలక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇన్‌స్టంట్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- నియమ నిబంధనలను చెక్ మార్క్ పెట్టి ఓకే చేసుకుంటే... ఇక ఇన్‌స్టంట్ యాప్‌లను ఉపయోగించేందుకు సిద్ధమైనట్లే.
- మనం వెబ్‌సైట్‌లో వెళ్లి మనకు కావాల్సిన కొన్ని సైట్లు క్లిక్ చేయాలి. కొన్ని సైట్లకు ఇన్‌స్టంట్ ఎక్స్‌టెన్షన్ ఉంటుంది. అంటే ఆ సైట్లకు ఇన్‌స్టంట్ యాప్‌లను వాడే అవకాశం ఉంది.
- ఇన్‌స్టంట్ యాప్‌ను క్లిక్ చేయగానే మీరు ఏ సైట్‌ను వాడాలనుకుంటున్నారో ఆ సైట్‌కు కనెక్ట్ అవుతుంది. ఈ యాప్‌ను ఉపయోగించేటప్పుడు ఒక బ్లూ కలర్ ఐకాన్ కనిపిస్తుంది. ఒకవేళ ఆ యాప్‌లను డిలీట్ చేయాలనుకుంటే... ఆ యాప్‌పై ట్యాప్ చేసి క్లియర్ యాప్ డేటా మీద క్లిక్ చేస్తే సరిపోతుంది. అది డిలీట్ అయిపోతుంది.

యూట్యూబ్... నయా లుక్

YouTube

ప్రముఖ సెర్చింజన్ దిగ్గజం గూగుల్ తన సాఫ్ట్ వేర్లను ఎప్పటికప్పుడు కొత్తగా ఆవిష్కరిస్తూనే వుంటుంది. ఈ క్రమంలో తన నేతృత్వంలోని యూట్యూబ్ ను సరికొత్త హంగులతో మన ముందుకు తీసుకొచ్చింది. లోగోను కొత్తగా డిజైన్ చేయడంతో పాటు తన డెస్క్‌టాప్, మొబైల్ యాప్స్ డిజైన్‌లలో కూడా భారీ మార్పులు చేపట్టింది. గతంలో చిన్నచిన్న మార్పులు చేసినప్పటికీ ఇటీవలకాలంలో యూట్యూబ్ తన లోగోలో చేసిన అతిపెద్ద మార్పు ఇదే. యూట్యూబ్ లోగో లో చేసిన మార్పుల వల్ల వివిధ డివైజ్‌లలోను, చిన్నపాటి స్క్రీన్‌లపైనా మెరుగ్గా కనిపిస్తుందని గూగుల్ చెబుతోంది. డెస్క్‌టాప్ పనితీరు మెరుగ్గా వుండడంతో పాటు వినియోగదార్లకు సరికొత్త అనుభవాన్ని అందించే ప్రయత్నంలో భాగంగా ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో యూట్యూబ్ తన డెస్క్‌టాప్ వెబ్‌సైట్‌లో క్లీనర్ ఇంటర్‌ఫేస్‌తో పాటు రాత్రివేళల్లో వీడియోలు చూసేందుకు డార్క్‌మోడ్ వంటి నూతన ఫీచర్లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

రెడ్‌మి 4ఏలో కొత్త వేరియంట్



షావోమి సంస్థ తన రెడ్‌మి 4ఏ స్మార్ట్‌ఫోన్ కు సంబంధించిన కొత్త వేరియంట్‌ను విడుదల చేసింది. ఒరిజినల్ హ్యాండ్‌సెట్‌కు అదనపు ర్యామ్, స్టోరేజ్‌తో ఈ వేరియంట్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 3జీబీ ర్యామ్, 32జీబీ ఇన్‌బిల్ట్ స్టోరేజ్‌తో కొత్తగా తీసుకొచ్చిన ఈ వేరియంట్ ధర రూ.6,999. ఎంఐ.కామ్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఇండియా, పేటీఎం, టాటాక్లిక్‌లలో నేటి (గురువారం) నుంచి ఈ ఫోన్ విక్రయిస్తుంది. ఈ ఏడాది మార్చిలో రెడ్‌మి 4ఏ స్మార్ట్‌ఫోన్‌ను షావోమి విడుదల చేసిన సంగతి తెలిసిందే. 2జీబీ ర్యామ్, 16జీబీ స్టోరేజ్‌తో దీనిని లాంచ్ చేసినప్పుడు రూ.5,999కు విక్రయించారు. ప్రస్తుతం స్టోరేజ్‌ను, ర్యామ్‌ను మరింత పెంచుతూ కొత్త వేరియంట్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఇక దీని ఫీచర్ల విషయానికొస్తే... హైబ్రిడ్ డ్యూయల్ సిమ్ కార్డు స్లాట్, ఎంఐయూఐ 8 ఆధారిత ఆండ్రాయిడ్ 6.0 మార్ష్‌మాలో, 5 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే, 1.4గిగాహెడ్జ్ క్వాడ్ కోర్ స్నాప్‌డ్రాగన్ 425ఎస్‌ఓసీ, 13 ఎంపీ రియర్ కెమెరా, 5 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 4జీ వాయిస్‌ఓవర్ ఎల్టీఈ, 3120 ఎంఏహెచ్ బ్యాటరీ, ఇన్‌బిల్ట్ స్టోరేజ్‌ను మైక్రోఎస్డీ కార్డు ద్వారా 128జీబీ వరకు పెంచుకునే అవకాశాన్ని కల్పించారు.

విమాన రాకపోకల వివరాలు తెలిపే యాప్

ప్రపంచంలో ఏ విమానం ఎక్కడుందో, ఎంత సేపట్లో గమ్యస్థానం చేరుకుంటుందో తెలుసుకోవడంతో పాటు ప్రస్తుతం విమానాశ్రయంలో వున్న, రాబోయే విమానాల వివరాలు తెలుసుకోడానికి ఓ యాప్ సిద్ధంగా వుంది. flightradar24, flight tracker యాప్‌లలో మీకు కావాల్సిన విమానం నెంబర్ ఇస్తే... దాని ప్రస్తుత స్థితి కనిపిస్తుంది. అది గాలిలో ఎంత ఎత్తులో వుంది, ఎంత వేగంగా ప్రయాణిస్తుందీ, ఇప్పటివరకూ ఎలా ప్రయాణించిందీ వంటి వివరాలు ట్రాక్ ఆప్షన్లో తెలుసుకోవచ్చు. అంతేకాదు ఆ విమానం గత వారం రోజుల్లో ఎలా ప్రయాణించిందీ తెలుసుకోవచ్చు. దీంతోపాటు విమానాశ్రయంలో ప్రస్తుతం ప్రయాణానికి సిద్ధంగా వున్న వాటి గురించీ వివరంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఉప్పలపు శేషనాథ్
పి.నైనవరం, విజయవాడ రూరల్
(ఈమెయిల్ ద్వారా)




మీ చిట్కాలు :

కంప్యూటర్, మొబైల్, యాప్, ఇంటర్నెట్ టెక్నాలజీ వినియోగంలో మీకు మాత్రమే తెలిసిన చిట్కాలను మాకు పంపండి.'సైటెక్' పేజీలో ప్రచురిద్దాం... మన విజ్ఞానాన్ని అందరితో పంచుకుందాం.

పంపించాల్సిన చిరునామా :
సైటెక్ పేజీ, ప్రజాశక్తి
డోర్ నెం: **27-30-4**
ఆకులవారి వీధి, గవర్నర్ పేట
విజయవాడ, కృష్ణాజిల్లా, ఎపి
ఇమెయిల్ : **scitechpage@gmail.com**

తుంటరి చేప

కథ: బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్: 98492 27509)



పొడుపు కథ

పసిడిపెట్టెలో ముత్యపు గింజ..
ఏమిటది ?

(జవాబు తలక్రిందులుగా ముద్రించబడింది)

నవ్వు :


తండ్రి : ఏరా రామూ కుర్చీ తెస్తున్నావు ఎక్కడిది..?
రాము : ఉదయం ఇంటర్వ్యూ కెళ్లానుగా నాన్నా..!
అక్కడి వాళ్లు 'టేక్ యువర్ సీట్' అన్నారు..?
అందుకే తెచ్చేశా!
తండ్రి : ఆ..!



ఉడతలాంటి బుల్లి సింహం

పిల్లికూనలాంటి బుల్లి జీవేదో చెట్లెక్కేసేది. చిటారు కొమ్మన బల్లులు, కప్పలు... లాంటి వాటిని వేటాడి హంఫట్..అనిపించేది. ఇవన్నీ ఒక సింహం గురించంటే నమ్ముతారా? అలాంటి వింతజీవి గురించి ఈ రోజు తెలుసుకుందాం...

ఈ బుల్లి సింహం పేరు డేవిడ్ అటెన్‌బొరోగ్. అవునా? ఎప్పుడూ వినలేదే? అనుకుంటున్నారా? ఎందుకంటే ఇది ఇప్పుడు లేదు. అంతరించిపోయిన జీవుల్లో ఇదీ ఒకటని తెలిసింది. దీనికి బ్రిటన్ ప్రకృతి శాస్త్రవేత్త పేరు మీద అలా నామకరణం చేశారు. దీన్నే మైక్రోలియో అని కూడా పిలుస్తారు. ఆస్ట్రేలియాలోని సౌత్ వేల్స్‌లో తొలుత వీటి శిలాజాల్ని గుర్తించారు. వాటిపై బోలెడు పరీక్షలు చేశాక శాస్త్రవేత్తలకు భలే ఆసక్తికర విషయాలు తెలిశాయి. ఇవి దాదాపు 600 గ్రాముల బరువు మాత్రమే ఉండేవి. అంటే పిల్లి పిల్లంత బరువన్న మాట! కోర పళ్లతో ఉడుతను పోలిన ముఖంతో ఉండేవి. ఆస్ట్రేలియా అటవీ ప్రాంతాల్లో ఇవి దాదాపు కోటీ 80 లక్షల సంవత్సరాల క్రితం తిరుగుతుండేవట. వేడిగా ఉండే ప్రాంతాల్లో జట్లు జట్లుగా చెట్లపైనే జీవించేవి. ఇవి పూర్తిగా మాంసాహారులే. కొమ్మలపై ఉండే చిన్న చిన్న పక్షులు, పురుగులు, తొండల్లాంటి వాటిని ఇవి ఇష్టంగా భోంచేసేవట. మనం చూస్తున్న సింహాల్లా పరిణామం చెందక ముందు తొలినాళ్లల్లో పుట్టిన బుల్లి సింహాలివి. అయితే ఇప్పటి వరకూ కనుగొన్న సింహం జాతుల్లో 600 గ్రాములు మాత్రమే ఉన్న మైక్రోలియోనే అతి చిన్నదన్నమాట! ఇప్పుడు మనం చూసే సింహాలన్నీ దాదాపు 150 నుంచి 230 కిలోల వరకు బరువుంటాయి. ఇది నాలుగడుగుల వరకూ ఎత్తు, 5 నుంచి 8 అడుగుల పొడుగూ పెరుగుతాయి. ★



గుర్తించండి!



పిల్లలూ..! పైనున్న చిత్రంలో మొత్తం తొమ్మిది తేడాలు ఉన్నాయి. అవేంటో గుర్తించండి!

బంగ్లా సంచలనం

- తొలిసారి ఆసీస్‌పై టెస్టు విజయం
- మొదటి టెస్టులో 20 పరుగులతో ఓడిన కంగారూలు
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా షకీబ్ అల్ హసన్



ఢాకా : బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు పెను సంచలనం నమోదు చేసింది. ఆస్ట్రేలియాపై తొలిసారిగా టెస్టు విజయాన్ని అందుకుంది. ఇక్కడ ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో 20 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ విజయాన్ని సాధించింది. 265 పరుగుల లక్ష్యంతో బుధవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 244 పరుగులకే ఆలౌటయింది. ఇంకా ఒక రోజు మిగిలివుండగానే తొలి టెస్టు ముగిసింది. బంగ్లాదేశ్ బౌలర్ షకీబ్ అల్ హసన్ 5 వికెట్లతో ఆసీస్ వెన్ను విరచగా, తైజుల్ ఇస్లామ్ 3 వికెట్లు, మెహిదీ హసన్ మిరాజ్ 2 వికెట్లు సాధించిన బంగ్లావిజయంలో ముఖ్యపాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్‌లోనూ షకీబ్ అల్ హసన్ 5 వికెట్లు సాధించాడు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో షకీబ్ అల్ హసన్ 84 పరుగులు చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్‌ల్లో రాణించిన షకీబ్ అల్ హసన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు. ప్రపంచ టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో షకీబ్ అల్ హసన్‌ను తొలిస్థానంలో వున్న సంగతి తెలిసిందే. ఈ విజయంతో రెండు టెస్టుల ఈ సిరీస్‌లో బంగ్లాదేశ్ 1–0తో ఆధిక్యంలో వుంది. సెప్టెంబర్ 4న చిట్టాంగ్‌లో రెండో టెస్టు ప్రారంభం కానుంది.



రెండు వికెట్ల నష్టానికి 109 పరుగుల ఓవర్‌నైట్ స్కోరును బుధవారం ఆటను కొనసాగించిన ఆస్ట్రేలియాలో ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన దాటిని కొనసాగించాడు. నాలుగోరోజు ఆటలో సెంచరీని కూడా అందుకున్నాడు. అయితే జట్టు స్కోరు 158 పరుగులు వద్ద వార్నర్‌ను షకీబ్ అల్ హసన్ ఎల్‌బిడబ్ల్యూగా అవుట్ చేశాడు. మూడో వికెట్‌గా అవుటైన వార్నర్ 135 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్స్‌తో 112 పరుగులు చేశాడు. ఇప్పటి వరకూ 65 టెస్టులు ఆడిన వార్నర్‌కు ఇది 19వ శతకం. ఈ తరువాత ఆసీస్ కెప్టెన్ స్మిత్ కూడా హసన్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ ముషిఫికర్ రహీమ్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యారు. జట్టు స్కోరు 171 పరుగుల వద్ద నాలుగో వికెట్‌గా అవుటైన స్మిత్ 37 పరుగులు (99 బంతుల్లో మూడు ఫోర్లు) చేశాడు. ఈ తరువాత వచ్చిన బ్యాట్స్‌మెన్లలో క్యుమిన్స్ తప్ప మిగిలిన వారంతా పూర్తిగా నిరాశ పర్చారు. దీంతో 70.5 ఓవర్లలో ఆస్ట్రేలియా 244 పరుగులకు ఆలౌటయింది. క్యుమిన్స్ 33 పరుగుల (55 బంతుల్లో 2 సిక్స్‌లు, 3 ఫోర్లు) నాటౌట్‌గా నిలిచాడు. ఈ టెస్టులో బంగ్లాదేశ్‌లో తన తొలి ఇనింగ్స్‌లో 260 పరుగులకు, రెండో ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు ఆలౌటయింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 217 పరుగులకు ఆలౌటయింది.

ప్రస్తుత ప్రపంచ టెస్టు జట్ల జాబితాలో ఆస్ట్రేలియా నాలుగో స్థానంలో వుండగా, బంగ్లాదేశ్ తొమ్మిదో స్థానంలో వుంది. తదుపరి రెండో టెస్టులో కూడా ఆస్ట్రేలియా ఓడిపోతే ఆ జట్టు ర్యాంక్ ఆరోస్థానానికి దిగజారుతుంది. టెస్టు ర్యాకింగ్స్ ప్రవేశపెట్టిన తరువాత ఇప్పటి వరకూ ఆస్ట్రేలియా అంత తక్కువ ర్యాంక్ పొంద లేదు.

ఆస్ట్రేలియాతో ఇప్పటి వరకూ 4 టెస్టుల్లో ఆడిన బంగ్లాదేశ్‌కు ఇదే తొలి గెలుపు. 2000లో బంగ్లాదేశ్‌కు టెస్టు హోదా వచ్చింది. తన తొలి టెస్టును భారత్‌తో ఆడిన బంగ్లాదేశ్ ఇప్పటి వరకూ 101 టెస్టుల్లో పాల్గొంది. బంగ్లాదేశ్‌కు ఇది 10వ టెస్టు విజయం. తొలిసారిగా జింబాబ్వేపై మ్యాచ్‌లో టెస్టు విజయాన్ని చవిచూసిన బంగ్లాదేశ్ తరువాత వెస్టిండీస్, శ్రీలంకలపై కూడా టెస్టు విజయాన్ని నమోదు చేసుకుంది.

చారిత్రక విజయం సాధించిన బంగ్లాదేశ్ క్రికెట్ జట్టును ఆ దేశ ప్రధాని షేక్ హసీనా అభినందించారు. ఈ విజయాన్ని ఒక గొప్ప అనుభూతిగా అభివర్ణించారు. స్టేడియంలో షేక్ హసీనా ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించారు. గెలుపు అనంతరం ఆటగాళ్ల సంబరంలోనూ హసీనా పాల్గొన్నారు.



అందరి చూపు ధోని వైపు

- 300 వన్డేలో రెండు ప్రపంచ రికార్డుల ముంగిట మిస్టర్ కూల్
- నేడు భారత్ – శ్రీలంక నాలుగో వన్డే

కొలంబో : శ్రీలంక పర్యనటలో వరస విజయాలతో దూసుకుపోతున్న భారత్ జట్టు గురువారం నాడు నాలుగో వన్డేల్లో పాల్గొంటుంది. ఇప్పటికే ఈ సిరీస్‌ను 3–0తో గెలుచుకున్న కోహ్లి సేన మిగిలిన వన్డేల్లోనూ విజయం సాధించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. మరో వైపు శ్రీలంక పరిస్థితి చాలా దయనీయంగా వుంది. వరస ఓటములు, గాయాలు శ్రీలంకను అతలాకుతలం చేస్తున్నాయి. కాగా, నేడు జరిగే వన్డేకు బౌలర్ లసిత్ మలింగ శ్రీలంక కెప్టెన్‌గా వ్యహరించనున్నాడు. ఈ సిరీస్‌లో శ్రీలంకకు మలింగకు మూడో కెప్టెన్ కావడం విశేషం. రెండో వన్డేలో స్లో ఓవర్ రేటు కారణంగా అప్పుడు కెప్టెన్‌గా వున్న ఉపుల్ తరంగపై ఐసిసి రెండు మ్యాచ్‌ల నిషేధం విధించింది. దీంతో మూడో వన్డేకు కపుగెదెర కెప్టెన్‌గా వున్నాడు. అయితే గాయంతో ఈ నాలుగో వన్డేకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో శ్రీలంక యాజమాన్యం మలింగకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. కాగా ఇప్పటి వరకూ వన్డేల్లో మలింగ 299 వికెట్లు సాధించాడు. నేటి మ్యాచ్‌తో అతను 300 వికెట్ల క్లబ్‌లో చేరడంపై దృష్టి పెట్టాడు. కాగా, శ్రీలంక ఇప్పుడు చాలా క్లిష్ట పరిస్థితిలో వుంది. ఈ సిరీస్‌లో మిగిలిన రెండు వన్డేల్లోనూ విజయం సాధించడం ఆ జట్టుకు చాలా ముఖ్యం. సిరీస్ కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న ఆ జట్టుకు విజయాలు పరువు దక్కిస్తాయి. అలాగే ఈ విజయాలతో 2019 ప్రపంచ కప్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది. సెప్టెంబరు 30 నాటికి వన్డే ర్యాంకింగ్స్‌లో తొలి 8 స్థానాల్లో వున్న జట్లు ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. టాప్–8లో స్థానం నిలపుకోవాలంటే శ్రీలంకకు ఈ రెండు మ్యాచ్‌ల్లో విజయాలు చాలా ముఖ్యం. ఈ దశలో చాలా ఒత్తిడితో శ్రీలంక మ్యాచ్‌లోకి దిగుతుంది. కాగా, నేటి మ్యాచ్‌తో 300 వన్డే మైలురాయిని భారత క్రికెటర్ మహేందర్ సింగ్ ధోని అందుకోనున్నాడు. దీంతో ఈ ఘనత సాధించిన ఆరో భారత ఆటగాడిగా ధోని నిలవనున్నాడు. భారత్ నుంచి ఇప్పటి వరకూ సచిన్ టెండూల్కర్ (363), రాహుల్ ద్రావిడ్ (344), అజారుద్దీన్ (334), సౌరవ్ గంగూలీ (311), యువరాజ్ సింగ్ (302) ఈ ఘనత దక్కించుకున్నారు. అలాగే వికెట్ కీపర్‌గా ధోని ఇప్పటి వరకూ 99 స్టంపింగ్స్ చేసి సంగక్కరతో ప్రపంచ రికార్డుతో వున్నాడు. నేటి మ్యాచ్‌లో మరొక స్టంపింగ్ చేస్తే 100 స్టంపింగ్స్‌తో సరికొత్త ప్రపంచ రికార్డు ధోని వశమవుతుంది. అలాగే నాటౌట్‌ల్లో ప్రపంచ రికార్డు ముంగిట ధోని వున్నాడు. ఇప్పటి వరకూ 72 సార్లు నాటౌట్‌ల్లతో పొలాక్, చమిందావాస్‌లతో ధోని సంయుక్తగా అగ్రస్థానంలో వున్నాడు. మరొక నాటౌట్‌గా నిలిస్తే అత్యధిక నాటౌట్లతో ధోని నూతన ప్రపంచ రికార్డు నెలకొల్పుతాడు.

సిఎంను కలిసిన పివి సింధు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

బాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రపంచ మహిళల బాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో రజిత పతకాన్ని సాధించిన సింధును ముఖ్యమంత్రి అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని సిఎం పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్ బాధ్యతల్ని సైతం సమర్ధవంతంగా నిర్వహించగలిగే సత్తా సింధుకు ఉందన్నారు. అమరావతి బాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు ఎంత వరకు వచ్చిందని కోచ్ గోపిచంద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలోగా అకాడమీ ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు.



హర్యానాపై యు ముంబా గెలుపు

ముంబయి : ప్రొ కబడ్డీ 2017లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో హర్యానా స్టీలెర్స్‌పై యు ముంబా జట్టు విజయం సాధించింది. సొంత మైదానంలో యు ముంబాకు ఇది తొలి గెలుపు. చివరి నిమషంలో దీపక్ కుమార్ దాహియా అజేయ రైడ్‌తో రాణించడంతో యు ముంబయ చివరికి 38–32 పాయింట్ల తేడాతో మ్యాచ్‌ను గట్టెంచుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా హర్యానా జట్టు పై చేయిలో వుంది. తొలుత 10 నిమిషాలు ముగిసే సరికి 7–4 పాయింట్లతో హర్యానా ముందంజలో వుంది. అయితే తరువాత యు ముంబ పుంజుకుంది. దీంతో తొలి అర్ధ భాగం ముగిసే సరికి యు ముంబ 20–15 పాయింట్లతో అధిక్యంలో వుంది. రెండో అర్ధ భాగంలో ఇరు జట్ల ఆటగాళ్ల హోరాహోరీగా పాయింట్లు సాధించారు. దీంతో మరోక 10 నిమిషాల్లో మ్యాచ్ ముగిస్తుందనగా ఇరు జట్లు 27–27 పాయింట్లతో సమానంగా వున్నాయి. ఈ తరువాత కూడా ఇదే ఉత్కంఠ కొనసాగింది. స్కోరు 29–29గా మారింది. అయితే ఇక్కడ యు ముంబ ఆటగాళ్లు మ్యాచ్‌పై పట్టు బిగించారు. దీంతో 34–30, 35–31తో ముంబా అధిక్యంలో సాగింది. చివరి నిమిషంలోనూ దీపక్ జోరుతో ముంబా విజయాన్ని సొంతం చేసుకుంది. కాగా నేటితో ముంబాయిలో మ్యాచ్‌లు ముగిస్తాయి. శుక్రవారం నుంచి కోల్‌కతా వేదికగా మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

నేటి మ్యాచ్‌లు

తెలుగు టైటాన్స్ x తమిళ తలైవాస్
రాత్రి 8:00 గంటల నుంచి
యు ముంబా x జైపూర్ పింక్ పాంథర్స్
రాత్రి 9:00 గంటల నుంచి



గుంటూరులో డొంకరోడ్డులో పర్యటిస్తున్న మంత్రి అఖిల ప్రియ

మంత్రి అఖిలప్రియ పర్యటన వివాదాస్పదం

- మీడియాపై టిడిపి కార్యకర్తల దాడి
- పోలీసు బందోబస్తు లేకుండా పర్యటన
- తమకు సమాచారం లేదన్న డిఎస్‌పి సరిత
- డిజిపికి ఫిర్యాదు

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో బుధవారం మధ్యాహ్నం డొంకరోడ్డులో పర్యాటక శాఖ మంత్రి అఖిల ప్రియ పర్యటన అత్యంత వివాదాస్పదంగా మారింది. గణేష్ ఉత్సవాల్లో ఆమె పాల్గొనేందుకు 15 నిమిషాల్లో ఈ ప్రాంతానికి వస్తున్నారని టిడిపి మీడియా కార్యదర్శిగా ఉన్న చిట్టిబాబు సమాచారం ఇచ్చారు. అయితే గంట తరువాత ఆమె డొంకరోడ్డు వద్దకు వచ్చి గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడేందుకు ప్రయత్నించగా కార్యకర్తలు ఆమెపైకి దూసుకు వచ్చారు. వీరిని నియంత్రించేందుకు పోలీసులు అందుబాటులో లేరు. ఈ నేపథ్యంలో ఆమె కార్యక్రమాన్ని చిత్రీకరించేందుకు కెమెరామెన్లు ముందుకు రాగా వారిని టిడిపి కార్యకర్తలు తోసేశారు. ఈ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక విలేకరి, ఇద్దరు కెమెరామెన్లు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసు అధికారులు ఈ ప్రాంతంలో లేకపోవడంతో అల్లరి మూకలు కొంత మంది మంత్రికి అతి చేరువగా వెళ్లేందుకు ప్రయత్నించారు. గన్‌మెన్‌లతోపాటు ఆమె సోదరుడు, నంద్యాల నూతన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సహకారంతో ఆమె అతి కష్టం మీద బయటకు వచ్చి కారు ఎక్కారు. ఆమె పర్యటనలో పాల్గొనేందుకు వచ్చిన ఇతర శాఖ అధికారులు కూడా ఈ దృశ్యాలను చూసి వెనుదిరిగారు. ఈ ఘటనకు నిరసనగా విలేకరులు, కెమెరామెన్‌లు ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లుగా ప్రకటించారు. అయితే కారులో ఉన్న మంత్రి అఖిల ప్రియ వెంటనే తేరుకుని కారులోంచి మీడియా వారితో మాట్లాడేందుకు పిలవగా వారు వచ్చేందుకు తిరస్కరించారు. ఈ ఘటన స్థానిక పోలీసు అధికారుల దృష్టికి రాగా అసలు మంత్రి పర్యటన ఎప్పుడు జరిగిందని అధికారులు ఆరా తీశారు. మంత్రి పర్యటనపై తమకు సమాచారం లేదని డిఎస్‌పి సరిత తెలిపారు. ఈ అంశంపై మీడియా ప్రతినిధులు బుధవారం రాత్రి గుంటూరులో పర్యటించిన డిజిపి నండూరు సాంబశివరావును కలిసేందుకు ప్రయత్నించగా డిఎస్‌పి అడ్డుకున్నారు. తనకు ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తానని హామీ ఇచ్చారు. డిఎస్‌పి హామీకి అంగీకరించిన మీడియా ప్రతినిధులు డిజిపి కార్యక్రమం నుంచి బయటకు వచ్చి ఆయన వెళ్లే వరకూ వేచి ఉండి జరిగిన ఘటనను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని డిజిపి నగర పోలీసు అధికారులను ఆదేశించారు.

కోస్తాలో వర్షాలు తగ్గుముఖం

ప్రజాశక్తి– ప్రతినిధి విశాఖపట్నం

కోస్తాలో వర్షాలు తగ్గుముఖం పట్టినట్లు విశాఖ వాతావరణం కేంద్రం అధికారులు బుధవారం వెల్లడించారు. గుజరాత్ రీజియన్ మాత్రం అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారే అవకాశాలున్నాయని తెలిపారు. గుజరాత్ కచ్ ప్రాంతంలో బుధవారం రాత్రి ఈ అల్పపీడనం కేంద్రీకృతమైందని పేర్కొన్నారు.

స్వల్పంగా తగ్గుతున్న ఆదాయం

- జిఎస్టీ ప్రభావం ప్రారంభం
- పెరుగుతున్న పన్ను చెల్లింపుదారులు
- ప్రత్యామ్నాయ రాబడిపై అధికారుల దృష్టి

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చిన జిఎస్టీ(వస్తు, సేవల పన్ను) ప్రభావం మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అప్పుడే కొద్దిగా కనిపిస్తోంది. ఒకవైపు పన్నుదారుల సంఖ్య పెరుగుతుండగా, మరోవైపు ఆదాయం స్వల్పంగా తగ్గుతున్నట్లు తెలుస్తోంది. తగ్గే ఆదాయంపై జిఎస్టీ పరిహారం ఎంతవరకు వస్తుందనేది ఇంకా స్పష్టత లేనందున, రాష్ట్ర ఆర్థిక శాఖలో అయోమయం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రానున్న కాలంలో ఆదాయం మరింత తగ్గకుండా చూసేందుకు ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు ప్రారంభిస్తున్నారు.

ఈ ఏడాది జులై ఒకటో తేదీ నుంచి సిఎస్టీ స్థానంలో జిఎస్టీ అమలులోకి వచ్చింది. అనేక రంగాల్లో పన్నులు మారడం, కొన్ని పన్నులు రాష్ట్ర పరిధి నుంచి కేంద్రం పరిధిలోకి వెళ్లడంతో రాష్ట్ర ఆదాయంపై ప్రభావం పడుతోంది. రాష్ట్రాలపై జిఎస్టీ నష్ట ప్రభావం ఎంతమాత్రం ఉండదని కేంద్రం పదేపదే చెప్పినప్పటికీ, తాజా గణాంకాలు చూస్తే ప్రభావం ఉంటున్నట్లు స్పష్టమవుతోంది. జూన్ వరకు వచ్చిన ఆదాయం, జిఎస్టీ అమలు తర్వాత జులైలో వచ్చిన ఆదాయం పరిశీలించిన అధికారులు కొంతవరకు ప్రభావం ప్రారంభమైనట్లు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల్లో సిఎస్టీ ద్వారా రూ. 9046 కోట్లు ఆదాయం లభించింది. కానీ జులైలో జిఎస్టీ ద్వారా రూ. 3076 కోట్లు మాత్రమే లభించింది. ఇది సగటున కొంత ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, రెండో త్రైమాసికం ప్రారంభంలో ఆదాయం ఎక్కువగా ఉండాలని, గతంలో కూడా ఇది స్పష్టమవుతోందని అధికారులు భావిస్తున్నారు. అందుకే పెరిగిన స్వల్ప ఆదాయాన్ని లెక్కల్లోకి తీసుకోరాదని, దీన్ని స్వల్ప ప్రభావంగానే గుర్తించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆదాయం నష్టాల్లోకి వెళ్లడం ఖాయమని వారు తేల్చి చెబుతున్నారు.

జిఎస్టీ కింద పన్ను చెల్లింపుదారులు కూడా పెరుగుతున్నారు. జిఎస్టీ రాకముందు, వచ్చిన తరువాత 22,896 మంది టాక్స్ పేయర్స్ పెరిగినట్లు స్పష్టమవుతోంది. మార్చి 31 వరకు 2,18,530 మంది పన్ను చెల్లింపుదారులుండగా, సిఎస్టీ ముగిసిన జూన్ 30వ తేదీ నాటికి ఈ సంఖ్య 2,41,426 మందికి చేరుకుంది. జులై ఒకటి నుంచి జిఎస్టీ అమలులోకి రావడంతో జూన్ చివరినాటికే కొత్త పన్ను చెల్లింపుదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. జిఎస్టీ అమలు ప్రారంభమైన కొద్ది నెలల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయంటున్నారు.



ధవళేశ్వరం బ్రిడ్జి వద్ద గోదావరి ఉరకలు

ఉరకలేస్తున్న గోదావరి

భద్రాచలం వద్ద 23.03 అడుగులు

సముద్రంలోకి 2.59 లక్షల క్యూసెక్కులు

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. బుధవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 23.03 అడుగులకు పెరిగింది. అదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.80 అడుగులకు చేరింది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను 0.50 మీటర్లకు పైకి లేపి 2.59 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద బుధవారం పాండ్ లెవెల్ 39.06 మీటర్లు ఉంది. గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో కాళేశ్వరం వద్ద బుధవారం 4.68 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. పేరూరు వద్ద 4.87 అడుగులు, దుమ్ముగూడెం వద్ద 7.66 అడుగులు, కూనవరం వద్ద 8.02 అడుగులు, కుంట వద్ద 8.74 అడుగులు, కోయిదా వద్ద 11.56, పోలవరం వద్ద 8.11, రాజమహేంద్రవరం హేవలాక్ బ్రిడ్జి వద్ద 14 అడుగుల నీటిమట్టం నమోదైంది. అదే సమయంలో గోదావరి డెల్టా కాల్వలకు 10,900 క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేశారు. తూర్పు డెల్టా కాల్వలకు 3,600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా కాల్వలకు 5,000, మధ్యడెల్టా కాల్వలకు 2,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

వైసిపిలో నంద్యాల ప్రకంపనలు

- ఎమ్మెల్యేలు పార్టీ మారతారంటూ సామాజిక మాధ్యమాల కథనాలు
- వివరణలు ఇచ్చుకుంటున్న నేతలు
- రోజా వ్యాఖ్యలతో నష్టపోయామని అధిష్టానానికి తెలిపిన పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలు వైసిపిని కలవరపెడుతున్నాయి. ఆపార్టీ ఎమ్మెల్యేలు మరింత మంది పార్టీ మారుతున్నారంటూ సోషల్ మీడియాతో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. దీంతో ఎవరెవరు పార్టీ మారే అవకాశం ఉందనేది ఆపార్టీ నాయకత్వం ఆరా తీసుకున్నట్లు తెలుస్తోంది. గత రెండు, మూడు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అంశాల్లో ప్రధానంగా.. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్ సహా పలువురు పార్టీ నేతల పేర్లు ప్రచారమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు మీడియా ముందుకు వచ్చి తాము పార్టీ మారడం లేదని, ఆ ఆలోచన కూడా లేదని వివరణ ఇచ్చుకున్నారు. ఇదే విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి కూడా తీసుకెళతామని చెప్పారు. తమపై కావాలనే ప్రచారం చేస్తున్నారని ఆవేదన కూడా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అయితే తనపై తెలుగుదేశం పార్టీనే మైండ్ గేమ్ ఆడుతోదన్నారు. తన ప్రయాణం జగన్‌తోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. చేశారు. మరో ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ కూడా ఇదే తరహాలో స్పందించారు. పార్టీ మారేందుకు తన నియోజకవర్గంలో పార్టీ నేతలతో సమావేశం అయినట్లు ప్రచారం సాగుతోందని, సామాజిక మాధ్యమాలు సహా పలు టీవీ చానళ్లు ప్రసారం చేశాయని చెప్పారు. తాను మాత్రం పార్టీ మారే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని పార్టీ అధ్యక్షుల దృష్టికి కూడా తీసుకెళ్లానని చెప్పారు. ఎమ్మెల్యే రోజా వ్యవహారంపైనా పార్టీ నేతలు అగ్రహంగా ఉన్నారని, మంత్రి భూమా అఖిల ప్రియపై రోజా చేసిన వ్యాఖ్యల వల్ల చాలా నష్టమే జరిగిందని, ఆమెను కంట్రోల్ చేయాలని, లేదంటే భవిష్యత్‌లో పార్టీకి నష్టమని పలువురు పార్టీ నేతలు వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చినట్లు కూడా ప్రచారమవుతోంది. రోజా సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చుకున్నారు. తాను పార్టీ మారే ఉద్దేశం లేదంటూనే వైఎస్ జగన్ నాయకత్వంపై తనకు ఎంత నమ్మకముందనే విషయాన్ని చెప్పడానికి ప్రయత్నించారు. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలతో ఆయా ఎమ్మెల్యేలంతా రెండు, మూడు రోజుల్లో పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌తో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా వచ్చే ఎన్నికలకు సీట్ల కేటాయింపులో వయసును పరిగణలోకి తీసుకోవాలని పార్టీ నాయకత్వానికి ప్రశాంత్ కిషోర్ సూచించినట్లు పార్టీలో ప్రచారమవుతోంది. 50 సంవత్సరాలలోపు వారికి ఎమ్మెల్యే, ఆపైన వారికి ఎంపీ సీట్లు కేటాయించాలని, అది కూడా గెలిచే వారికే అని ప్రశాంత్ కిషోర్ సూచించినట్లు చర్చ సాగుతోంది. ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు గెలవరని ప్రశాంత్ కిషోర్ సూచించారని, వారందరికీ వచ్చే ఎన్నికల్లో సీట్లు దక్కడం కష్టమేనని అంటున్నారు. సీటు రాకపోవచ్చని భావిస్తున్న నేతలు పార్టీ మారదామనుకుంటున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

దొడ్డిదారి గెలుపు సిగ్గుచేటు

వైసిపి అధికార ప్రతినిధి పార్థసారథి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో దొడ్డిదారిన గెలిచి, అభివృద్ధి గెలిపించిందని ముఖ్యమంత్రి చెప్పుకోవడం సిగ్గుచేటని వైసిపి అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి విమర్శించారు. ఓడిపోతామనే భయంతోనే అధికార పార్టీ విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నంద్యాల ఎన్నికల్లో టిడిపి రూ.200 కోట్లు ఖర్చు చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ప్రకటించని విధంగా దాదాపు రూ.12 వందల కోట్ల అభివృద్ధి పనులను ప్రకటించారన్నారు. ఉప ఎన్నికలతో దాదాపు రెండు నెలల పాటు రాష్ట్రంలో పరిపాలన ఆగిపోయిందని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారంటే, చంద్రబాబు సహా టిడిపి నేతలు వైఎస్ జగన్ అంటే ఎంత భయపడుతున్నారో అర్థమవుతోందన్నారు. 2019 ఎన్నికల్లో నంద్యాల ఉప ఎన్నికను నమూనాగా తీసుకుని ముందుకు వెళతామని ముఖ్యమంత్రి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఓట్లు వేయకపోతే పెన్షన్లు, రేషన్ కార్డులు రానీయమని, ఇళ్లు ఇవ్వమని ఓటర్లను బెదిరించడమేనా మోడల్ అని ప్రశ్నించారు. లేకుంటే 175 నియోజకవర్గాల్లోనూ రూ. 35 వేల కోట్లు ఖర్చు చేసి గెలవాలనేమైనా ఆలోచనలు చేస్తున్నారా అని నిలదీశారు. ఎన్ని బెదిరింపులు చేసినా 70 వేల మంది ధైర్యంగా వైసిపికి ఓటు వేశారని అన్నారు. నంద్యాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే చూస్తూ ఊరుకోమని, భరతం పడతామని హెచ్చరించారు.

కాపు కార్పొరేషన్ కోచింగ్ అక్రమాలుఅవకతవకలపై కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

కాపు కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. గత మూడు రోజులుగా చార్టర్డ్ అకౌంటెంట్లు కార్పొరేషన్ ఫైళ్లను తనిఖీ చేస్తున్నట్టు తెలిసింది. పోటీ పరీక్షల శిక్షణతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సంబంధించిన ఫైళ్లను లోతుగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే అవకతవకలపై ఎటువంటి అనుమానాలు తలెత్తకుండా కార్పొరేషన్ సిబ్బంది జాగ్రత్తపడ్డారని, దీన్ని ఛేదించే పనిలో సిఏలు నిమగ్నమయ్యారని తెలుస్తోంది. కాపు కార్పొరేషన్ ద్వారా పోటీ పరీక్షలకు అందిస్తున్న ఉచిత శిక్షణలోనూ, అలాగే నైపుణ్యాభివృద్ధి శిక్షణ తీసుకుంటున్నట్టు తప్పుడు సమాచారాన్ని రికార్డుల్లో చూపిస్తూ కార్పొరేషన్ సిబ్బంది నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు గుర్తించిన బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బి ఉదయలక్ష్మి, దీనిపై విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చేపట్టిన విచారణలో అవకతవకలు జరిగినట్టు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలిసింది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68